
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 206

సోమవారం 16-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అఫ్గాన్.. అద్భుతం
వరల్డ్ కప్ లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై విజయం -14లో



మీ ఫండ్‌కు మీరే మేనేజర్..?
'స్టాక్స్'లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు - 15లో



ఆకలి కేకలు.. ఆర్తనాదాలు
ఇజ్రాయెల్ నిర్బంధంలో చిక్కుకున్న గాజాలోని ప్రజలు ఆహారం, నీళ్ల కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
వివరాలు 6లో ▶



మాజీ సీఈసీ గిల్ కన్నుమూత
కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ మనోహర్‌సింగ్ గిల్ కన్నుమూశారు.
వివరాలు 6లో ▶



మన టెక్నాలజీ అమెరికా కావాలంది
చంద్రయాన్-3 విజయవంతమవ్వడంతో అమెరికా నిపుణులు మన టెక్నాలజీని కోరు తున్నారని ఇస్రో చైర్మన్ సోమనాథ్ చెప్పారు.
వివరాలు 6లో ▶



ఎన్సీపీ నేత ఆస్తులు అటాచ్
బ్యాంకులను మోసం చేసిన కేసులో ఎన్సీపీ మాజీ ఎంపీ ఈశ్వర్‌లాల్‌కు చెందిన రూ.315 కోట్ల ఆస్తుల్ని ఈడీ అటాచ్ చేసింది.
వివరాలు 6లో ▶

ఫ్యాక్ట్ చెక్

'కొండంత' అబద్ధం

- రుషికొండ టూరిజం పునర్నిర్మాణ ప్రాజెక్టుపై 'ఈనాడు' విష ప్రచారం
- 9.88 ఎకరాల్లో మాత్రమే ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు.. ఆ మేరకే సీఆర్‌జెడ్ నుంచి అనుమతులు
- వాస్తవానికి భవనాలు కట్టింది 1.84 ఎకరాల్లోనే..

- వివరాలు 7లో

'సర్టిఫై' చేసినా సణుగుడే..

- గతేడాది ఎకరాకు 25 కేజీల చొప్పున 25 శాతం సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ
- ఈ ఏడాది ఎకరాకు 40 కేజీలు.. 40 శాతం సబ్సిడీ
- నాణ్యమైనవని నిర్ధారణ అయ్యాకే రైతులకు పంపిణీ
- అయినా బురదజల్లడమే పనిగా ఈనాడు రాతలు

- వివరాలు 5లో


ఇప్పుడు మన్ కీ గీత్..

తాళాలు వేసి ఉన్న తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పున్నియం గ్రామ పంచాయతీ కార్యాలయం





చిత్తూరు జిల్లా మిట్టపాళెంలోని గ్రామ సచివాలయం

మాకూ ఓ జగన్!

సంక్షేమం కోసం ఏపీ సరిహద్దు గ్రామాల తపన

గడప వద్దకే సేవలపై తమిళనాడు ప్రజల ప్రశంసలు

కూతవేటు దూరంలోని ఏపీ గ్రామాల్లో సంక్షేమ జల్లులు

వివక్షకు తావులేదు.. అవినీతికి ఆస్కారమే లేదు

పొలిమేర దాటకుండానే పారదర్శకంగా పనులు

అండగా సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లీనిక్స్

ప్రతీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని ప్రశంసిస్తున్న 'తంబి'లు

ఆంధ్రా - తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో పౌరసేవలు, పథకాల తీరుపై 'సాక్షి' గ్రాండ్ రిపోర్ట్

పంపాన వరప్రసాదరావు, వడ్డే బాలశేఖర్ – ఏపీ, తమిళనాడు సరిహద్దు గ్రామాల నుంచి సాక్షి ప్రతినిధులు

పక్క పక్కనే ఉన్న సరిహద్దు గ్రామాల్లో ఎంత తేడా! కూత వేటు దూరంలోని పల్లెలో ప్రతి గడపనూ సంక్షేమం పలకరిస్తుండగా ఆ అదృష్టం తమకు దక్కలేదని 'తంబి' నిట్టూరుస్తున్నాడు!! మిట్టపాళెం (ఆంధ్రప్రదేశ్), పున్నియం (తమిళనాడు) గ్రామాలు కలిసే ఉంటాయి కానీ వేర్వేరు రాష్ట్రాల్లో ఉన్నందున ప్రజల జీవన ప్రమాణాలు, పొందుతున్న పౌరసేవల్లో ఎంతో వ్యత్యాసం ఉంది. రైతులను ఆదుకోవడం నుంచి ఆరోగ్య సేవల వరకు..

మిగతా 2వ పేజీలో ▶

ఏపీలో పింఛన్ పథకం భేష్

మేం కూడా అదే బాటలో పెంచుకుంటూ పోతాం

ఏపీ సీఎం జగన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసలు

12లో

పెట్టుబడుల పరుగులు..

రాష్ట్రంలో మరో రూ.1,624 కోట్లు వాస్తవ రూపంలోకి..

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా నాలుగు యూనిట్ల ప్రారంభోత్సవాలు

- మరో రెండు ఫార్మా యూనిట్లకు శంకుస్థాపన
- ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 4,160 మందికి ఉద్యోగావకాశాలు
- విశాఖలో 1,000 సీటింగ్ సామర్థ్యంతో ఇన్ఫోసిస్ కార్యాలయం ప్రారంభోత్సవం
- అనకాపల్లి ఫార్మా సెజ్‌లో మూడు ఫార్మా కంపెనీలు, రెండు ఫార్మా యూనిట్లకు శంకుస్థాపన



విశాఖలోని ఇన్ఫోసిస్ కార్యాలయం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం కృషి ఫలితంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మరో రూ.1,624 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రానున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యటనలో పలు ఐటీ, ఫార్మా కంపెనీల ప్రారంభోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధానంగా విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు ఐజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, లారస్ ల్యాబ్‌లను ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 4,160 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఇక సీఎం సోమవారం ప్రారంభించే, భూమి పూజ నిర్వహించే

మిగతా 2వ పేజీలో ▶



DIRECTORATE GENERAL OF GST INTELLIGENCE,
Pune Zonal Unit,
'A' Wing, 3rd Floor, GST Bhawan
Sassoon Road, Pune-411001.

F.No: DGCEI/PRU/INT/42/2017/628

To : The Principal Director General, DGGSTI, New Delhi
From: Additional Director General, DGGSTI, PZU

INCIDENT REPORT NO. 22/ST/2017-18

Name and address of the assessee	M/s Skiller Enterprises India Pvt Ltd (formerly known as PVSP IT Skills Projects Pvt Ltd) 316/274 Second Floor, West End Marg, Saidulajab, New Delhi-110030 Service Tax Registration No. AAICP2127JSD001 Range-60, Hauz Khas New Division, Central GST Delhi-South New Commissionerate

స్కిల్ స్కామ్ కేసు 2017లోనే నమోదైందని కేంద్ర జీఎస్టీ డైరెక్టర్ జనరల్ 2018 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వానికి రాసిన లేఖ

2017లోనే 'స్కిల్' కేసు

నమోదు, దర్యాప్తు మొదలైంది అప్పుడే..

- స్పష్టం చేస్తున్న కేంద్ర జీఎస్టీ డీజీ లేఖ
- అప్పట్లోనే రాష్ట్రానికి సమాచారమిచ్చినా.. కేసును తొక్కిపెట్టిన టీడీపీ సర్కారు.. పాత కేసులకు పాత చట్టమే వర్తిస్తుంది
- చంద్రబాబుకు '17ఏ' వర్తించదని నిపుణుల స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: స్కిల్ స్కామ్ కేసులో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిన మాజీ సీఎం చంద్రబాబు 'సెక్షన్ 17ఏ'ను సాకుగా చూపిస్తూ విచారణను అడ్డుకునేందుకు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. ఈ కేసు 2020లో నమోదైందని బుకాయిస్తున్న టీడీపీ వాదనకు కేంద్ర జీఎస్టీ విభాగం లేఖ ద్వారా తెర దించింది. టీడీపీ సర్కారు హయాంలోనే స్కిల్ స్కామ్ మూలాలు వెలుగులోకి వచ్చాయని, దీనిపై 2017లోనే కేసు నమోదైందని ఆ లేఖలో స్పష్టం చేసింది. జీఎస్టీ విభాగం లేఖ వెలుగులోకి రావడంతో ఈ కేసులో

మిగతా 12వ పేజీలో ▶

టెన్త్ ఫెయిలైన వాళ్లంతా తిరిగి బడికి



ఫలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కృషి 12లో

ఇప్పటికే 88,342 మంది విద్యార్థులు తిరిగి స్కూల్‌కు..

- టెన్త్ ఫెయిలైన విద్యార్థుల వివరాల సేకరణ
- పదో తరగతి ఫెయిల్ అయితే చదువు ఆపేయకుండా ప్రభుత్వం చర్యలు.. వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు
- మళ్లీ చేరిన వారికి కూడా ప్రభుత్వ పథకాలు



'ఎన్‌బీఏ' గుర్తింపే లక్ష్యం

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో నాణ్యతా ప్రమాణాలు పెంపు
- తొలి దశలో 41 కాలేజీలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ గుర్తింపు లభించేలా చర్యలు
- ఇప్పటికే 9 కాలేజీలకు లభించిన ఎన్‌బీఏ గుర్తింపు

2లో



రూ.80 లక్షల అక్రమ బంగారం స్వాధీనం

షార్జా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న రూ.80 లక్షల విలువైన 1.4 కేజీల బంగారాన్ని గన్నవరం విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన ఇద్దరు మహిళలు గోవా నుంచి దుబాయ్ వెళ్లి.. అక్రమంగా ఆభరణాలు తెచ్చినట్లు అధికారులు గుర్తించారు.

5లో

వచ్చేనెల నుంచి కొత్త విధానంలో

సర్టిఫికెట్ల జారీ

దీనిపై ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ

నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారుల ఆదేశాలు

సాక్షి, అమరావతి: ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీకి వచ్చే నెల నుంచి కొత్త విధానం అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ఆయా శాఖల ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనుంది. కుల ధ్రువీకరణ పత్రం ఒకసారి తీసుకుంటే అది శాశ్వతమని, అలాగే తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ శాఖలు, సంస్థలు లబ్ధిదారులను ఒత్తిడి చేయకూడదని, ఆరు దశల నిర్ధారణ ప్రక్రియను వినియోగించాలని ప్రభుత్వం పలు మార్గదర్శకాలను జారీ చేసింది. కుల ధ్రువీకరణలకు సంబంధించిన సమాచారం మొత్తాన్ని సంక్షేమ శాఖలు అప్‌డేట్ చేయాలని ఆదేశించింది. వీటిపై మండల, జిల్లా స్థాయి అధికారులకు ఈ నెల 26వ తేదీలోపు శిక్షణ ఇవ్వాలని సూచించింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏపీ సేవ ద్వారా ఈ ధ్రువీకరణ పత్రాల

మిగతా 2వ పేజీలో ▶



నేటి నుంచి విశాఖలో త్రిసభ్య కమిటీ పర్యటన

సాక్షి, విశాఖపట్నం: నీతి ఆయోగ్ గ్రోత్ హబ్ సిటీ, రాజధాని వసతులు, సౌకర్యాల పరిశీలనకు ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ బృందం సోమవారం నుంచి విశాఖలో క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. విశాఖలో సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో రుషికొండలోని ఐటీ హిల్స్‌లో ఏర్పాట్లను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్‌లతో ఓ బృందాన్ని నియమించిందని ఈ కమిటీ ఇప్పటికే పని ప్రారంభించిందనీ.. క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించనుందని తెలిపారు.

వాహనాలు ఢీకొనకుండా ఆటోమేటిక్ బ్రేకులు

సాక్షి, అమరావతి: రహదారిపై ప్రమాదాలకు చెక్ పెట్టే ఆధునిక వ్యవస్థ 'వెహికల్ టు ఎవ్రీథింగ్(వీ2ఎక్స్) టెక్నాలజీని కార్లలో ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర రవాణా శాఖ భద్రతా ప్యానల్ ఈ మేరకు సిఫార్సులను ఆమోదించి కేంద్రానికి నివేదించింది.

భారత్ ఎన్‌క్యాప్ ప్రోగ్రాంలో స్థానం

దేశంలో 2021లో సంభవించిన 4,12,000 రోడ్డు ప్రమాదాల్లో 1,53,972 మంది మరణించారు. అందుకే రహదారి భద్రత కోసం వీ2ఎక్స్ టెక్నాలజీని కేంద్రం తాజాగా 'న్యూ కార్ ఎసెస్‌మెంట్ ప్రోగ్రాం(ఎన్‌క్యాప్)లో చేర్చింది. అంటే ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తి చేసే కార్లకు భద్రతా రేటింగ్స్ నిర్ణయించేటప్పుడు ఈ టెక్నాలజీని ప్రమాణికంగా తీసుకుంటారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వ రహదారి భద్రతా ప్యానల్ 58 పేజీల నివేదికను సమర్పించింది. ఈ టెక్నాలజీని దేశంలో ఉత్పత్తి చేసే కార్లలో ప్రవేశపెట్టే అంశంపై కేంద్ర రవాణా, టెలీకమ్యూనికేషన్ల శాఖల ఉన్న తాధికారులతో కూడిన కమిటీ నిర్ణయం తీసుకోనుంది.

వీ2ఎక్స్ ఎలా పని చేస్తుందంటే...

ఈ టెక్నాలజీని కార్ల తయారీలోనే అంతర్భాగంగా చేస్తారు. వైఫై ఆధారంగా ఇది పనిచేస్తుంది. ప్రస్తుతం కార్లు, ఎస్‌యూవీలలో ఉన్న భద్రతా ఫీచర్లు పూర్తిస్థాయిలో సత్ఫలితాలను ఇవ్వడం లేదని నిపుణులు భావిస్తున్నారు. కార్లు, ఎస్‌యూవీలలోనే ఈ టెక్నాలజీని అంతర్భాగంగా చేయడంతో తగినంత దూరం నుంచే రహదారిపై ఎదురుగా, పక్కన, వెనుక ఉన్న వాహనాలను గుర్తించి డ్రైవర్లను అప్రమత్తం చేస్తుంది. రోడ్లపై రద్దీ, రోడ్డు పక్కన పాదచారుల విషయంలోనూ అప్రమత్తం చేస్తుంది. టోల్ గేట్లు, రోడ్డు మలుపులు, యూటర్న్‌లు, ప్రమాద హెచ్చరిక బోర్డుల గురించి ముందుగానే సమాచారమిస్తుంది. పరిమితికి మించి వాహనాలు ఒకదానికొకటి సమీపానికి చేరుకుంటే ఆటోమేటెడ్ బ్రేకింగ్ వ్యవస్థ పని చేసి ఆ వాహనాలు నిలిచిపోతాయి.

'ఎన్‌బీఏ' గుర్తింపే లక్ష్యం

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో నాణ్యతా ప్రమాణాలు పెంపు
- తొలి దశలో 41 కాలేజీలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ గుర్తింపు లభించేలా చర్యలు
- ఇప్పటికే 9 కాలేజీలకు లభించిన ఎన్‌బీఏ గుర్తింపు
- విద్యా సంవత్సరం ముగిసే నాటికి మరో 32 కాలేజీలకు లభించేలా కసరత్తు
- భారీగా పెరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్





శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కరిక్యులమ్‌లో మార్పులు చేయడంతో పాటు మొట్టమొదటిసారి సాంకేతిక విద్యా, శిక్షణ మండలి ద్వారా పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తెచ్చింది. ఇండస్ట్రీ కనెక్ట్ పేరుతో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ విద్యార్థులకు బోధన సమయంలోనే లభించేలా చర్యలు తీసుకుంది. కోర్సు పూర్తయ్యేలోగా విద్యార్థులకు మెరుగైన కొలువులు లభించేలా సంస్కరణలు తెచ్చింది. అలాగే రాష్ట్రంలో మొత్తం 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలుండగా.. తొలి దశలో 41 కాలేజీలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించేలా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే తొమ్మిది కాలేజీల్లోని 16 ప్రోగ్రామ్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. మిగిలిన 32 కాలేజీలు కూడా ఈ విద్యా సంవత్సరం చివరి నాటికి ఎన్‌బీఏ గుర్తింపు పొందేందుకు సిద్ధమయ్యాయి. వీటిలోని 5 కాలేజీల్లో అన్ని రకాల తనిఖీలు పూర్తవ్వగా.. ఈనెల చివరి వారంలో మరో 5 కాలేజీల్లో ఎన్‌బీఏ బృందాల సందర్శనకు షెడ్యూల్ ఖరారైంది. రెండో దశలో భాగంగా వచ్చే విద్యా సంవత్సరంలో మరో 43 కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించేలా సాంకేతిక విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. వృత్తి విద్యా రంగంలో నాణ్యత, కొలువులు సాధించే సామర్థ్యాలను నిర్ధారించే అంతర్జాతీయ ప్రమాణాల అక్రెడిటింగ్ ఏజెన్సీగా భారతదేశంలో ఎన్‌బీఏ వ్యవహరిస్తోంది. విద్యార్థుల సంఖ్య, అధ్యాపకుల నిష్పత్తి, పీహెచ్‌డీ స్థాయి అర్హతలు, ఆర్థిక వనరుల వినియోగం, ఐపీఆర్-పేటెంట్లు, స్వీయ మూల్యాంకనం, జవాబుదారీతనం, నిపుణుల తయారీ తదితర అంశాలను ఎన్‌బీఏ పరిశీలిస్తుంది. వీటన్నింటి ఆధారంగా పాలిటెక్నిక్ కాలేజీలకు గుర్తింపునిస్తుంది. కాగా, ప్రభుత్వం ఇటీవల కొత్తగా 3 పాలిటెక్నిక్ కాలేజీలను ప్రారంభించింది. వీటికి మూడేళ్ల తర్వాతే ఎన్‌బీఏ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునే అర్హత లభిస్తుంది.

ప్రభుత్వ కృషితో పెరిగిన ప్లేస్‌మెంట్స్

మరోవైపు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులకు బోధన సమయంలోనే ఉపాధి లభించేలా వివిధ పరిశ్రమలతో సాంకేతిక విద్యా శాఖ 674 అవగాహన ఒప్పందాలు చేసుకుంది. దీంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్ల సంఖ్య భారీగా పెరిగింది. 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 7,073 మంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకోగా.. వారిలో 4 వేల మందికిపైగా విద్యార్థులు కొలువులు సాధించారు. గతంలో పది శాతానికే పరిమితమైన ప్లేస్‌మెంట్స్.. ఇప్పుడు 59.6 శాతానికి పెరిగాయి.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు

గతంలో ఎన్‌బీఏ గుర్తింపు సాధించడంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు వెనుకబడ్డాయి. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌బీఏకు అనుగుణంగా కాలేజీల్లో ప్రమాణాలు పెంచాలని సాంకేతిక విద్యా శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా శ్రీకాకుళం, విజయవాడ, కుప్పం, అనకాపల్లి, గన్నవరం, కళ్యాణదుర్గం, ఆమదాలవలస, కాకినాడ, గుంటూరు పాలిటెక్నిక్ కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు దక్కింది. ఆయా కాలేజీల్లో పరిసరాల పరిశుభ్రత మొదలు భవనాల మరమ్మతులు, కొత్త నిర్మాణాలు, ప్రయోగశాలల ఆధునికీకరణ, విద్యార్థులకు వసతుల మెరుగు, సిబ్బంది రేషనలైజేషన్ తదితర మార్పులు తీసుకువచ్చాం. తద్వారా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు లభించేలా చర్యలు తీసుకున్నాం.

– చదలవాడ నాగరాణి, కమిషనర్, సాంకేతిక విద్యా శాఖ

పెట్టుబడుల పరుగులు..

▶ మొదటి పేజీ తరువాయి

యూనిట్ల వివరాలివీ..

ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్..

విశాఖపట్నంలోని మధురవాడ ఐటీ హిల్ నెంబర్-2లో ఇన్ఫోసిస్ ఒక కొత్త డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసింది. సుమారు రూ.41 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌ను భవిష్యత్తులో మరింత విస్తరించనున్నారు. ఇది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా పనిచేస్తుంది. దీని ఇంటీరియర్ డిజైన్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైబ్రీడ్ వర్క్‌ప్లేస్‌గా రూపొందించారు. దాదాపు వెయ్యిమంది ఈ సెంటర్ నుంచి పనిచేయనున్నారు. గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా ఈ కార్యాలయాన్ని తీర్చిదిద్దారు. అత్యంత అధునాతన సదుపాయాలతో విశాలమైన ఆడియో, వీడియో కాన్ఫరెన్స్ హాల్స్, అధునాతన కేఫ్‌టేరియా, విశాలమైన పార్కింగ్ సౌకర్యాలతో ఈ సెంటర్‌ను నిర్మించారు. దీని ప్రారంభోత్సవం అనంతరం ఇన్ఫోసిస్, వివిధ కంపెనీల ఐటీ ప్రతినిధులతో సీఎం సంభాషిస్తారు.

ఇజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్..

ఫార్మా, బయోటెక్ ఉత్పత్తులకు సంబంధించి రూ.300.78 కోట్లతో పరవాడ ఫార్మాసిటీలో నిర్మించిన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఇజియా (ఈయూఐజీఐఏ) యూనిట్‌ను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నారు. ఈ యూనిట్ ద్వారా 800 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.



విశాఖపట్నంలోని రిషికొండలో ఐటీ సెజ్

లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్..

యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్ (ఏపీఐ) ఉత్పత్తులకు సంబంధించి రూ.421.70 కోట్లతో అచ్యుతాపురంలో నిర్మించిన ఈ యూనిట్‌ను సీఎం ప్రారంభిస్తారు. దీని ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాల కల్పన జరగనుంది. ఇదే కంపెనీ మరో 15 ఎకరాల్లో రూ.407.40 కోట్లతో ఏర్పాటు చేసే యూనిట్ నిర్మాణ పనులకు కూడా సీఎం భూమిపూజ చేస్తారు.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్..

ఇక అచ్యుతాపురం ఏపీ సెజ్‌లోని లారస్ ల్యాబ్స్‌లో నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని, యూనిట్-2 ఫార్ములేషన్ బ్లాక్‌ను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. రూ.460 కోట్లతో ఏర్పాటుచేసిన ఈ యూనిట్ ద్వారా 1,200 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. దీంతోపాటు రూ.407.40 కోట్లతో లారస్ ల్యాబ్స్ కొత్త పరిశ్రమకు కూడా సీఎం భూమిపూజ చేస్తారు. బీచ్ క్లీనింగ్ కోసం జీవీఎంసీ కొనుగోలు చేసిన ప్రత్యేక వాహనాల్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

సీఎం పర్యటన ఇలా..

- సోమవారం ఉదయం ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవం అనంతరం సీఎం హెలికాప్టర్‌లో అనకాపల్లి జిల్లా పరవాడకు చేరుకుంటారు. రాంకీ ఫార్మాసిటీలోని అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఇజియా (ఈయూఐజీఐఏ) స్టెరిలీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో నూతన యూనిట్‌ను ప్రారంభిస్తారు.
- అక్కడి నుంచి హెలికాప్టర్‌లో అచ్యుతాపురం సెజ్‌కు చేరుకుని లారెస్ ఫార్మా ల్యాబ్‌లో యూనిట్-2 ఫార్ములేషన్ బ్లాక్, ఎల్ఎస్‌పీఎల్ యూనిట్-2ని ప్రారంభిస్తారు.
- హెలికాప్టర్ ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని విజయవాడకు బయల్దేరతారు.

ఈ నేపథ్యంలో.. మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా అధికారులతో కలిసి ఆదివారం రుషికొండ ఐటీ సెజ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. బీచ్ యంత్రాలు ప్రారంభించే ప్రాంతంతో పాటు హెలిప్యాడ్‌ను సందర్శించిన మంత్రి.. అక్కడి ఏర్పాట్లు గురించి ఆరా తీశారు.

వచ్చేనెల నుంచి కొత్త విధానంలో సర్టిఫికెట్ల జారీ

▶ మొదటి పేజీ తరువాయి

జారీ ప్రక్రియను అమలు చేసేందుకు, విధివిధానాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడం, తల్లిదండ్రులు, తోబుట్టుల వివరాల ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ డేటాబేస్‌ను అనుసంధానించడం వంటి పనులన్నీ అక్టోబర్ 19వ తేదీకల్లా పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో ప్రభుత్వం పేర్కొంది. అలాగే ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి ఆరు దశల నిర్ధారణ ప్రక్రియ విధానాన్ని సంక్షేమ, ఇతర శాఖలు చేసుకునేందుకు వీలుగా గ్రామ, వార్డు సచివాలయ డేటాబేస్‌తో అనుసంధానించే ప్రక్రియను ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేయాలని షెడ్యూల్ రూపొందించింది. 30వ తేదీలోపు ఆయా శాఖల మండల, జిల్లా స్థాయి అధికారులు, అలాగే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు వేర్వేరుగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని నిర్ణయించింది.

మాకూ ఓ జగన్!



చిత్తూరు జిల్లా మిట్టపాళెంలో నిర్మించిన సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఆర్బీకే భవనాలు

మిట్టపాళెంలో నాలుగేళ్లలో ఎంత అభివృద్ధి?

రక్షిత మంచినీటి పథకం	రూ.34 లక్షలు
నాడు - నేడుతో పాఠశాలల అభివృద్ధి	రూ.46 లక్షలు
సచివాలయం	రూ.40 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.21.80 లక్షలు
వైఎస్సార్ హెల్త్ కేర్ సెంటర్	రూ.20.80 లక్షలు
సీసీ రోడ్లు నిర్మాణం	రూ.10.50 లక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

పింఛన్ల నుంచి మహిళా సాధికారత వరకు.. చదువుల నుంచి పౌరసేవల దాకా ప్రతి విషయంలోనూ మన సరిహద్దు గ్రామం మిట్టపాళెంను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందు వరుసలో నిలబెట్టింది. చెంతనే ఉన్న పల్లెలు కావడంతో ఆ తేడా కళ్లకు కట్టినట్లు స్పష్టంగా తెలిసిపోతోంది. తమ పొరుగు గ్రామంలోని ప్రజలకు అందుతున్న సంక్షేమం, పౌరసేవలను చూసి ఆశ్చర్యానికి గురవుతున్న తమిళనాడు వాసులు తమకూ జగన్ లాంటి నాయకుడు ఉంటే బాగుండని కోరుకుంటున్నారు. ఏపీ-తమిళనాడు సరిహద్దు గ్రామాలను సందర్శించిన 'సాక్షి' ప్రతినిధుల బృందం మిట్టపాళెం, పున్నియం వాసులను పలుకరించి క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిశీలించింది.

మిట్టపాళెంలో ఆనందం ఇలా

పథకం పేరు	ఎంత లబ్ధి? (2022-23 వరకు)
వైఎస్సార్ పింఛన్	రూ.5.10 కోట్లు (475 మందికి)
వైఎస్సార్ ఆసరా	రూ.1.65 కోట్లు (426 మందికి)
వైఎస్సార్ చేయూత	రూ.1.24 కోట్లు (660 మందికి)
అమ్మ ఒడి	రూ.1.15 కోట్లు (233 మందికి)
రైతు భరోసా	రూ.1.10 కోట్లు (836 మందికి)
జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన	రూ.24.30 లక్షలు (244 మందికి)
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా	రూ.14 లక్షలు (62 మందికి)
వైఎస్సార్ బీమా	రూ.5 లక్షలు (ఐదుగురికి)
జగనన్న చేదోడు	రూ.1.50 లక్షలు (15 మందికి)
జగనన్న తోడు	రూ.29 వేలు (29 మందికి)
నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల నిర్మాణం రూ.1.21 కోట్లు	

☞ తమిళనాడులోని సరిహద్దు గ్రామం పున్నియం పంచాయతీ పరిధిలో సామాజిక పింఛన్లతో పాటు ఇటీవలే ప్రారంభించిన కుటుంబానికి ఓ మహిళకు రూ.వెయ్యి ఆర్థిక సాయం మినహా మరే పథకం ద్వారా సాయం అందడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

☞ ఏపీలోని మిట్టపాళెం పంచాయతీ పరిధిలో మిట్టపాళెంతో పాటు మిట్టపాళెం ఏఏ డబ్ల్యూ (ఆది ఆంధ్రా వాడ), చిన్నతంగల్, మేలపట్టు, మేలపట్టు హెచ్‌డబ్ల్యూ (హరిజనవాడ) గ్రామాలుండగా 2,452 జనాభా నివసిస్తోంది. 930 కుటుంబాలున్నాయి. తమిళనాడులోని పున్నియం పంచాయతీ పరిధిలో పున్నియంతో పాటు నల్లవన్నెంపేట, పున్నియం కాలనీ గ్రామాల్లో 1,850 జనాభా, 450 కుటుంబాలున్నాయి.

అక్కడ తాళం కప్ప.. ఇక్కడ అడిగిందే తడవు

తమిళనాడులోని సరిహద్దు గ్రామం పున్నియం పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా తాళం వేసి ఉంది. కార్యదర్శి కాదు కదా కనీసం అటెండర్ కూడా అక్కడ లేరు. ఎందుకిలా? అని గ్రామస్తులను ఆరా తీయగా కార్యాలయానికి అధికారులు రోజూ రారని సమాధానమిచ్చారు. నెలలో కొద్ది రోజులు మాత్రమే ఇక్కడ అందుబాటులో ఉంటారని, ఏ పని కావాలన్నా 13 కి.మీ. దూరంలో ఉన్న పళ్లిపట్టులోని బ్లాక్ కార్యాలయానికి వెళ్లాల్సిందేనని చెప్పారు. ఒకటికి పది సార్లు తిరిగితే కానీ చిన్న పని కూడా జరగదని పున్నియం గ్రామస్తుడు ఆర్.కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. పక్కనే ఉన్న మిట్టపాళెంలో ఒకే ప్రాంగణంలో ఏర్పాటైన గ్రామ సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నాయి. అయితే నాలుగేళ్ల క్రితం వరకు వీరు కూడా ఏ పని కావాలన్నా 15 కి.మీ. దూరంలో ఉన్న మండల కేంద్రం నగరి వెళ్లేవారు. నాడు చెప్పులరిగేలా తిరిగినా పనులు జరగని దుస్థితి. ఇప్పుడు గ్రామంలోనే సచివాలయం, ఆర్బీకేల రాకతో వలంటీర్ల ద్వారా గడప వద్దే సేవలన్నీ పొందగలుగుతున్నారు. ఇటీవలే జగనన్న సురక్ష క్యాంపైన్ ద్వారా పైసా ఖర్చు లేకుండా ఏకంగా 456 సేవలు పొందగలిగారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలే కాకుండా వన్ బీ, అడంగల్, మ్యుటేషన్ లాంటి అన్ని రకాల పౌరసేవలను ఎలాంటి వ్యయ ప్రయాసలకు గురికాకుండా పొందగలుగుతున్నారు.

ఆరోగ్యం ఆమడ దూరం.. ఇక్కడ ఇంటికే డాక్టర్

ప్రజారోగ్య పరిరక్షణ విషయానికి వస్తే 6 వేల మంది జనాభాకు ఒకటి చొప్పున పున్నియం గ్రామంలో ఒక సబ్‌సెంటర్ ఉంది. ఒక ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) అందుబాటులో ఉంటూ బీపీ, షుగర్ లాంటి సాధారణ పరీక్షలు చేసి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు మందు బిళ్లలు ఇస్తున్నారు. డెంగ్యూ, మలేరియా, వివిధ వ్యాధుల నిర్ధారణకు ర్యాపిడ్ టెస్ట్‌లు అందుబాటులో లేవు. టెలీ మెడిసిన్ సౌకర్యం లేదు. వైద్యుడి సేవలు పొందాలంటే 13 కి.మీ పైగా దూరంలో ఉండే స్వర్ణపేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లాల్సిందే. అదే ఏపీలో 2 వేలకు పైగా జనాభా ఉన్న మిట్టపాళెం పంచాయతీలో ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఏర్పాటు చేసింది. క్లినిక్‌లో బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగిన ఎంఎల్‌హెచ్‌పీ, ఒక ఏఎన్ఎంతో పాటు ఆశావర్కర్ ఉన్నారు. ఈ క్లినిక్‌లో 105 రకాల మందులు, 14 వైద్య పరీక్షలు, టెలీమెడిసిన్ సౌకర్యం ఉంది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా బుగ్గ అగ్రహారం పీ హెచ్‌సీ వైద్యుడు నెలకు రెండు సార్లు మిట్టపాళెం గ్రామాన్ని సందర్శిస్తున్నారు. రోజంతా గ్రామంలోనే ఉంటున్నారు. బీపీ, షుగర్ బాధితులు, గర్భిణులు, పిల్లలు, వృద్ధుల ఆరోగ్యాలపై ఆరా తీసి అవసరమైన వైద్య సేవలందిస్తున్నారు. మంచానికే పరిమితమైన అనారోగ్య బాధితుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నారు. టెలిమెడిసిన్ ద్వారా స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్ సేవలు సైతం ఇక్కడ అందుబాటులోకి ఉన్నాయి. మిట్టపాళెం ప్రజలు నాణ్యమైన మెరుగైన వైద్యం కోసం వ్యయ ప్రయాసలకోర్చే పరిస్థితులు లేవు.

ఏపీలో ఉండాలని అనిపిస్తోంది..



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఎస్.మురుగన్ తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు బ్లాక్ పరిధిలోని పున్నియం దళితవాడ నివాసి. మన రాష్ట్ర సరిహద్దులోని చిత్తూరు జిల్లా నగరి మండలం మిట్టపాళెం పక్కనే ఆ ఊరు ఉంటుంది. రైతు కూలీ, దివ్యాంగుడైన మురుగన్ రూ.1,200 పింఛన్ అందుకుంటుండగా ఇటీవలే రూ.1,500కి పెరిగింది. బ్యాంక్ ఖాతాలో జమ అయ్యే పెన్షన్ డబ్బుల కోసం రోజూ ఎదురు చూడాల్సిందే. నెలలో ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. మురుగన్ కుటుంబానికి సొంతంగా ఇల్లు కానీ ఇంటి స్థలంగానీ లేదు. గ్రామంలో ఎంతో మందిది ఇదే పరిస్థితి. పక్క గ్రామంలో తమలాంటి నిరుపేద కుటుంబాలకు సీఎం జగన్ అండగా నిలుస్తుండటాన్ని చూసినప్పుడు తమ రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే తరహాలో సంక్షేమ పథకాలను అమలు చేస్తే బాగుంటుందని మురుగన్ కోరుకుంటున్నాడు. 'వికలాంగులకు ఏపీలో రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్నారు. మాకు రూ.1,500 మాత్రమే వస్తోంది. ఆ పెన్షన్ సొమ్ము తీసుకోవడానికి కూడా పడిగాపులు కాయాలి. ఇవన్నీ చూసినప్పుడు పక్కనే ఉన్న సరిహద్దు గ్రామంలోకి వెళ్లి ఏపీ స్థానికత పొందాలనిపిస్తోందని చెబుతున్నాడు.

సుబ్రహ్మణ్యం సంబరం..!



చిత్తూరు జిల్లా నగరి మండలం మిట్టపాళెం వాసి డి.సుబ్రహ్మణ్యం నిరుపేద వర్గానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు. వైఎస్సార్ పెన్షన్ కానుక కింద రూ.2,750 వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాడు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ ఇస్తున్నాడు. కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉండడంతో ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయం వస్తోంది. ఆయన భార్య హంసకు వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 చొప్పున జమ అవుతోంది. ఆయన ఇద్దరు పిల్లలకు పక్కా గృహ యోగాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. పెద్ద కుమారుడికి భార్య పేరుతో వీకేఆర్ పురం లేఅవుట్‌లో రూ.3 లక్షల ఖరీదైన స్థలం, ఇంటి నిర్మాణానికి సాయం అందింది. రెండో కుమారుడికి సొంత స్థలంలో ఇంటి నిర్మాణ బిల్లును ప్రభుత్వం మంజూరు చేసింది. 'నాకు వైఎస్సార్ హయాంలో మంజూరైన పింఛన్‌ను టీడీపీ ప్రభుత్వంలో తీసేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పింఛన్ పెంచడమే కాకుండా గతంలో ఎప్పుడూ మా కుటుంబం ఇంత లబ్ధి పొందలేదు' అని సుబ్రహ్మణ్యం సంతోషంగా చెబుతున్నాడు.

కూతవేటు దూరంలో ఎంత తేడా!



తమిళనాడులోని సరిహద్దు గ్రామం పున్నియంలో నివసించే మల్లీశ్వరి చిన్నకారు మహిళా రైతు. ఎరువులు, విత్తనాలు కొనాలంటే ఎన్నో అగచాట్లు పడాలి. ఏది కావాలన్నా 13 కి.మీ.దూరంలోని పళ్లిపట్టుకు వెళ్లాల్సిందే. పీఎం కిసాన్ కింద కేంద్రం ఏటా మూడు విడతల్లో ఇచ్చే రూ.6,000 సాయం మినహా అక్కడి రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఆమెకు ఎలాంటి పెట్టుబడి సాయం అందదు. ఆ పక్కనే కూతవేటు దూరంలోని మిట్టపాళెం వాసులకు ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు రైతు ముంగిటికే అందుతున్నాయి. ఏటా రైతు భరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయం అందుతోంది. రైతులు గిట్టుబాటు ధరలకు పంటలను విక్రయించేలా ఏపీ ప్రభుత్వం తోడుగా నిలుస్తోంది. ఉచిత బీమా, విపత్తులతో నష్టపోతే నష్ట పరిహారాన్ని అందిస్తోంది. 'మిట్టపాళెంలో ఉన్న మా బంధువులకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వింటుంటే సంతోషమనిపిస్తుంది. జగన్ పాలన చూస్తుంటే ఒక్కోసారి ఆంధ్రాలో పుట్టి ఉంటే బాగుండేదేమో అనిపిస్తుంది. కాసింత అసూయగానే ఉన్నా పొలం పుట్రా, పిల్లా పాపలను వదిలి వెళ్లలేం కదా' అని మల్లీశ్వరి అంటోంది.

అమ్మ తరఫు బంధువుల్లో ఆశ్చర్యం..



నిరుపేద రైతు కుటుంబానికి చెందిన టీకే తమిళసెల్వి మన రాష్ట్రంలోని సరిహద్దు గ్రామం మిట్టపాళెం నివాసి. నలుగురు సంతానం. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 తమిళసెల్వి బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి. డిగ్రీ చదువుతున్న ఆమె కుమారుడికి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన అందుతున్నాయి. ఆమె భర్త వెంకటేష్‌కు రెండేళ్ల క్రితం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా బైపాస్ సర్జరీ జరిగింది. ఏడాది పాటు మందులు ఉచితంగా ఇచ్చారు. ఆమె కుటుంబానికి వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రభుత్వం ఏటా రూ.13,500 ఇస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఆర్బీకేలోనే తీసుకుంటున్నారు. 'మా కుటుంబంలో ప్రతి ఒక్కరికి సీఎం జగన్ ప్రభుత్వంలో లబ్ధి చేకూరింది. మా అమ్మ తరఫు బంధువులంతా తమిళనాడులోనే ఉన్నారు. మాకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధి గురించి చెబుతుంటే ఆశ్చర్యపోతున్నారు. తమ పిల్లలకు ఆంధ్రాలో పెళ్లి సంబంధాలు చూడాలని కోరుతున్నారు' అని తమిళ సెల్వి చెబుతోంది.

వాళ్ల మాదిరిగా పేదలమే అయినా..



మేకల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. రెక్కలు ముక్కలు చేసుకుంటే కానీ నాలుగేళ్లు నోటికెళ్లవు. రేషన్ సరుకులు మినహా ప్రభుత్వ పరంగా మాకెలాంటి సాయం అందడం లేదు. ఈ మధ్యే కుటుంబంలో మహిళకు రూ.1,000 ఇస్తున్నారు. అదీ కూడా అందరికి అందడం లేదు. అదే మిట్టపాళెం వాసులకు అక్కడి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తోంది. కుటుంబంలో ప్రతీ ఒక్కరూ లబ్ధి పొందుతున్నారు. వాళ్ల మాదిరిగానే మేము పేదవాళ్లమే. అలాంటి సంక్షేమ పథకాలను మా ప్రభుత్వం కూడా ప్రవేశపెడితే బాగుంటుంది.

– మణియమ్మ, నల్లవెన్నంపేట, పున్నియం పంచాయతీ

ప్రతి గడపకూ సాయం



నాకు 3 ఎకరాల పొలం ఉంది. వరి, పూల తోటను సాగు చేస్తా. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందుతోంది. నాకు రూ.2,750 చొప్పున ప్రతి నెలా పింఛన్ వస్తోంది. నా భార్య జగదాకు చేయూత కింద ఏటా రూ.18,750 ఇస్తున్నారు. ఆసరా రూపంలో ఏటా రూ.10 వేలు జమ చేశారు. నా పెద్ద కుమారుడు మురుగన్‌కు ఇంటి రుణం ఇచ్చారు. కోడలికి అమ్మఒడి, ఆసరా వస్తోంది. గతంలో పథకాలు అందడం అటుంచి ఎలా దరఖాస్తు చేయాలో కూడా తెలిసేది కాదు. ఇప్పుడు వలంటీర్లు ఇంటికొచ్చి వివరించి దగ్గరుండి మరీ దరఖాస్తు చేయిస్తున్నారు. ప్రతి గడపకూ సాయం అందుతోంది'.

– బాలం రాజలింగం, చిన్నతంగల్, మిట్టపాళెం పంచాయతీ

గౌరవంగా చూస్తున్నారు



ఏ నెలలో ఏ సంక్షేమ పథకం ఇస్తారో, ఎలా దరఖాస్తు చేసుకోవాలో ఇంటింటికి వెళ్లి తెలియజేస్తున్నాం. సొంత బిడ్డలా ఆదరిస్తున్నారు. అమ్మ ఒడి, ఆసరా పథకాల ద్వారా నేను కూడా లబ్ధి పొందా. ఆటో నడిపే నా భర్తకు వాహన మిత్ర వస్తోంది. మా అత్తకు చేయూత, ఆసరా, ఇళ్ల స్థలం వచ్చింది'

– జి.విజయలక్ష్మి, వలంటీర్, చిన్నతంగలి గ్రామం, మిట్టపాళెం పంచాయతీ

మారుమూల పల్లెలకు వరం



గతంలో పంచాయతీ కార్యదర్శి వారానికో పది రోజులకో ఒకసారి గ్రామానికి వచ్చి కొద్దిసేపు కూర్చొని వెళ్లిపోయేవారు. ఎప్పుడొచ్చేది కూడా ప్రజలకు తెలిసేది కాదు. ఏ పని కావాలన్నా నగరి వెళ్లాల్సిందే. రాజకీయ నేతల సిఫారసులు, చేతులు తడపనిదే పనులయ్యేవి కావు. ఇప్పుడు సచివాలయం వచ్చిన తర్వాత ఏ ఒక్కరూ పొలిమేర కూడా దాటడం లేదు. ఎలాంటి సిఫార్సులు, పైసా ఖర్చు లేకుండా పౌరసేవలు అందుతున్నాయి. వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకుని సంక్షేమ ఫలాలను పొందుతున్నారు. సచివాలయాలు వలంటీర్ వ్యవస్థలు మారుమూల పల్లెలకు నిజంగా ఓ వరం.

– గురువా వినోద్‌కుమార్, మిట్టపాళెం సచివాలయ కన్వీనర్



అత్యంత మంచి చేసి కూడా అతి తక్కువ ఫలితం పొందేది కుక్కలు, తత్వవేత్తలు.

– డైయొజినీజ్

సాక్షి

సోమవారం, 16 అక్టోబర్ 2023

శాంతి అనిత్యం, యుద్ధమే నిత్యం

బతుకు–చావు, యుద్ధమూ–శాంతి, ప్రేమ–విద్వేషం, కారుణ్యం–కర్కశత్వం... ఇవి పరస్పర వ్యతిరిక్తాలూ, ఒకదానికొకటి ఎంతో దూరాలూ అనుకుంటాం. కానీ, వాస్తవంలో ఎంత దగ్గరగా ఉంటాయో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. బతుకును అంటిపెట్టుకునే చావు ఉంటుందని తెలిసినా; అది హత్యో, ఆత్మహత్యో, యుద్ధం పేరిట సామూహిక హత్యో కాక, సహజ మరణమైతే, ఆ దారి వేరు. బతుక్కీ, చావుకీ మధ్య ఉంటుందనుకునే దూరాన్ని చెరిపివేస్తూ హఠాత్తుగా యుద్ధాలు బద్దలవుతాయి. ఇజ్రాయెల్–పాలస్తీనాల మధ్య పదిరోజుల క్రితం మొదలైన యుద్ధం ఇప్పటికే వేలసంఖ్యలో బతుకు దీపాలను ఆర్పివేసింది. బతుకునిచ్చే అమ్మతనాన్ని భక్తితో స్మరించుకుంటూ తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాలలో అమ్మవారిని మన దగ్గర కొలుచుకోనున్న రోజుల్లోనే, అక్కడ ఆ మూల సమరనాదాలు, తల్లుల గర్భశోకాలు మిన్నంటడం వైచిత్రి.

అమ్మ ఎక్కడైనా అమ్మే! అమ్మకు, అమ్మతనానికి ప్రాంత, మత, భాషాభేదాలు లేవు. చారిత్రకంగా చూసినా ఒకప్పుడు ప్రపంచమంతటా మొదటగా కొలుపులందుకున్నది అమ్మే; అయ్య కొలుపు ఆ తర్వాతే వచ్చింది. అమ్మ అంటే అన్నమూ, అభయమూ కూడా! అమ్మవారిని ధనలక్ష్మిగానూ, ధాన్యలక్ష్మిగానూ కూడా భావించుకుంటాం. అమ్మ చేతుల్లో వరికంకులను, చెరుకుగడలను అలంకరిస్తాం. అమ్మకు రకరకాల అన్నాలు ఇష్టమని చెప్పి నివేదించి ఆ అన్న ప్రసాదాలను మనమే ఆరగిస్తాం. మన దగ్గరే కాదు, ఒకప్పుడు అమ్మ ఆరాధన ఉన్న ప్రతిచోటా అమ్మను అన్నానికి ప్రతీకగానే కొలిచారు. అమ్మను బతుకమ్మ అనడంలోనే, పది కాలాలపాటు సుఖశాంతులతో బతికించే అమ్మ ఆశీస్సు ఉంది.


అమ్మను కొలుస్తూనే అమ్మ మనసుకు దూరమై యుద్ధానికి దగ్గరవడమే మనిషి జీవితంలోని పెను విషాదం. తను దగ్గరవడమే కాదు; అన్నసాధనాలు ధరించిన అమ్మ చేతుల్లో కూడా ఆయుధాలు ఉంచి; అన్నపూర్ణను ఆయుధపూర్ణగా మలచిన చరిత్ర మనిషిది. మానవ చారిత్రక ప్రస్థానంలో ఇది ఎప్పుడు మొదలైందో కానీ, ఇప్పటికీ తనకు యుద్ధమే కావాలో శాంతే కావాలో తేల్చుకోలేని సందిగ్ధంలోనే మనిషి ఉన్నాడు. యుద్ధానికీ, శాంతికీ మధ్య మనిషి చక్రభ్రమణం నిరంతరాయంగా సాగుతూనే ఉంది. యుద్ధమే ప్రధానమై శాంతి ఎంత అప్రధానమైందంటే, రెండు యుద్ధాల మధ్య తాత్కాలిక విరామాన్నే శాంతిగా నిర్వచించుకునే పరిస్థితికి వచ్చాం. శాంతికాలంలో యుద్ధాన్ని జపించడం, యుద్ధకాలంలో శాంతిని స్మరించడం మనిషికి పరిపాటిగా మారింది. యుద్ధం కడుపున శాంతిశిశువును, శాంతి కడుపున యుద్ధశిశువును కోరుకోవడమూ అంతే నిత్యసత్యమైంది. యుద్ధమొచ్చి శాంతిని చెదరగొడుతున్నట్టు భ్రమిస్తాం కానీ; వాస్తవానికి శాంతే మధ్య మధ్య వీచే మలయమారుతమై ప్రచండమైన యుద్ధపు వేడిగాడ్పులకు అవరోధమవుతోందన్న ఎరుక మనకు లేదు. యుద్ధమే ఇక్కడ శాశ్వతంగా తిష్ఠవేసిన చుట్టమై; శాంతి ఎప్పుడైనా తొంగిచూసే అతిథి మాత్రమైంది.

యుద్ధమనే ఎడారిలో శాంతీ, సుఖసంతోషాల ఒయాసిస్‌లను లియో టాల్‌స్టాయ్ నవల 'యుద్ధమూ–శాంతీ' అద్భుతంగా కళ్ళకు కట్టిస్తుంది. అమెరికా అంతర్యుద్ధం దరిమిలా ఎంత విధ్వంసం జరిగిందో, ఎందరి బతుకులు తలకిందులయ్యాయో మార్గరెట్ మిచెల్ నవల 'గాన్ విత్ ద విండ్' అనితరసాధ్యంగా చిత్రిస్తుంది. ఇంకా వెనక్కి, మహాభారతానికి వెడితే, యుద్ధాన్ని యజ్ఞంగా పేర్కొని పవిత్రీకరించడమే కాదు; రోగమొచ్చి చావడం కన్నా యుద్ధంలో చావడం పరమపుణ్యప్రదమని కీర్తించడం కనిపిస్తుంది. చివరికది అపార జననష్టంతో పాటు, యోధజాతి మొత్తం ఎలా తుడిచిపెట్టుకుపోయిందో ఒక మహావిలయ సదృశంగా చిత్రిస్తుంది. అందులోని స్త్రీపర్వం మొత్తం భర్తలను, కొడుకులను, తండ్రులను, సోదరులను కోల్పోయి గుండెలు బాదుకునే స్త్రీ నిర్భరశోకాన్ని కరుణ రసార్ద్రంగా వినిపిస్తుంది. ఆ దుఃఖం గాంధారినోట శాపంగా మారి యాదవకుల విచ్ఛిత్తి రూపంలో మరో విధ్వంసం వైపు నడిపిస్తుంది. యుద్ధాన్ని ఆకాశానికెత్తిన మహాభారతమే, దాని విపరీత పర్యవసానాలను ఎత్తిచూపి సామాన్యులూ, మాన్యులైన మునులూ కూడా తీవ్రంగా గర్హించిన సంగతినీ నమోదు చేయడం విశేషం. యుద్ధపశ్చాత్తాపం జీవితాంతమూ ధర్మరాజును ఎంతగా వెన్నాడుతూ వచ్చిందంటే, అశ్వమేధయాగాన్ని తలపెట్టి అర్జునుని అశ్వం వెంట పంపిస్తూ, రాజులను ఓడించు కానీ ప్రాణనష్టం మాత్రం కలిగించవద్దని హెచ్చరించవలసి వచ్చింది.

ప్రాంతాలు, మతాలు, సంస్కృతులు, భాషల మధ్య ఎక్కడా కనిపించనంత సాదృశ్యం యుద్ధాలలో కనిపిస్తుంది. యుద్ధరూపంలోని ఊచకోత ఎక్కడైనా ఒక్కలానే ఉంటుంది. గ్రీకు మహాకవి హోమర్ చెప్పిన ఇలియడ్ అచ్చం మహాభారతానికి ప్రతిబింబంలా ఉంటుంది. అది చిత్రించిన ట్రాయ్ యుద్ధం చివరిలో కూడా అయినవారిని కోల్పోయిన తల్లులు, భార్యల దుఃఖారావాలూ, ఆర్తనాదాలూ గుండెల్ని పిండివేస్తాయి. ఇన్ని అనుభవాలున్నా; ఇన్నిన్ని శోకసముద్రాలు కట్టలు తెంచుకున్న ఉదాహరణలు కళ్ళముందున్నా మనిషిలో యుద్ధోన్మాదం ఉపశమించలేదు; సమర మోహం తీరలేదు; రుధిరదాహం చల్లారలేదు. శాంతియుతంగా జీవించడం మనిషి ఇప్పటికీ నేర్చుకోలేదు. యుద్ధంలో చివరికి అటూ ఇటూ విజితులే తప్ప విజేతలెవరూ ఉండరనీ; మిగిలేవి శవాలూ, జీవచ్ఛవాలు మాత్రమేనన్న నిష్ఠురసత్యాన్ని మనిషి ఇప్పటికీ జీర్ణించుకోలేదు. బతుకునిచ్చే, బతకనిచ్చే అమ్మతత్వానికి దూరంగా చావు దిశగా ఈ చీకటి ప్రస్థానం ఎంతకాలం?!

పట్టి పీడిస్తున్న దిగుబడి భూతం

విశ్లేషణ



డాక్టర్ దొంతి నరసింహారెడ్డి

దిగుబడి గురించి గొప్పలు చెప్పుకోవడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. దిగుబడి, ఉత్పత్తి, ఉత్పాదకత మధ్య ఉన్న వివిధ కోణాలను అధికార గణం విస్మరిస్తున్నారు. దిగుబడి పెంపుదల నినాదంగా పెట్టుకుని, దేశీయ రైతుల జ్ఞానాన్నీ, శ్రమనూ కించపరుస్తున్నారు. ఈ దిగుబడి జాడ్యం విదేశాల నుంచి, ప్రత్యేకంగా అమెరికా నుంచి చుట్టుకున్నది. ఇప్పుడు ఆకలి తీర్చడం లక్ష్యం కాదు. ఆదాయం పెరగాలంటే దిగుబడులు పెంచాలంటున్నారు. కానీ అనేక సమస్యల మధ్య దిగుబడులు ఎక్కువ అయినా ప్రతి సందర్భంలో రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడం ప్రత్యక్షంగా చూస్తున్నాం. విత్తనాలు ఎరువులు అమ్మేవారు అధిక దిగుబడుల ఆశను రైతులలో కల్పిస్తూ, తమ లాభాలను మాత్రం పెంచుకుంటున్నారు. దిగుబడి ఒక ఆయుధం!

ప్రభుత్వం దిగుబడి పెంచడానికి వివిధ రకాలుగా పెడుతున్న ఖర్చు... రైతులకు గిట్టుబాటు ధరలు అందించే వ్యవస్థ మీద పెట్టే దాని కంటే అనేక రెట్లు ఎక్కువ. వరి, గోధుమల అధిక ఉత్పత్తి కొరకు గత 50 ఏండ్లలో కేటాయించిన నిధులు, ఆహారం కొరకు చేసిన కృషిగా కొంత వరకు అర్థం చేసుకోగలం. కానీ గత 25 ఏండ్లలో వాణిజ్య పంటల దిగుబడులు పెంచడానికి ప్రకటించిన విధానాలు, కంపెనీలకు ఇస్తున్న సబ్సిడీలు, సరళీకరించిన నిబంధనలు రైతుకు మేలు చేయకపోగా కీడు చేస్తున్నాయి.



కొత్త వంగడాలు ప్రకటించి పంటల దిగుబడి చూసుకుని మురుస్తున్నారే కానీ దాంట్లో పోషకాల శాతం ఎంత అనేది మరుస్తున్నారు. రోజూ మనం తీసుకుంటున్న ఆహారంలో పోషకాలు లేవని, తగ్గుతున్నాయని వైద్యులు, ఆహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆహారంలో పోషకాలు ఉండాలంటే వైవిధ్యం అవసరాన్ని వారు గుర్తు చేస్తున్నారు. కానీ, వైవిధ్యం కాదు, ఏక పంట విధానం ద్వారానే అధిక దిగుబడి వస్తుందని ఆధునిక దిగుబడి శాస్త్రం మనకు నూరిపోస్తున్నది.

ఏదైనా వస్తువు, లేదా పని ఎక్కువ చేయాలంటే ఉత్పాదకతను కొలమానంగా తీసుకుంటారు. మౌలిక వనరులను సరి అయిన మోతాదులో ఉపయోగించడం ద్వారా ఉత్పత్తిని పెంచడం ఉత్పాదకతను సాధించినట్టుగా భావిస్తారు. ఏదైనా పరిశ్రమలో అధిక ఉత్పాదకత కొరకు ప్రోత్సాహకాలు ఇస్తారు. అదే రైతు ఉత్పాదకతను పెంచితే ప్రోత్సాహకంగా పంట ధర పెరగడం లేదు. 2010, 2019లో భారత రైతులకు మైనస్ రూ.2.36 లక్షల కోట్లు, మైనస్ రూ.1.62 లక్షల కోట్ల మేర ప్రతికూల మద్దతు లభించిందని ఒక అంతర్జాతీయ నివేదిక (ఓఈసీడీ– ఐరోపా దేశాల ఆర్థిక కూటమి) అంచనా వేసింది. 2000 మినహా 2000–2019 మధ్య కాలంలో రైతులకు మద్దతు స్థిరంగా ప్రతికూలంగా ఉంది. ఓఈసీడీ అంచనా ప్రకారం మైనస్ 1.62 లక్షల కోట్ల రూపాయల ప్రతికూల మద్దతు 2019లో వ్యవసాయ మంత్రిత్వ శాఖ మొత్తం బడ్జెట్ కేటాయింపుల కంటే రూ.1.09 లక్షల కోట్లు ఎక్కువ. రైతులకు రావాల్సిన పైకం ఎక్కువ, కాని వస్తున్నది తక్కువ అని ఈ నివేదిక సారాంశం.

2016–17లో ఒక క్వింటాల్ గోధుమ ఉత్పత్తికి హరియాణా రైతుకు రూ.2,219 ఖర్చయిందనీ, కేంద్రం నిర్ణయించిన క్వింటాలుకు రూ.1,625 కనీస మద్దతు ధర కంటే అది రూ. 594 ఎక్కువనీ అక్కడి ప్రభుత్వం స్వయంగా అంగీకరించింది. ఈ పరిస్థితి అధిక దిగుబడి వల్ల మారుతున్నదా? గిట్టుబాటు ధర రానప్పుడు రైతుకు దిగుబడి దిగులు ఎందుకు? 'ఉత్పత్తి పెంచండి' అని పిలుపునిచ్చే శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులు, గిట్టుబాటు ధర విషయంలో మాత్రం కిమ్మనరు. విత్తనాలు, ఎరువులు, పంట రసాయనాలు అమ్మేవారు మాత్రం అధిక దిగుబడుల ఆశను రైతులలో కల్పిస్తూ తమ లాభాలను పెంచుకుంటున్నారు. వీరి వాణిజ్య ప్రకటనలకు దన్నుగా శాస్త్రవేత్తలు ఫిడేలు వాయిస్తుంటారు.

వ్యవసాయంలో పంటల దిగుబడులు పెంచాలంటే అనేక మార్గాలు ఉన్నాయి. నేల సారం అధికంగా ఉంటే పంట పోషకాలతో కూడి ఎక్కువ కాత, పూత వస్తుంది. సరి అయిన నీరు అందిస్తే మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. పూతకు, కాతకు గాలిలో, నేలలో తేమ ఉపయోగపడుతుంది. ఈ తేమ ఉండాలంటే, ప్రాంతీయంగా పచ్చదనం ఉండాలి. జీవ వైవిధ్యం ఎక్కువగా ఉంటే వాతావరణం అనుకూలంగా ఉంటుంది. మొక్కలు ఆరోగ్యంగా ఉంటే పురుగుల తాకిడి తక్కువగా ఉంటుంది. నేలలో పోషకాలు పెంచే ఉపాయాలు అనేకం ఉన్నాయి. నిరంతరంగా, సహజంగా నేలలో సారం పెంచితే రైతు మీద ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా, దేశీ విత్తనాల ద్వారా అధిక దిగుబడులు సాధించి సంతోషంగా ఉన్న రైతులు కోకొల్లలు. ప్రపంచ రికార్డు వరి దిగుబడి ఒక వ్యవసాయ పరిశోధనా కేంద్రం లేదా అమెరికాలో పెద్ద భూస్వామి కాకుండా, బిహార్ రాష్ట్రంలో ఒక రైతు సాధించాడు. దర్వేశ్‌పుర గ్రామంలో సుమంత్ కుమార్‌కు హెక్టారుకు 22.4 టన్నుల దిగుబడి వచ్చింది. అది కూడా సిస్టం ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్ (ఎస్ఆర్ఐ) పద్ధతి వల్ల వచ్చింది. రైతు మీద భారం లేకుండా సహజ పద్ధతుల ద్వారా, ప్రమాదకర రసాయనాల అవసరం లేకుండా, కంపెనీల గత్తర విత్తనాలు నాటకుండా, దిగుబడి వస్తే మంచిదే కదా!

దిగుబడి మీద పరిమితులు ఉంటాయి. ఒక దశ తరువాత దిగుబడి పెరగదు. ఎంత దక్షత ఉన్నా ఉత్పాదకతను ఒక స్థాయికి మించి పెంచలేము. ప్రకృతి నుంచి వచ్చే ఉత్పత్తులలో అనేక కారణాల రీత్యా దిగుబడిలో కాలానుగుణంగా హెచ్చుతగ్గులు ఉంటాయి. దీనిని వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో ఎప్పుడూ పరిగణనలోకి తీసుకోలేదు. పాల ఉత్పత్తి ఒక మంచి ఉదాహరణ. ఒక పాడి పశువు నుంచి తీసుకునే పాల దిగుబడి పెంచడానికి మొదట్లో హైబ్రిడ్ ఆవులను ప్రవేశపెట్టారు. తదుపరి వాటి పొదుగులను భారీగా పెంచారు. విదేశాలలో ఈ భారీ పొదుగులతో ఆవులు నడవలేని స్థితికి వచ్చాయి. అయినా పాల దిగుబడి ఇంకా పెంచాలని మేతలో మార్పులు చేశారు. ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు ఇవ్వడం మొదలుపెట్టారు. వీటి అన్నింటి పర్యవసానంగా ఆవు బలహీనపడి, రోగాల బారిన పడింది. కచ్చితంగా అవి అనారోగ్యానికి గురి అవుతాయని తెలిసీ మేతలో 'మందులు' కలుపుతున్నారు. అంటురోగాలు వస్తాయని నిర్ణీత కాలంలో అవసరమున్నా లేకున్నా వ్యాక్సిన్లు, ఇతర 'మందులు' అలవాటు చేశారు. ఇవన్నీ కూడా దిగుబడి తగ్గకూడదు అని చేస్తున్నారు. ఇప్పుడు ఆవులను జన్యుమార్పిడి ప్రయోగాలకు బలి చేస్తున్నారు. ఎన్ని చేసినా ఒక ఉత్థాన దశ చేరుకున్న తరువాత ప్రకృతిలో భాగం అయిన ఆవు పాలు ఎక్కువగా ఇవ్వదు. ఇంకొక వైపు పాలలో కలుషితాలు పెరిగినాయి. ఒక పాడి పశువు 2 లీటర్లు ఇస్తే, ఇంకొక రకం 3 ఇవ్వచ్చు. సంఖ్యాపరంగా తేడా ఉన్నా ఇస్తున్న పాలు నాణ్యంగా ఉన్నాయా లేదా అనేది ముఖ్యం. కాని ఆధునిక దిగుబడి శాస్త్రంలో 'పిండుకోవటం' ఒక వ్యాపార సూత్రంగా మారింది. దానినే ఇప్పుడు 'ఎక్స్‌ట్రాక్టివ్ టెక్నాలజీస్ అండ్ ఎకానమీ' అని పరిగణిస్తున్నారు.

వరి, గోధుమలు, పత్తి వంటి పంటల విషయంలో కూడా ఇదే తీరు కనిపిస్తున్నది. పత్తి దిగుబడులు పెరుగుతాయని ఒక విదేశీ కంపెనీ చెబితే జోరుగా అనుమతులు ఇచ్చి 2003లో బీటీ పత్తిని రైతులకు అంటగట్టారు. గత 15 ఏండ్ల నుంచి 883 బీజీఐఐ హైబ్రిడ్లు మార్కెట్లో అమ్ముతున్నారు. మూడు లేదా నాలుగేళ్లకు హైబ్రిడ్ విత్తనాలు మార్చాలని రైతులకు సూక్తులు చెప్పే శాస్త్రవేత్తలు, అధికారులు ఇన్ని ఏండ్లుగా అవి మార్చకున్నా పట్టించుకోవటం లేదు. దీంతో పత్తిని ఆశించే పురుగులు, చీడ పీడల బెడద పెరిగింది. విష రసాయనాల మీద ఖర్చు పెరిగింది. ఎకరాకు 14 క్వింటాళ్ళు వస్తాయని నమ్మబలికిన కంపెనీలు ఇప్పుడు కేవలం 2 లేదా 3 క్వింటాళ్ళు వస్తుంటే మాట్లాడటం లేదు. జాతీయ సగటు లెక్కల ప్రకారం 2014లో హెక్టారుకు 510 కిలోలు వస్తే, 2022 అది 445 కిలోలకు పడిపోయింది. దిగుబడుల కోసం హైబ్రిడ్ రకాలను ప్రకటించడంలో ఉన్న చిత్తశుద్ధి ఆ యా విత్తనాల పని తీరును ఎప్పటికప్పుడు అంచనా వేయడంలో లేదు.

ఒక ఊత పదంగా మారిన దిగుబడి సందేశాల వెనుక రాజకీయాలు ఉన్నాయి. స్వార్థపర వ్యాపార ప్రయోజనాలు ఉంటున్నాయి. లోపభూయిష్ట విధానాలను దిగుబడి ఒక కవచంగా మారింది. అధిక ఉత్పత్తి సాధించడానికి ప్రకటిస్తున్న విధానాలలో సంపూర్ణత లోపించింది.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదే ఇల్లు



ముప్పై ఏళ్ల క్రితం, ఉన్నట్టుండి ఒక రాత్రి కశ్మీర్, శ్రీనగర్ నుంచి ఉన్నవి ఏవో సర్దుకుని ఒక్క సూటు కేసుతో పారిపోయాం. ఇప్పుడు, 30 ఏళ్ల తర్వాత, ఇంకా ఏం మిగిలి వుందో ఆ ఇంటికి మళ్లీ వచ్చాం. ఇల్లు ఖాళీ. కానీ మూడు దశాబ్దాల క్రితం మేము ఏర్పరుచుకున్న జ్ఞాప కాలు అలాగే ఉన్నాయి. ఈసారి మేము పరుగెత్తాల్సిన అవసరం లేదు. బహుశా ఎప్పటికీ!

– సందీపా ధర్, నటి

నా వైఖరి



నేను పాలస్తీనియన్లకు అండగా ఉంటాను, కానీ హమాస్ ఉపయోగించిన పద్ధతులకు కాదు. నేను యూదులతో సహానుభూతి పొందగలను, కానీ యూదు మతవాద వర్ణవివక్షాపూరిత ఇజ్రాయెల్‌తో కాదు.

– తుషార్ గాంధీ, రచయిత

ఎలా న్యాయం?



కశ్మీరీ పండితులు ఇజ్రాయెల్‌కు మద్దతివ్వడం వక్రోక్తి. ఒకప్పుడు వాళ్లు ఎలా తమ ఇళ్లను కోల్పోయారో పాలస్తీనియన్లు అలాగే కోల్పోతున్నారు. బహుశా వాళ్లు ఇది సరైనదని అనుకుంటున్నట్టున్నారు. అలా అయితే 2014 నుంచి పునరుద్ధరించని వారి బాధిత కార్డును వాళ్లు పారేయాలి.

– జాయ్‌దాస్, వ్యాఖ్యాత

మనిషితనం మాయం



ప్రపంచవ్యాప్తంగా ఈ దశాబ్దంలో జరిగిన పెద్ద నష్టాల్లో ఒకటి, మానవ హక్కుల విధ్వంసం. జాతీయవాదం, మతదురభిమానం, జాతివివక్ష, నిఖార్సైన ద్వేషం... సహానుభూతిని తొక్కేస్తున్నాయి. జనాలు మనుషులుగా ఎలా ఉండాలో మరిచిపోయారు.

– రీతూపర్ణా ఛటర్జీ, పాత్రికేయురాలు

ఉన్మాదం



పైథాగరస్ సిద్ధాంతం గురించి విన్నాక, అది సరైనదో కాదో నిర్ణయించడానికి ఆయన ఏ రాజకీయ పక్షానికి చెందినవాడో అడిగే సమాజాలు నాశనమైనట్టే. లోకం అలా తయారైంది.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

అందరికీ ఆహారమే ధ్యేయం!

సందర్భం



కాట్రగడ్డ సురేష్

ప్రపంచ మానవాళికి ఆహారమే అన్నింటికంటే ముఖ్యమైన అవసరం. ఇదంతా నీటితో ముడిపడిన ఉత్పత్తి. నీరూ ఆహారమే! అందుకే నీటి ప్రాధాన్యంపై ఈ ఏడాది ఐక్యరాజ్య సమితి (యూఎన్ఓ) దృష్టి కేంద్రీకరించి ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 'నీరు జీవం, నీరు ఆహారం' అనే నినాదాన్ని ప్రచారం చేస్తోంది.

ప్రపంచ దేశాలు జనాభా పెరుగుదలకు అనుగుణంగా తగిన నీటి వనరులను పరిరక్షించుకోవాలి. పట్టణీకరణ, వాతావరణ మార్పులు నీటి లభ్యతకు ముప్పు కలిగిస్తున్నాయి. ఈ అవరోధాల్ని అధిగమించి నీటి వనరుల నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. అసంఖ్యాకంగా ప్రజలు ఆకలితో పోరాడుతున్నారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో యూఎన్ఓ విశేషంగా కృషి చేస్తోంది.

వ్యవసాయం, అటవీ, మత్స్య, భూమి, నీటి వనరులను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థల ప్రయత్నాలను యూఎన్ఓ సమన్వయం చేస్తున్నది. దీనికి ప్రత్యేక విభాగంగా ఉన్న 'వ్యవసాయం, ఆహార సంస్థ' దీనిని నిర్వహిస్తోంది. ఆహార సవాళ్లను ఎదుర్కొనే మార్గాలను సూచిస్తున్నది. ఆహార బ్యాంకులకు వస్తువులను స్వచ్ఛందంగా అందించే ప్రచారం నిర్వహిస్తున్నది. చిన్న తరహా రైతులను ప్రోత్సహించి ఆహార ఉత్పత్తులను పెంచేందుకు ప్రపంచ దేశాలకు యూఎన్ఓ సహాయకారిగా నిలుస్తోంది.

పోషకాహార లోపంతో పిల్లలకు మధుమేహం, ఊబకాయం వంటి వ్యాధులు రాకుండా చర్యలు చేబడుతున్నది. కోవిడ్–19 మహమ్మారి సృష్టించిన సంఘర్షణ ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపింది. ఆహార సుస్థిరతను నెలకొల్పడంలో ప్రపంచ దేశాలు ఇంకా సతమతమవుతూనే ఉన్నాయి. జీవితాలను రక్షించే అతి పెద్ద మానవతా సంస్థగా 'వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్' సేవలు అందిస్తున్నది. యూఎన్ఓ విపత్తులు, వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి కోలుకుంటున్న దేశాలకు అండగా నిలుస్తోంది.

వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ద్వారా ఆకలిని తొలగించడం, పోషకాహారం, జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో 1945 నుంచి యూఎన్ఓ ఈ కృషి కొనసాగుతోంది. భారతదేశం సైతం ఈ కృషిలో తనదైన పాత్ర పోషిస్తోంది. దీనిలో ఆంధ్రప్రదేశ్ పాత్ర ప్రత్యేకతను సంతరించుకుంది.

21వ భారత రాజ్యాంగ అధికరణం ప్రతి భారతీయుడికీ జీవించే హక్కును అందించింది. 'భారత ఆహారసంస్థ' ఆహార ధాన్యాలను సకాలంలో సేకరిస్తోంది. సంబంధిత యంత్రాంగం వీటిని పంపిణీ చేస్తున్నది. దేశానికి ఆహార భద్రత కల్పించడం ప్రభుత్వ ముఖ్య బాధ్యత. దీనిని ఆహార ప్రజాపంపిణీశాఖ నిర్వహిస్తున్నది. ఈ సంస్థ 'బీపీఎల్' కుటుంబాలకు ఆహార ధాన్యాలను 'అంత్యోదయ అన్న యోజన' కింద పంపిణీ చేస్తున్నది. ఐసీడీఎస్ ద్వారా దేశంలోని పోషకాహార లోపం సమస్య పరిష్కరింపబడుతోంది. ఈ కేంద్ర పథకాల్ని సమర్థంగా అమలుచేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే ముందు వరుసలో ఉంది.

ఇటీవల ఏపీ ప్రభుత్వం ఆహారకల్తీ పరీక్షల కోసం నాలుగు సంచార వాహనాల్ని కొనుగోలు చేసి రంగంలోకి దించింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ', 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్' పేర్లతో రెండు పౌష్టికాహార పథకాలను విజయవంతంగా అమలు చేస్తోంది. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకం నడుస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులు పెంచడానికి భూసార పరీక్షల్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. ఆయన ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా మినుముల నాణ్యత పెంచాలన్నారు. చిరుధాన్యాల ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 'జల్ జీవన్ మిషన్' ఆంధ్రప్రదేశ్‌లో 99 శాతం గ్రామాల్లో ఇప్పటికే ప్రారంభమైంది. ఈ కేంద్ర ప్రభుత్వ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారం మరిన్ని సత్ఫలితాల్ని చేకూర్చింది. ప్రపంచ ఆహార విధానాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంబంధిత కార్యాచరణను విజయవంతంగా అమలు చేస్తోంది.

వ్యాసకర్త ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ ఏపీ అధ్యక్షులు ı 94412 64249

(నేడు ప్రపంచ ఆహార దినోత్సవం)

విద్యా వ్యవస్థపై సినీ విమర్శనాస్త్రం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఆర్. నారాయణ మూర్తి 'యూనివర్సిటీ: పేపర్ లీక్' అనే కొత్త సినిమా తీశారు. అది ఇటీవల విడుదలయింది. మూర్తి ఆహ్వానం మేరకు, ప్రైవేట్ థియేటర్‌లో ప్రీ–రిలీజ్ స్పెషల్ షో చూశాను. నారాయణ మూర్తి ప్రభుత్వ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, పోలీస్ ఆఫీసర్‌గా డబుల్ యాక్షన్‌లో ప్రధాన పాత్రలో నటించారు. నేటి విద్యా వ్యవస్థను ఎడ్యుకేషన్ మాఫియా ఎలా తన గుప్పిట పెట్టుకుంటున్నదో చూపించిన కమర్షియల్ సినిమా ఇది.

మొట్టమొదటిసారిగా పాఠశాల, విశ్వవిద్యాలయ స్థాయి విద్యా మాధ్యమం మీద, ప్రభుత్వ సదుద్దేశానికీ విద్యారంగంలో ప్రైవేట్ మాఫియా విధ్వంసక పాత్రకూ మధ్య వైరుధ్యంపై ఒక సినిమా రూపొందించారు. ప్రభుత్వ రంగంలో ఇంగ్లిష్ మీడియం అమలు చేయాలనే సాహసోపేతమైన నిర్ణయంతో ఏపీ ప్రభుత్వం చేస్తున్న కొత్త ప్రయోగం లేకుండా, చంద్రబాబు నాయుడు మద్దతు ఉన్న ప్రైవేట్ మాఫియా ఆంధ్రప్రదేశ్‌లోనూ, తెలంగాణలో కూడా ప్రతికూల పాత్ర పోషిస్తుండటం లేకుండా ఈ సినిమా తీయడం అసాధ్యం.

ఒక తెలుగు పండితుడు తన ఎనిమిది వేళ్లకు వజ్రాల ఉంగరాలు ధరించి ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో 'దేశభాషలందు తెలుగు లెస్స' ఎందుకవుతుందో గర్జిస్తూ పాఠాలు చెప్పే సన్నివేశంతో ఈ చిత్రం ప్రారంభమవుతుంది. తెలుగువారంతా తెలుగు మాధ్యమంలోనే చదవాలనీ, తెలుగువారు కేవలం తెలుగు మాధ్యమంలో చదివితేనే తెలుగువారి ఆత్మగౌరవం, జ్ఞానం విశ్వగురువు అవుతాయని ఆయన చెప్తారు.

కానీ అదే తెలుగు పండితుడు ఓ పెద్ద ఇంగ్లిష్ మీడియం ప్రైవేట్ కాలేజీని దాని అసలు యజమానిని మోసం చేసి సొంతం చేసుకుంటాడు. దానిని ప్రైవేట్ విశ్వవిద్యాలయంగా మారుస్తాడు. ఆ తర్వాత విపరీతమైన ఫీజుల ద్వారా ప్రజలను దోచుకోవడం ప్రారంభిస్తాడు. ప్రభుత్వ యూనివర్సిటీలో చదువుతున్న ఒక తెలివైన విద్యార్థి అన్నీ ఫస్ట్ ర్యాంకులు పొందుతున్న ఈ ప్రైవేట్ యూనివర్సిటీకి పంపాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తాడు. అప్పటికే అతడి తల్లి ఈ పిల్లవాడి చదువుకోసం పుస్తెలతాడు అమ్మి ఉన్నందున, అతని తండ్రి తన కిడ్నీని అమ్మి, అతడిని తెలుగు పండిట్ నిర్వహిస్తున్న ప్రైవేట్ ఇంగ్లీషు మీడియం యూనివర్సిటీలో చేర్పిస్తాడు.

నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలకు లాగే, అన్ని నంబర్ వన్ ర్యాంకులూ తెలుగు పండిట్ సొంత విశ్వవిద్యాలయ విద్యార్థులకే వచ్చాయి. అతని విశ్వవిద్యాలయ ప్రకటనలు ఎంత ప్రాచుర్యం పొందాయంటే, గ్రామస్థులు కూడా పుస్తెలమ్ముకుని మరీ వారి అబ్బాయిలను, అమ్మాయిలను ఈ ప్రైవేట్ విశ్వవిద్యాలయానికి పంపేంతగా.

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య కోసం ప్రజానీకం పోరాడుతున్నప్పుడు వారిపై దాడి చేసేందుకు ఈ తెలుగు పండితుడు పోలీసులకు లంచం



ఇస్తాడు. మంత్రులకు లంచం ఇవ్వడానికి కూడా ప్రయత్నిస్తాడు కానీ ఇప్పుడిక్కడ నిజాయతీపరుడైన ఈ ముఖ్యమంత్రి ఉన్నారు. తర్వాత ఈ యూనివర్సిటీ వ్యవహారాలపై ఆయన విచారణకు ఆదేశిస్తాడు.



తెలుగు పండితుడు అన్ని దిగువ స్థాయి ప్రభుత్వ వ్యవస్థలనూ కొనుగోలు చేస్తాడు. పైగా పేపర్ల లీకేజీకి పాల్పడతాడు. తన విశ్వవిద్యాలయంలోని ధనవంతులైన విద్యార్థుల దగ్గర డబ్బులు తీసుకొని వారి బదులు విద్యార్థులు కాని బయటి వారితో పరీక్షలు రాయిస్తాడు. పరీక్షా పత్రాలు దిద్దే మాస్టర్‌లకు డబ్బు చెల్లించడం ద్వారా ప్రభుత్వ విశ్వ విద్యాలయంలోని తెలివైన విద్యార్థులు ఫెయిలయ్యే వ్యవస్థ కోసం అతను ప్లాన్ చేస్తున్నాడు. అలా ఫెయిలైన కారణంగా ఒక తెలివైన విద్యార్థిని ప్రభుత్వ విద్యాలయం క్యాంపస్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. దీంతో ప్రభుత్వ విద్యా సంస్థలు ఏమాత్రం సరిగా బోధించడం లేదని ప్రజలు భావించేలా చేయగలుగుతాడు.

రాష్ట్ర స్థాయి సర్వీస్ కమిషన్ పరీక్షల ప్రశ్న పత్రాలను ఈ ప్రైవేట్ విశ్వవిద్యాలయం కూడా మేనేజ్ చేయగలుగుతుంది. పేద విద్యార్థులు డిగ్రీలు పొందినప్పటికీ వారికి ఉద్యోగాలు రాకుండా తెలుగు పండిట్ మేనేజ్ చేయగలుగుతాడు.

తన సొంత విశ్వవిద్యాలయంలోని ఒక నిజాయతీగల విద్యార్థిని... విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పరీక్షను ఒకరికి బదులు మరొకరు రాస్తున్న విషయాన్ని తన మొబైల్ ఫోన్‌తో రికార్డు చేసిందనే కారణంతో దారుణానికి ఒడిగడతాడు. ఆ ఏరియా పోలీస్ స్టేషన్‌కి చెందిన తన తొత్తు అయిన సీఐ కుమారుడి గ్యాంగ్‌తో ఆమెను అత్యాచారం చేయించి హత్య చేయిస్తాడు. అలాగే ప్రొఫెసర్ పాత్రలో ఉన్న నారాయణ మూర్తిని సీఐ చంపేస్తాడు, కానీ అదే పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పాత్రధారి అయిన నారాయణమూర్తి ఎడ్యుకేషన్ మాఫియా లీడర్ అయిన సీఐని చంపేస్తాడు.

నారాయణమూర్తి సినిమాలో సందేశం చాలా స్పష్టంగా ఉంది. ప్రస్తుత ఆంధ్రా మోడల్ విద్యా విధానాన్ని ఆయన ఎత్తిపడుతున్నారు. అదే సమయంలో ప్రైవేట్ విద్యా మాఫియాను ఎండగడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులు అనుస రించిన ప్రైవేట్ అనుకూల విద్యను కేసీఆర్ హయాంలో తెలంగాణలో కొనసాగిస్తున్న విషయం ఆర్. నారాయణ మూర్తి దృష్టిలో ఉంది.

ఈ రకమైన సినిమాలు డాక్యుమెంటరీ రూపంలో కూడా చాలా అరుదు, జనాదరణ పొందిన వాణిజ్య సినిమాలను వదిలివేయండి. ప్రైవేట్ మాఫియా విద్య వల్ల ప్రాణాలను, వనరులను కోల్పోతున్న తల్లితండ్రులు, విద్యార్థులు తప్పక చూడాల్సిన సినిమా 'యూనివర్సిటీ: పేపర్ లీక్'.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, ఆశ్వయుజమాసం, **తిథి:** శు.విదియ రా.11.56 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** స్వాతి రా.7.32 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.1.16 నుండి 2.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.56 వరకు, తదుపరి ప.2.30 నుండి 3.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.17 నుండి 11.56 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.36.

క్లుప్తంగా...

దసరాకు ప్రత్యేక రైలు

కాచిగూడ–కాకినాడ టౌన్ మధ్య ఏర్పాటు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దసరా పండుగకు విజయవాడ నగరానికి వచ్చే యాత్రికుల సౌకర్యం కోసం కాచిగూడ–కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ప్రకటించారు. కాచిగూడ–కాకినాడ టౌన్ (07653) ఈ నెల 19, 26 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు కాచిగూడలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07654) ఈ నెల 20, 27 తేదీల్లో సాయంత్రం 5.10 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారు జామున 4.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. రెండు మార్గాలలో ఈ రైలు మల్కాజ్‌గిరి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌లలో ఆగుతుంది.

'కాణిపాకం' అంతరాలయ ద్వారానికి వెండి వాకిలి

- రూ.2.5 కోట్లతో ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలు
- వెండి రేకుకు ప్రత్యేక పూజలు



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అంతరాలయానికి వెండి వాకిలి ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు వచ్చారు. ఆలయ పునఃనిర్మాణానికి రూ.9 కోట్లు అందించిన దాతలు ఎన్‌ఆర్‌ఐలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, వారి ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ఆదివారం ఉదయం కాణిపాకం విచ్చేశారు. వారికి ఆలయ ఈవో వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం దాతలు ఆలయ ఈవోతో మాట్లాడుతూ స్వామివారి అంతరాలయంలో వెండి వాకిలి ఏర్పాటు చేయడానికి రూ.2.5 కోట్ల విలువైన 355 కిలోల వెండిని అందించి తయారు చేయిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయానికి తీసుకువచ్చిన వెండి రేకును స్వామివారి దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు.

భక్తి శ్రద్ధలతో పైడితల్లి సిరిమాను తరలింపు



నెల్లిమర్ల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీపైడితల్లమ్మ వారి సిరిమాను తరలింపు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో గుర్తించిన సిరిమాను చెట్టును కొట్టి అమ్మవారి ఆలయానికి తరలించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు చెట్టు వద్దకు చేరుకున్నారు. వేకువ జాము నుంచి పూజలు నిర్వహించారు. చెట్టు తరలింపు వేళ అమ్మవారి నామస్మరణతో జరజాపుపేట మార్మోగింది. వేలాదిగా భక్తులు, ప్రజాప్రతినిధులు సిరిమానును దర్శించుకుని పూజలు చేశారు.

మైసూరు దసరా ఉత్సవాలు ప్రారంభం

మైసూరు: మైసూరు దసరా నవరాత్రి వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. చాముండి కొండలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ప్రముఖ సినీ సంగీత దర్శకులు హంసలేఖ తదితరులు అమ్మవారి విగ్రహానికి పూజలు చేసి ఉత్సవాలను ఆరంభించారు. తొమ్మిది రోజుల పాటు మైసూరు నగర వ్యాప్తంగా వివిధ వేదికలపై సాంస్కృతిక, కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

రూ.80 లక్షల అక్రమ బంగారం స్వాధీనం

కేసు నమోదు చేసిన గన్నవరం విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు



సాక్షి, అమరావతి: షార్జా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న రూ.80లక్షల విలువైన 1.4 కేజీల బంగారాన్ని గన్నవరం విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గన్నవరం విమానాశ్రయానికి శనివారం రాత్రి చేరుకున్న విమానంలో ఇద్దరు మహిళలు తమ ఒంటి నిండా బంగారు ఆభరణాలు ధరించి ఉండటాన్ని కస్టమ్స్ అధికారులు గమనించారు. వారిని తనిఖీ చేయగా ఎలాంటి ముందస్తు ధ్రువీకరణ, అనుమతులు లేవనీ, పరిమితికి మించి బంగారు ఆభరణాలు తీసుకువచ్చినట్టు నిర్ధారించారు. కర్ణాటకలోని మంగుళూరుకు చెందిన ఆ ఇద్దరు మహిళలు గోవా నుంచి దుబాయ్ వెళ్లి అక్కడ నుంచి బంగారు ఆభరణాలతో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. గాజులు, గొలుసులు, కడియాలు, రింగులు తదితర ఆభరణాల రూపంలో అక్రమ బంగారాన్ని తరలించినట్టు గుర్తించారు. ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు విజయవాడ కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనర్ సాధు నర్సింహా రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాలాత్రిపుర సుందరీ దేవిగా దుర్గమ్మ

- ఇంద్రకీలాద్రిపై వైభవంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- నేడు గాయత్రీ దేవిగా దర్శనమివ్వనున్న అమ్మవారు



శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో కనకదుర్గమ్మ



ఆదివారం విజయవాడ దుర్గమ్మ దర్శనం కోసం భారీగా తరలివస్తున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు వేద పండితులు, అర్చకుల సుప్రభాత సేవతో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. తొలిరోజు స్నపనాభిషేకం అనంతరం బాలా త్రిపుర సుందరీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8.40గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పించారు. ఆదివారం, దసరా సెలవులు కావడంతో తొలి రోజు నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్‌లు, కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది లేకుండా తాగునీటి సౌకర్యం కల్పించారు. స్నానఘాట్లల్లో ప్రత్యేకంగా షవర్‌లు, తలనీలాలు సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల దర్శనానికి ఎటువంటి అంతరాయం కలుగకుండా వీవీఐపీల సమాచారం ముందుగా తెలియజేస్తే ప్రొటోకాల్‌కు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులతో నగరోత్సవం నిర్వహించి, పంచహారతులను సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కాగా, శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం నాడు శ్రీ కనకదుర్గమ్మ వారు భక్తులకు శ్రీ గాయత్రీదేవీగా దర్శనమివ్వనున్నారు.

దుర్గమ్మ సేవలో గవర్నర్ దంపతులు



ఆలయం వెలుపల గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దంపతులు, చిత్రంలో ఎమ్మెల్యే వెలంపల్లి

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దసరా మహోత్సవాల్లో భాగంగా తొలి రోజైన ఆదివారం బాలత్రిపుర సుందరిదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దంపతులు దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన గవర్నర్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. గవర్నర్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ కర్నాటి రాంబాబు అందజేశారు. గవర్నర్ వెంట కలెక్టర్ ఢిల్లీరావు తదితరులున్నారు. అలాగే, మంత్రులు ఆర్కే రోజా, విశ్వరూప్ కూడా దుర్గమ్మను దర్శించుకున్నారు.

శ్రీ శారదాపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు బాలాత్రిపుర సుందరీ దేవిగా రాజశ్యామల అమ్మవారు

సింహాచలం/వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): హైందవ ధర్మంలో కులమతాలకు అతీతంగా నిర్వహించుకునే పండుగల్లో దేవీ నవరాత్రులు ప్రధానమైనవని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చెప్పారు. విశాఖ శ్రీశారదాపీఠంలో ఆదివారం నుంచి శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణ పూజల్లో పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పాల్గొన్నారు. స్వరూపానందేంద్ర అనుగ్రహభాషణం చేస్తూ.. భారత్‌లో రాజశ్యామల అమ్మవారు కొలువుదీరిన ఏకైక ప్రాంగణం విశాఖ శ్రీ శారదాపీఠం మాత్రమేనని చెప్పారు. పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు గణపతి పూజతో శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆదివారం రాజశ్యామల అమ్మవారు బాలాత్రిపురసుందరి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి నిజరూపానికి స్వరూపానందేంద్ర అభిషేకం చేశారు. రాజశ్యామల సమేత చంద్రమౌళీశ్వరుల పీఠార్చనలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి నక్షత్ర హారతులిచ్చారు. సామూహిక కుంకుమార్చనలో భారీగా మహిళలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో స్వరూపానందేంద్ర సరస్వతి



విజయవాడలో స్వరూపానందేంద్రకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఆదివారం బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనం ఇచ్చిన జగన్మాతను విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయం వద్ద దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు స్వాగతం పలికారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద స్వామి మాట్లాడుతూ జగన్మాత దుర్గమ్మ ఎంతో శక్తిమంతురాలని, ఆమెకు పేదలంటే ఎంతో ఇష్టమని చెప్పారు. సామాన్య భక్తులు దర్శించుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించాలన్నారు.

శైలపుత్రిగా శ్రీశైల భ్రమరాంబ దర్శనం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో దేవీ శరన్నవరాత్రులు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భ్రమరాంబదేవి అమ్మవారు శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. మల్లికార్జునస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివార్ల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నిజాయితీగా బాధ్యతలు నిర్వర్తించా

- 920 తీర్పులు చెప్పా
- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు



జస్టిస్ సోమయాజులు దంపతులను సత్కరిస్తున్న ఆచార్య ప్రసన్నకుమార్, డి.ఎస్.వర్మ

సీతంపేట(విశాఖ ఉత్తర): హైకోర్టు న్యాయమూర్తిగా నిజాయితీగా బాధ్యతలు నిర్వర్తించి 920 తీర్పులు చెప్పానని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు తెలిపారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఆయన్ని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ ప్రముఖులు ఆదివారం ఘనంగా సత్కరించారు. తమ కుటుంబానికి విశాఖతో ఉన్న చిరకాల అనుబంధాన్ని సోమయాజులు వివరించారు. తన తండ్రి డీవీ సుబ్బారావు మార్గదర్శకంలో తాను న్యాయవాదిగా ఎదిగానని, క్రమశిక్షణ, రుజువర్తన, విచక్షణ, న్యాయ బుద్ధి అలవర్చుకున్నానని తెలిపారు. యువ న్యాయవాదులు వెనుకటి తరానికి చెందిన పాల్కి వాలా, కృష్ణ అయ్యర్ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సభాధ్యక్షులు ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జిల్లా కోర్టు న్యాయవాది స్థాయి నుంచి ప్రస్థానం ప్రారంభించిన సోమయాజులు, హైకోర్టు న్యాయమూర్తిగా న్యాయ వ్యవస్థకు విలువైన సేవలందించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా సోమయాజులు తండ్రి డీవీ సుబ్బారావుతో తనకు ఉన్న అనుబంధాన్ని, అనుభవాలను గుర్తుచేసుకున్నారు. న్యాయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ వైవీ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.రాంబాబు, కంకటాల మల్లిక్, గ్రంథాలయ అధ్యక్షుడు ఎస్.విజయ్ కుమార్, కార్యదర్శి డీఎస్ వర్మ, డీవీ సూర్యారావు తదితరులు పాల్గొని సోమయాజులు, శర్వాణి దంపతులను సత్కరించారు.

పెద్దశేష వాహనంపై మలయప్ప అభయం

- వైభవంగా శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- శోభాయమానంగా శ్రీవారి ఆలయం



పెద్ద శేషవాహనంపై వైకుంఠనాథుడు

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు వైకుంఠనాథుని అలంకరణలో ఏడు తలల స్వర్ణ శేష వాహనం (పెద్ద శేషవాహనం)పై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆదిశేషుడు శ్రీహరికి మిక్కిలి సన్నిహితుడు. రామావతారంలో లక్ష్మణుడిగా, ద్వాపరయుగంలో బలరాముడిగా శ్రీమన్నారాయణుడి వెన్నంటే ఉన్నాడు. శ్రీవైకుంఠంలోని నిత్యసూరులలో ఇతడు ఆద్యుడు, భూభారాన్ని వహించేది శేషుడే. శేష వాహనం ముఖ్యంగా దాస్య భక్తికి నిదర్శనం. ఆ భక్తితో పశుత్వం తొలగి మానవత్వం, దాని నుంచి దైవత్వం, ఆపై పరమపదం సిద్ధిస్తాయి. శ్రీభూదేవి సహితుడైన శ్రీవేంకటేశ్వరుడు పెద్ద శేషవాహనంపై తొలిరోజు భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు శోభాయమానంగా శ్రీవారి ఆలయం ముస్తాబైంది. ధ్వజస్తంభం, బలిపీఠాన్ని పూలతో అందంగా అలంకరించారు. ముఖద్వారం విద్యుత్ కాంతులు, పూల అలంకరణలతో కనుల విందు చేస్తోంది.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.







ఆలయం వెలుపల జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, కుటుంబ సభ్యులతో జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ గోపాలకృష్ణారావు

సర్టిఫైడ్ చేసినా సణుగుడే..

గతేడాది ఎకరాకు 25 కేజీలు చొప్పున 25% సబ్సిడీపై విత్తనాల పంపిణీ

ఈ ఏడాది ఎకరాకు 40 కేజీలు.. 40 శాతం సబ్సిడీ

నాడు:

టీడీపీ హయాంలో విత్తనాల కోసం పడరాని పాట్లు పడేవారు. ఎండనక, వాననక.. రేయనకా పగలనక రైతులు నిద్రహారాలు మాని సొసైటీల వద్ద పడిగాపులు పడితేగానీ కాసిన్ని గింజలు దొరికేవి కావు. తమకు అనుకూలంగా ఉన్న వారు, కాస్త పలుకుబడి ఉన్న వారికి ఇవ్వగా మిగిలినవే సన్న, చిన్నకారు రైతులకు విదిల్చేవారు. విత్తనాల కోసం బారులు తీరిన క్యూలైన్లలో నిల్చొనే సందర్భంలో ఎండలు తట్టుకోలేక స్పృహతప్పి పడిపోవడం, వడగాడ్పుల బారినపడి చనిపోవడం అప్పట్లో సర్వసాధారణం.

నేడు..

కానీ, ఇప్పుడు చూద్దామంటే ఎక్కడా ఒక్క క్యూలైన్ కన్పించడంలేదు. విత్తనం దొరకలేదని కానీ, నాసిరకం విత్తనంవల్ల పంటలను కోల్పోయామని కానీ ఏ ఒక్క రైతు ఫిర్యాదు చేసిన దాఖలాల్లేవు. పైగా ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో సకాలంలో అన్నీ అందుతున్నాయి. విత్తనాల కొరత అనే ఊసేలేదు. చిన్నా, పెద్దా అనే తారతమ్యంలేదు. పక్కాగా సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు అందుతున్నాయి.

సాక్షి, అమరావతి: గ్రామస్థాయిలో ఆర్బీకేల ద్వారా నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలను రైతులకు సరఫరా చేస్తోంది. నిజానికి ఇదొక విప్లవాత్మక మార్పు. ఈ రాష్ట్రంలో మాదిరిగా ఆర్బీకేలుగానీ, విత్తు నుంచి విక్రయం వరకూ రైతును చేయి పట్టుకుని నడిపించే వ్యవస్థ మరే రాష్ట్రంలోనూ లేదు. అయినా, బురదజల్లడమే పనిగా పెట్టుకున్న ఈనాడు 'శనగ విత్తన పంపిణీలో డొల్లతనం' అంటూ రైతులను తప్పుదారి పట్టించేలా ఆదివారం అసత్యాలతో ఓ రుచీపచీలేని కథనాన్ని వండివార్చింది. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని చేస్తున్నా.. 'పచ్చ'కామెర్ల 'ఈనాడు'కు ఇవేవీ కనపడవు. ఆ పత్రిక కక్కిన విషంపై ఈ 'ఫ్యాక్ట్‌చెక్'..



శనగ విత్తన పంపిణీలో డొల్లతనం

■ **ఆరోపణ: రాయితీ విత్తనంతో ఒరిగేదేంటి?**

వాస్తవం: 2023–24 సీజన్‌లో ఇప్పటికే 10.90 లక్షల మంది రైతులకు రూ.204.15 కోట్ల సబ్సిడీతో 5.99 లక్షల క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలో భాగంగా 80 శాతం రాయితీపై 96,392 మంది రైతులకు రూ.21.44 కోట్ల సబ్సిడీతో 24,635 క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేశారు. అలాగే, ముందస్తు రబీ కోసం 2.96 లక్షల క్వింటాళ్ల శనగ విత్తనాన్ని కూడా సిద్ధంచేశారు. సీజన్‌లో సబ్సిడీ విత్తన ధరలను ఏటా రాష్ట్రస్థాయి ధరల నిర్ణయాక కమిటీ నిర్ణయిస్తుంది. అదే రీతిలో మొన్న సెప్టెంబర్ 15 నాటికి స్థానిక మార్కెట్ ధరలను అనుసరించి విత్తన శుద్ధి, ప్యాకింగ్, రవాణా ఖర్చులు, తాలు మినహాయింపు, ప్రాసెసింగ్ నష్టం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని శనగ విత్తన ధరలను నిర్ణయించారు. జేజీ–11 రకానికి క్వింటాకు రూ.8,100, కేఏకే–2 రకానికి రూ.14,050 చొప్పున నిర్ణయించారు. గత ఏడాది 25 శాతం రాయితీపై ఎకరాకు 25 కేజీలు సరఫరా చేయగా, ఈ ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా చిన్న, సన్నకారు రైతులకు 40 శాతం రాయితీపై ఎకరాకు 40 కేజీల చొప్పున విత్తన సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

■ **ఆరోపణ: సన్నగింజ.. మట్టిగడ్డలు.. పుల్లలే..**

వాస్తవం: సాధారణంగా విత్తన నాణ్యత ప్రమాణాలను నాలుగు దశలలో పరీక్షించిన తర్వాత ఆర్బీకేల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నారు. ఏపీ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ ద్వారా సర్టిఫై చేసిన సీడ్‌ను ఆ తర్వాత ఏపీ సీడ్స్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్, నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లలో పరీక్షిస్తారు. చివరగా.. ఆర్బీకేల ద్వారా సరఫరా చేసే ముందు సంబంధిత ఆర్బీకే ఇన్‌చార్జి, ఆయా గ్రామాల అభ్యుదయ రైతుల సమక్షంలో మొలక, భౌతిక పరీక్షలు నిర్వహించి నాణ్యత బాగుందని నిర్ధారించిన తర్వాతే రైతులకు సరఫరా చేసేందుకు అనుమతిస్తారు. ఇదేరీతిలో అత్యంత శాస్త్రీయంగా, విత్తన నాణ్యతను పరీక్షించిన తర్వాతే విత్తన పంపిణీకి అనుమతిచ్చారు.

■ **ఆరోపణ: నాసిరకం అంటూ తిరుగుటపా?**

వాస్తవం: వ్యవసాయశాఖ నుంచి 2,59,660 క్వింటాళ్ల జేజీ–11 రకం, 36,313 క్వింటాళ్ల కేఏకే–2 రకం విత్తనం కోసం ఇండెంట్ రాగా.. వైఎస్సార్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, ప్రకాశం తదితర జిల్లాలకు 1.30 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 85,598 మంది రైతులకు 68,655 క్వింటాళ్ల విత్తనాన్ని వాటి ద్వారా సరఫరా చేశారు. వైఎస్సార్ జిల్లాలో 74,120 క్వింటాళ్ల విత్తనం అవసరం కాగా.. ఇప్పటికే 61,670 క్వింటాళ్లు సిద్ధంచేశారు. విత్తనం కోసం ఆర్బీకేల్లో 41,746 మంది రైతులు తమ వివరాలను నమోదు చేయగా, ఇప్పటికే 45వేల క్వింటాళ్ల విత్తనాన్ని సరఫరా చేశారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన విత్తనాల్లో సన్నగింజ, మట్టిగడ్డలు, పుల్లలతో సరఫరా చేస్తున్నారని, నాసిరకంగా ఉన్నాయని, నాణ్యత బాగోలేదని ఏ ఒక్క రైతు ఫిర్యాదు చేసిన, తీసుకున్న విత్తనాన్ని వెనక్కి ఇచ్చిన దాఖలాలు కానీ లేవు. అయినా సరే.. ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న ఈనాడు రైతులను రెచ్చగొట్టే ధోరణిలో రోజుకో తప్పుడు కథనాన్ని ప్రచురిస్తుండడంపట్ల రైతులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

సేవ్ గాజా...!



న్యూఢిల్లీ: ఇజ్రాయెల్, హమాస్ యుద్ధం తాలూకు ప్రకంపనలు ప్రపంచమంతటా పలు రూపాల్లో బయట పడుతున్నాయి. ఢిల్లీలో జరుగుతున్న లాక్మే ఫ్యాషన్ వేదికపై ఆదివారం ఒక యువతి ఉన్నట్టుండి ప్రేక్షకుల్లోంచి దూసుకొచ్చింది. 'సేవ్ గాజా' అని రాసి ఉన్న ప్లకార్డు ప్రదర్శిస్తూ ర్యాంప్‌పై నడిచింది. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనతో అందరూ నిశ్చేష్టులయ్యారు.

ఆకలి కేకలు.. ఆర్తనాదాలు

గాజాలో ఆహారం, నీరు, ఇంధనం కొరత తీవ్రరూపం

ఉప్పునీరు, అపరిశుభ్రమైన నీటితో గొంతు తడుపుకుంటున్న జనం

- ఆసుపత్రుల్లో దయనీయంగా మారిన క్షతగాత్రుల పరిస్థితి
- బందీలను విడుదల చేస్తేనే సరఫరాలు పునరుద్ధరిస్తామంటున్న ఇజ్రాయెల్
- ఉత్తర గాజా నుంచి జనం తరలింపు పూర్తయ్యాక భూతల దాడులు!
- ఇప్పటివరకు గాజాలో 2,329 మంది, ఇజ్రాయెల్‌లో 1,300 మంది మృతి

గాజా స్ట్రిప్/జెరూసలేం: కాలే కడుపులకు తిండి లేదు, దాహంతో అలమటిస్తున్న గొంతులకు గుక్కెడు నీరు లేదు, ఆసుపత్రుల్లో ఔషధాలు లేవు, రాత్రయితే కరెంట్ లేదు. దూసుకొస్తున్న రాకెట్లు, కళ్లెదుటే కుప్పకూలుతున్న భవనాలు, ప్రాణాలు కోల్పోతున్న సామాన్య జనం. ఇజ్రాయెల్ బలగాల నిర్బంధంలో చిక్కుకున్న గాజాలో ప్రస్తుత దయనీయ పరిస్థితి ఇది. గాజాలోకి ఆహారం, నీరు, కరెంటు సరఫరా కాకుండా దారులు మూసుకుపోయాయి. ఈజిప్టు తన సరిహద్దును మూసివేసింది. గాజాలోని 23 లక్షల మంది జనం అల్లాడిపోతున్నారు. కొందరు మరో దారిలేక ఉప్పునీరు, అపరిశుభ్రమైన నీరు తాగుతున్నారు. ఇజ్రాయెల్ కరుణిస్తే తప్ప వారికి ఆహారం, మంచినీరు దొరకదు. హమాస్ చేతిలో ఉన్న బందీలు విడుదలైన తర్వాతే సరఫరాల గురించి ఆలోచిస్తామని ఇజ్రాయెల్ తేల్చి చెబుతోంది. ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య యుద్ధం మొదలై వారం రోజులు దాటింది. ఇరుపక్షాలు వెనక్కి తగ్గడం లేదు. శత్రువులను అంతం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం ముందుకు దూసుకెళ్తోంది. మిలిటెంట్లు ఇజ్రాయెల్ భూభాగంపైకి రాకెట్లు ఎక్కుపెడుతున్నారు. ఈ పోరాటంలో గాజాలో ఇప్పటిదాకా 2,329 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. హమాస్ దాడిలో ఇజ్రాయెల్‌లో 1,300 మందికిపైగా జనం మృత్యువాతపడ్డారని అధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 7,000కుపైగా ఇళ్లు కూలిపోయాయి.

పాలస్తీనియన్ల కోసం రెండు కారిడార్లు

ఉత్తర గాజాను వెంటనే ఖాళీ చేయాలంటూ ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేయడంతో వేలాది మంది పాలస్తీనియన్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, సొంత ఇళ్లు వదిలేసి వెళ్లిపోతున్నారు. వారికోసం రెండు సురక్షిత కారిడార్లు ఏర్పాటు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఉత్తర గాజా క్రమంగా ఖాళీ అవుతోంది. 10 లక్షల మందికిపైగా జనం తరలివెళ్లాలంటే వారం రోజులకుపైగా సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడి, గాజాలో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వేలాది మంది బాధితులు ఎటూ కదల్లేకపోతున్నారు. ఆసుపత్రుల్లో ఔషధాలు, ఇంధనం కొరతతో చికిత్సలు ఆగిపోయాయి. గాజాలోని హమాస్ మిలిటెంట్ల స్థావరాలను సమూలంగా నాశనం చేయక తప్పదని, అదే తమ ప్రధాన లక్ష్యమని ఇజ్రాయెల్ సైన్యం పునరుద్ఘాటించింది. మిలిటెంట్ల సొరంగాలను ధ్వంసం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించింది. కలుగులో దాక్కున్నా చావు తప్పదని హమాస్ సభ్యులను హెచ్చరించింది.

ఆసుపత్రుల్లో బాలింతలు, శిశువులు

యుద్ధం ఉధృతంగా మారుతుందని, ఉత్తర గాజా నుంచి సామాన్య ప్రజలంతా సాధ్యమైనంత త్వరగా దక్షిణ గాజాకు వెళ్లిపోవాలని ఆదివారం ఇజ్రాయెల్ సూచించింది. విమానాల ద్వారా కరపత్రాలు జారవిడిచింది. కాగా, ఉత్తర గాజా నుంచి ఎవరూ వెళ్లొద్దని, ఇళ్లల్లోనే ఉండాలని పాలస్తీనియన్లకు హమాస్ విజ్ఞప్తి చేసింది. ఉత్తర గాజాలోని ఆసుపత్రిల్లో 2,000 మందికిపైగా బాధితులు ఉన్నారని, చాలామంది ఐసీయూల్లో చికిత్స పొందుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఆసుపత్రుల్లో పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు, ఇంక్యుబేటర్లలో శిశువులు ఉన్నారని, తరలింపు కార్యక్రమం వల్ల వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

బందీల కుటుంబ సభ్యుల ఆగ్రహం

హమాస్ అధీనంలో ఉన్న 150 మంది బందీల క్షేమ సమాచారం తెలియడం లేదు. బందీలను వెంటనే విడిపించాలని డిమాండ్ చేస్తూ వారి కుటుంబ సభ్యులు టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ రక్షణ శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. తన భార్య, ముగ్గురు బిడ్డలను మిలిటెంట్లు అపహరించారని, వారిని క్షేమంగా తన వద్దకు చేర్చాలని అవిహై బ్రాడ్జ్ అనే వ్యక్తి కన్నీటితో వేడుకున్నాడు.

ఈజిప్టు సరిహద్దు తెరిస్తే..

ఈజిప్టు–గాజా మధ్యనున్న రఫా సరిహద్దును తెరిపించేందుకు అమెరికా ప్రయత్నాలు ప్రారంభించింది. ఈజిప్టుతో చర్చిస్తోంది. గాజా ప్రజల కోసం వివిధ దేశాలు ఇచ్చిన ఆహారం, ఔషధాలు, ఇతర నిత్యావసరాలు ప్రస్తుతం ఈజిప్టులో ఉన్నాయి. వాటిని గాజాకు చేర్చడానికి సరిహద్దును తెరవాలని అమెరికా అంటోంది. ఇజ్రాయెల్‌కు అమెరికా ఆయుధ సాయం అందిస్తోంది. ఇప్పటికే ఒక యుద్ధవిమాన వాహక నౌకను మధ్యధరా సముద్రానికి పంపించింది. యూఎస్ఎస్ ఐసెన్‌హోవర్ యుద్ధనౌకను పంపించినట్లు అమెరికా రక్షణ మంత్రి ఆస్టిన్ చెప్పారు. అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ సౌదీ అరేబియా యువరాజు సల్మాన్‌తో సమావేశమయ్యారు.



కళ్లల్లో భయం మనసు శిథిలం

వైమానిక దాడుల నేపథ్యంలో గాజా స్ట్రిప్‌లో ధ్వంసమైన తమ ఇంట్లోంచి ఆకాశంవైపు భయంతో చూస్తున్న చిన్నారులు

దక్షిణ గాజాకు వెళ్లకుండా అడ్డుకుంటున్న హమాస్

ఇజ్రాయెల్ హెచ్చరికల నేపథ్యంలో ఉత్తర గాజా నుంచి జనం దక్షిణ గాజాకు పయనమవుతున్నారు. అయితే, జనం వెళ్లిపోకుండా హమాస్ మిలిటెంట్లు ఎక్కడికక్కడ బలవంతంగా అడ్డుకుంటున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఇజ్రాయెల్ సైన్యం విడుదల చేసింది. సామాన్య ప్రజలను రక్షణ కవచంగా వాడుకుంటూ ఇజ్రాయెల్ దాడుల నుంచి కాపాడుకోవాలన్నదే మిలిటెంట్ల అసలు లక్ష్యమని వెల్లడించింది. ఉత్తర గాజా ప్రజలు ముందుకు వెళ్లకుండా మిలిటెంట్లు వాహనాలను అడ్డుగా పెట్టి రోడ్లను దిగ్బంధిస్తున్నారని పేర్కొంది. వారి ఆరాటమంతా సొంత భద్రత కోసమేనని విమర్శించింది. హమాస్ మిలిటెంట్ల ఏరివేత కోసం ఉత్తర గాజాపై భూతల దాడులకు సిద్ధమవుతున్న ఇజ్రాయెల్ సైన్యం అక్కడున్న పాలస్తీనియన్లకు మరికొంత సమయం ఇవ్వాలని యోచిస్తోంది. జనమంతా దక్షిణ గాజాకు చేరుకున్న తర్వాత భూతల దాడులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.

హమాస్ సీనియర్ కమాండర్ బిలాల్ అల్-ఖేద్రా హతం

హమాస్ మిలిటెంట్లకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గాజా స్ట్రిప్‌లో శనివారం రాత్రి జరిగిన ఇజ్రాయెల్ రాకెట్ దాడుల్లో హమాస్ సీనియర్ కమాండర్ బిలాల్ అల్-ఖేద్రా మరణించాడు. అంతేకాకుండా పలువురు ఇస్లామిక్ జిహాద్ ఉగ్రవాదులు సైతం హతమయ్యారు. ఈ విషయన్ని ఇజ్రాయెల్ వైమానిక దళం ఆదివారం ట్వీట్ చేసింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్ నిరిమ్, నిర్ ఓజ్‌లో గత వారం జరిగిన పలు దాడుల్లో అతడి హస్తం ఉన్నట్లు గుర్తించారు. హమాస్ నుఖ్బా యూనిట్‌కు చెందిన దక్షిణ ఖాన్ యూనిస్ బెటాలియన్‌కు బిలాల్ నేతృత్వం వహిస్తున్నాడు.

నెతన్యాహూ, అబ్బాస్‌కు జో బైడెన్ ఫోన్

ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తున్నామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి స్పష్టం చేశారు. గాజాలోని పాలస్తీనా ప్రజలకు వెంటనే మానవతా సాయం అందాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ, పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్‌తో జో బైడెన్ వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణ ముదరకుండా చర్యలు ప్రారంభించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. గాజా ప్రజలకు ఆహారం, నీరు, ఔషధాలు, నిత్యావసరాలు సరఫరా చేయడానికి వీలుగా ఐక్యరాజ్యసమితితోపాటు ఈజిప్టు, జోర్డాన్, ఇజ్రాయెల్ తదితర దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి మొదలైన తర్వాత మొహమ్మద్ అబ్బాస్‌తో బైడెన్ మాట్లాడడం ఇదే మొదటిసారి. నెతన్యాహూతో మాట్లాడడం ఐదోసారి.

టెస్లా కారు ప్రాణం కాపాడింది

ఇజ్రాయెల్‌లో హమాస్‌లో చేసిన దాడిలో టెస్లా మోడల్–3 ఎలక్ట్రిక్ కారు ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ఫ్రీడమ్ పార్టీ అధినేత గిలాద్ అల్బర్ 'ఎక్స్'లో షేర్ చేశారు. అయితే బాధితుడి వివరాలను బహిర్గతం చేయలేదు. గిలాద్ కథనం ప్రకారం.. బాధితుడు అత్యవసర బృందంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 7న హమాస్ మిలిటెంట్లు దాడి చేస్తున్నారని తెలియడంతో తన టెస్లా మోడల్–3 కారులో అసెంబ్లీ పాయింట్ వద్దకు బయలుదేరాడు. అతడిని చూడగానే మిలిటెంట్లు కాల్పులు ప్రారంభించారు. అది ఎలక్ట్రిక్ కారు అనే విషయం వారికి తెలియదు. డీజిల్ ట్యాంకు ఉండే భాగంపై కాల్పులు జరిపారు. నిజానికి అందులో డీజిల్ ట్యాంకు ఉండదు. టైర్లపై కూడా కాల్చారు. అయినా కారు చెక్కుచెదరలేదు. బాధితుడు మరింత వేగంగా కారులో ముందుకు దూసుకెళ్లాడు. కొన్ని బుల్లెట్లు అతడి శరీరంలోకి దూసుకెళ్లాయి. రక్తం కారుతున్నా అలాగే ఆసుపత్రికి చేరుకున్నాడు. వైద్యులు అతడికి చికిత్స చేస్తున్నారు. ఈ ఘటనపై టెస్లా, 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ స్పందించారు. టెస్లా కారు వల్ల ఒక వ్యక్తి ప్రాణాలు నిలిచినందుకు సంతోషం వ్యక్తం చేశారు.



దక్షిణ గాజాలో పెట్రోల్ బంక్ వద్ద క్యూ కట్టిన పాలస్తీనియన్లు



గాజా స్ట్రిప్‌లో నీటి కోసం ఎదురుచూస్తున్న స్థానికులు



గ్యాస్‌లేక కట్టెలపొయ్యిపై శరణార్థులకు వంటచేస్తున్న దృశ్యం

అఫ్గానిస్తాన్‌లో మళ్లీ భూకంపం

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. ఈనెల 7వ తేదీన శక్తివంతమైన భూకంపం చోటుచేసుకున్న హెరాట్ ప్రావిన్స్‌లోనే ఆదివారం మళ్లీ భూమి కంపించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైంది. భూకంప కేంద్రం హెరాట్ ప్రావిన్స్ రాజధాని హెరాట్ నగరానికి 34 కిలోమీటర్ల దూరంలో భూమికి 8 కిలోమీటర్ల లోతులో ఉందని అధికారులు తెలిపారు. తాజా భూకంపం తాకిడికి నలుగురు చనిపోగా మరో 150 మందికి పైగా గాయపడినట్లు స్వచ్ఛంద సంస్థలు తెలిపాయి. బలోచ్ ప్రాంతంలోని రబట్ సాంగి జిల్లాలోని కొన్ని గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకోవాల్సి ఉండగా, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. ఈ నెల 7న భూకంపం సంభవించిన హెరాట్ ప్రావిన్స్‌లో గ్రామాలకు గ్రామాలే తుడిచి పెట్టుకుపో యాయి. మొత్తం 2 వేల మందికి పైగా చనిపో గా మృతుల్లో 90 శాతం వరకు మహిళలు, చిన్నారులే ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

క్రీడలను విద్వేషాస్త్రంగా వాడొద్దు: ఉదయనిధి

సాక్షి, చెన్నై: క్రికెట్ ప్రేక్షకులనుద్దేశిస్తూ తమిళనాడు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. శనివారం అహ్మదాబాద్‌లో భారత్–పాకిస్తాన్ వన్‌డే క్రికెట్ మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. పాక్ ఆటగాడు మొహమ్మద్ రిజ్వాన్ ఔట్ అయి డ్రెస్సింగ్ రూమ్ వైపు వెళ్తుండగా స్టేడియంలో కొందరు ప్రేక్షకులు జై శ్రీరాం...జై శ్రీరాం అని నినదిస్తున్నట్లు చూపే వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో షేర్ అవుతోంది. దీనిపై ఉదయనిధి స్పందించారు. 'ఇలాంటి ధోరణి మంచిది కాదు. క్రీడలను విద్వేషానికి అస్త్రంగా చేసుకోవడం తగదు. క్రికెట్‌ను క్రికెట్‌గానే చూడాలి. ఆటల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందాలి. అతిథులకు మర్యాద, గౌరవాన్ని ఇచ్చే భారతదేశంలో పాకిస్తాన్ క్రీడాకారులకు వ్యతిరేకంగా ఇలాంటి పద్ధతులను అనుసరించడాన్ని వ్యతిరేకిస్తున్నా' అని ట్వీట్‌చేశారు. కాగా, గతంలో సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తూ ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే.

ఇజ్రాయెల్ నుంచి స్వదేశానికి మరో 471 మంది..

న్యూఢిల్లీ: ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నుంచి ఆదివారం రెండు విమానాల్లో 471 మంది భారతీయులు ఢిల్లీకి చేరుకున్నారు. వీటిలో ఒక విమానం ఎయిరిండియాకు చెందినది కాగా, మరోటి స్పైస్‌జెట్ సంస్థదని అధికారులు చెప్పారు. ఆదివారం ఉదయం 197 మందితో కూడిన మూడో విమానం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కాగా, 274 మంది ప్రయాణికులతో నాలుగో విమానం సాయంత్రం వచ్చినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి చెప్పారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆయన 'ఎక్స్'లో విడుదల చేశారు. శుక్ర, శనివారాల్లో ఎయిరిండియా ఏర్పాటు చేసిన ఛార్టర్డ్ విమానాల్లో 435 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. తాజా తరలింపుతో యుద్ధ వాతావరణం నెలకొన్న ఇజ్రాయెల్ నుంచి ఇప్పటి వరకు నాలుగు విమానాల్లో స్వదేశానికి వచ్చిన భారతీయుల సంఖ్య 900 దాటింది.

43 ఏళ్ల తర్వాత రేప్ కేసు నిందితుడి పట్టివేత

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లా పోలీసులు అత్యాచారం కేసులో నిందితుడిని 43 ఏళ్ల తర్వాత పట్టుకున్నారు. మెంధార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్‌గ్లూన్ గ్రామానికి చెందిన అబ్దుల్ ఖలీక్‌పై 1979లో రేప్ సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 1992లో పూంఛ్ సెషన్స్ కోర్టు సీఆర్‌పీసీలోని సెక్షన్ 512 కింద అబ్దుల్‌పై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. తప్పించుకు తిరుగుతున్న అతడిని మెంధార్ పోలీస్ స్టేషన్ ఏరియాలోనే అరెస్ట్ చేసినట్లు ఆదివారం పోలీసులు వెల్లడించారు.

ప్రశ్నలడిగేందుకు లంచం తీసుకున్నారు

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆరోపణ

- చర్యలు తీసుకోవాలంటూ స్పీకర్‌కు ఫిర్యాదు
- తిప్పికొట్టిన టీఎంసీ నేత

న్యూఢిల్లీ: టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు వ్యాపారవేత్త నుంచి లంచం తీసుకున్నారంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆరోపించారు. తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన, కాంటెంప్ట్ ఆఫ్ హౌస్, నేరంగా ఆయన పేర్కొన్నారు. మొయిత్రా, వ్యాపారవేత్త నుంచి లంచం తీసుకుంటున్నట్లు ఉన్న తిరుగులేని సాక్ష్యాలను ఒక న్యాయవాది తనతో పంచుకున్నారని దూబే చెప్పారు. 'అదానీ గ్రూప్ లక్ష్యంగా ఇప్పటి వరకు ఆమె లోక్‌సభలో ఇప్పటి వరకు 50 నుంచి 61 వరకు ప్రశ్నలడిగారు. 12 డిసెంబర్ 2005 నాటి 'క్యాష్ ఫర్ క్వైరీ' వ్యవహారాన్ని గుర్తుచేసే విధంగా పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగడం ద్వారా వ్యాపారవేత్త శ్రీ దర్శన్ హీరానందానీ వ్యాపార ప్రయోజనాలను కాపాడేందుకు మహువా మోయిత్రా పన్నిన నేరపూరిత కుట్ర అనేందుకు ఎలాంటి సందేహం లేదు. విచారణ కమిటీ ఏర్పాటు చేసి ఈ ఆరోపణల్లో నిగ్గు తేల్చాలి'అని ఆయన స్పీకర్ బిర్లాను కోరారు. దీనిపై మొయిత్రా ఘాటుగా స్పందించారు. ముందుగా దుబేపై పెండింగ్‌లో ఉన్న ఆరోపణలపై స్పీకర్ చర్యలు తీసుకున్నాక తనపై చర్యలకు ఉపక్రమిస్తే సంతోషిస్తానని ఆమె అన్నారు. 'నకిలీ డిగ్రీ పట్టావాలా, ఇతర బీజేపీ ప్రముఖులపై పెండింగ్‌లో ఉన్న ఉల్లంఘనలు చాలానే ఉన్నాయి. స్పీకర్ వాటిని పరిష్కరించిన వెంటనే నాకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేయిస్తే స్వాగతిస్తా'అంటూ ఆమె 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు. రెండు పార్టీలకు చెందిన ఈ ఎంపీల మధ్య పార్లమెంట్‌లోనూ తరచూ వాదోపవాదాలు జరుగుతుంటాయి.

మాజీ సీఈసీ గిల్ కన్నుమూత



న్యూఢిల్లీ: మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) మనోహర్‌సింగ్ గిల్(86) ఆదివారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. 1958 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్ అయిన గిల్ 1996 డిసెంబర్ నుంచి 2001 జూన్ వరకు 11వ సీఈసీగా సేవలందించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2008లో కేంద్ర క్రీడల శాఖ మంత్రి వ్యవహరించారు. ప్రకాశ్ సింగ్ బాదల్ పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ రాష్ట్రంలో ప్రభుత్వ అధికారిగా పనిచేశారు. గిల్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంఎస్ గిల్ మృతిపట్ల కేంద్ర ఎన్నికల సంఘం విచారం వ్యక్తం చేసింది. ఆయన 1998లో 12వ లోక్‌సభకు, 1999లో 13వ లోక్‌సభకు ఎన్నికలు విజయవంతంగా నిర్వహించారని కొనియాడింది.

భారత్ వెలుపల అత్యంత ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం

అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఆవిష్కరణ

వాషింగ్టన్: భారత రాజ్యాంగ రూపశిల్పి బీఆర్ అంబేడ్కర్ అత్యంత ఎత్తయిన విగ్రహాన్ని అమెరికా రాజధాని వాషింగ్టన్ శివారులోని మేరీల్యాండ్‌లో ఆవిష్కరించారు. అంబేడ్కర్ బౌద్ధమతం స్వీకరించిన అక్టోబర్ 14వ తేదీని పురస్కరించుకుని అదేరోజు అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ ప్రెసిడెంట్ రామ్ 19 అడుగుల ఎత్తైన ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ'గా పిలుచుకునే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి 500 మందికి పైగా భారతీయ అమెరికన్లతోపాటు, భారత్, తదితర దేశాల నుంచి తరలివచ్చారు. 'మేం దీనిని సమానత్వ విగ్రహం అని పిలుస్తున్నాం. అసమానత్వమనే సమస్య భారతదేశంలో మాత్రమే కాదు, ప్రతిచోటా వివిధ రూపాల్లో ఇది ఉనికిలో ఉంది'అని ఈ సందర్భంగా రామ్ కుమార్ అన్నారు. ఈ విగ్రహాన్ని ప్రఖ్యాత శిల్పి రామ్ సుతార్ రూపొందించారు. గుజరాత్‌లో నర్మదా తీరాన ఏర్పాటైన సర్దార్ పటేల్ విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'ని రూపొందించింది కూడా ఈయనే. అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌కు సరిగ్గా 22 మైళ్ల దూరంలో ఉన్న అకోకీక్ టౌన్‌షిప్‌లోని 13 ఎకరాల విస్తీర్ణంలో అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో బుద్ధా గార్డెన్‌తోపాటు లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ ఉన్నాయి. ఈ సెంటర్ ఆవరణలోనే అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పారు.



మన టెక్నాలజీని అమెరికా కావాలంది

ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్ వెల్లడి

రామేశ్వరం: చంద్రయాన్–3 మిషన్ విజయవంతం కావడంతో అమెరికా నిపుణులు సైతం మన అంతరిక్ష టెక్నాలజీని కోరుతున్నారని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ చెప్పారు. సంక్లిష్టమైన రాకెట్ మిషన్‌లను అభివృద్ధి చేయడంలో నిమగ్నమైన అమెరికాలో నిపుణులు, చంద్రయాన్–3 మిషన్‌ను చూశాక, భారత్ తమతో అంతరిక్ష సాంకేతికతను పంచుకోవాలని కోరుకుంటున్నారన్నారు. రోజులు మారాయని, అత్యుత్తమైన పరికరాలను, రాకెట్లను నిర్మించగల సత్తా భారత్ సొంతం చేసుకుందని ఆయన చెప్పారు. అందుకే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు ద్వారాలు తెరిచారని ఆయన అన్నారు. దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 92వ జయంతిని పురస్కరించుకుని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి సోమనాథ్ మాట్లాడారు. 'మనది చాలా శక్తిమంతమైన దేశం. ప్రపంచంలోనే అత్యుత్తమమైన విజ్ఞానం, మేధస్సు కలిగిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. చంద్రయాన్–3 వాహకనౌకను మనమే డిజైన్ చేసి, అభివృద్ధి పరిచాం. ప్రయోగం చేపట్టడానికి కొన్ని రోజులు ముందు ఈ మిషన్‌ను తిలకించేందుకు నాసా నిపుణులను ఆహ్వానించాం. వారు ఇస్రో ప్రధాన కార్యాలయానికి రాగా చంద్రయాన్–3 మిషన్ గురించి వివరించాం. వారంతా చాలా బాగుందని మెచ్చుకున్నారు. మనం చాలా తక్కువ ఖర్చుతో పరికరాలు, సామగ్రిని రూపొందించడం చూసి, ఆశ్చర్యపోయారు. తమ దేశానికి ఈ పరిజ్ఞానాన్ని విక్రయించాలని అడిగారు'అని ఆయన వివరించారు. రాకెట్లు, శాటిలైట్ల నిర్మాణంలో పాల్గొని, అంతరిక్ష రంగంలో మన దేశాన్ని మరింత శక్తివంతమైందిగా మార్చాలని కోరుతున్నాను. ఇక్కడున్న కొందరికి ఆ నైపుణ్యం ఉంది. చంద్రుణ్ని చేరుకునే రాకెట్‌ను డిజైన్ చేయగలరు'అని ఆయన పిలుపునిచ్చారు. 'భారత మహిళా వ్యోమగామి చంద్రయాన్–10 మిషన్‌లో చంద్రుడిపై అడుగుపెడుతుంది. ఆ మిషన్‌లో మీలో ఒకరు, ముఖ్యంగా ఓ బాలిక సైతం ఉండి ఉండొచ్చు'అని ఆయన అన్నారు.

ఎన్‌సీపీ మాజీ ఎంపీ రూ.315 కోట్ల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: మహారాష్ట్రకు చెందిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) మాజీ ఎంపీ ఈశ్వర్‌లాల్ శంకర్‌లాల్ జైన్ లల్వానీకి చెందిన రూ.315 కోట్ల విలువైన ఆస్తుల్ని అటాచ్ చేసినట్లు ఈడీ తెలిపింది. రాజ్యసభ మాజీ సభ్యుడైన లల్వానీ, కుటుంబసభ్యులపై బ్యాంకులను మోసం చేయడం, మనీల్యాండరింగ్‌కు పాల్పడినట్లు కేసులున్నాయి. రాజ్‌మల్ లఖిచంద్ జ్యువెల్లర్స్, ఆర్‌ఎల్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, మన్‌రాజ్ జ్యువెల్లర్స్ తదితర సంస్థలకు లల్వానీయే ప్రమోటర్. ఈ కంపెనీల డైరెక్టర్లు/ప్రమోటర్లు తప్పుడు ఆర్థిక లావాదేవీలతో రుణాలు పొంది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.352.49 కోట్లు నష్టం కలుగజేసినట్లు ఈడీ తెలిపింది. కేసు దర్యాప్తులో భాగంగా ఆగస్ట్‌లో పలు ప్రాంతాల్లో సోదాలు జరిపినట్లు తెలిపింది. ఈ మేరకు మనీల్యాండరింగ్ నిరోధక చట్టం కింద మహారాష్ట్ర వ్యాప్తంగా 70 చోట్ల ఉన్న స్థిర, చరాస్తులను అటాచ్ చేస్తున్నట్లు వివరించింది.

కర్ణాటకలో కొనసాగుతున్న ఐటీ దాడులు

బెంగళూరు: కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో గురువారం నుంచి కొనసాగుతున్న సోదాల్లో పట్టుబడిన నగదు మొత్తం రూ.50 కోట్లకు చేరిందని ఆదాయ పన్ను(ఐటీ)శాఖ వెల్లడించింది. ఒక కాంట్రాక్టర్, ఆయన కొడుకు, ఒక జిమ్ యజమాని, ఆర్కిటెక్ట్, రెండు బడా కంపెనీలకు చెందిన మొత్తం 55 ప్రాంతాల్లో దాడులు జరిపినట్లు ఓ అధికారి వివరించారు. శనివారం సాయంత్రం ఆర్కిటెక్ట్, జిమ్ యజమానికి చెందిన ఇళ్లలో చేపట్టిన సోదాల్లో మరో రూ.8 కోట్ల నగదును పట్టుకున్నట్లు చెప్పారు. దీంతో, ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న డబ్బు రూ.50 కోట్లకు చేరుకుందన్నారు. దాడులు ఇంకా కొనసాగుతు న్నాయన్నారు. కర్ణాటకలోని గత బీజేపీ ప్రభుత్వం కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్లు వసూలు చేస్తోందంటూ తీవ్ర ఆరోపణలు చేసిన ఓ కాంట్రాక్టర్ ఇంట్లో సోదాల్లో రూ.42 కోట్ల నగదు దొరికినట్లు శుక్రవారం ఐటీ అధికారులు ప్రకటించడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఓటర్లను కొనేందుకే కాంగ్రెస్ ఈ డబ్బును దాచి ఉంచినట్లు బీజేపీ ఆరోపిస్తోంది.

ఎయిరిండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

న్యూఢిల్లీ: దుబాయ్ నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు వస్తున్న ఎయిరిండియా విమానం మెడికల్ ఎమర్జెన్సీతో ఆదివారం అత్యవసరంగా పాకిస్తాన్‌లోని కరాచీలో దిగింది. ఉదయం 8.51కి దుబాయ్‌లో బయల్దేరగా కాసేపటికే ఒక ప్రయాణికునికి వైద్యపరమైన సమస్య తలెత్తింది. దాంతో విమానాన్ని అతి సమీపంలో ఉన్న కరాచీలో దింపారు. ఆ ప్రయాణికునికి చికిత్స తర్వాత మధ్యాహ్నం 12.30కు విమానం కరాచీ నుంచి అమృత్‌సర్ బయల్దేరింది.

క్లుప్తంగా...

ఎస్‌ఐ మెయిన్స్ పరీక్ష ప్రశాంతం

- 98 శాతం మంది హాజరు
- వెబ్‌సైట్‌లో ప్రాథమిక కీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్‌ఐ పోస్టుల మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలు కేంద్రాల్లో శని, ఆదివారాల్లో నిర్వహించిన మెయిన్స్ పరీక్షకు 98శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. తెలుగు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ సబ్జెక్టులకు సంబంధించి పేపర్–1, పేపర్–2 పరీక్షలు శనివారం నిర్వహించారు. ఆ రెండు పేపర్లు కేవలం క్వాలిఫైయింగ్ పరీక్షలే. వాటిలో అర్హత సాధించిన అభ్యర్థుల పేపర్–3, పేపర్–4లను మూల్యాంకనం కోసం పరిగణనలోకి తీసుకుంటారు. దీన్లో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన మెయిన్స్ పరీక్షల 'ప్రాథమిక కీ'ని పోలీసు నియామక మండలి విడుదల చేసి slprb. ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. దాన్ని అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రాథమిక కీపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు slprbap.obj@gmail.comకు నిర్ణీత ఫార్మాట్‌లో ఈమెయిల్ ద్వారా తెలియజేయవచ్చని పోలీసు నియామక మండలి చైర్మన్ అతుల్ సింగ్ తెలిపారు.

కలాం స్ఫూర్తితో బహుజన హక్కులు సాధిస్తాం



తాడికొండ: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమ హక్కులను సాధించుకుంటామని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,113వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరంలో పలువురు మాట్లాడుతూ..అవినీతిపరులకు సమాజంలో తిరిగే హక్కు లేదని, అందుకు కాలం, పరిస్థితులు తీసుకునే నిర్ణయాలే సమాధానం చెబుతాయనేందుకు చంద్రబాబు అరెస్టే నిదర్శనమన్నారు. 29 గ్రామాల్లో ప్రపంచం తలదన్నే రాజధాని కడతానని అబద్ధాలు చెప్పి పూలింగ్ పేరుతో పంచాయతీలుగా ఉన్న గ్రామాల్లోని రైతులను మోసం చేసి రూ.లక్షల కోట్లు దోచుకున్న బాబుకు ఏ శిక్ష వేసినా తప్పులేదని ధ్వజమెత్తారు.

'కొండంత' అబద్ధం

రుషికొండ టూరిజం పునర్నిర్మాణ ప్రాజెక్టుపై 'ఈనాడు' విష ప్రచారం

- 9.88 ఎకరాల్లో మాత్రమే ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఆ మేరకే సీఆర్‌జెడ్ నుంచి అనుమతులు
- వాస్తవానికి భవనాలు కట్టింది 1.84 ఎకరాల్లో మాత్రమే
- మిగిలిన 8.04 ఎకరాల్లో రోడ్లు, గ్రీనరి, ల్యాండ్ స్కేప్
- 7 బ్లాకుల నిర్మాణానికి ప్రతిపాదిస్తే.. కట్టింది 4 బ్లాకులే
- రుషికొండ మొత్తం విస్తీర్ణంలో 3% వినియోగం
- పర్యావరణ సమతుల్యత కోసం భారీగా పచ్చదనం పెంపు
- బోరువెల్స్ లేకుండానే భూగర్భ జలాలు ఎలా తోడేస్తారు?



- రుషికొండ ప్రాజెక్టును లీజుకిచ్చే ప్రతిపాదన ఇప్పటివరకు లేదు
- ఉత్తరాంధ్ర ఊసు, అభివృద్ధి రామోజీకి నచ్చట్లేదు
- ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు ఆగ్రహం

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర ఊసే రామోజీకి నచ్చట్లేదు. అక్కడ అభివృద్ధి అసలే గిట్టట్లేదు. అందుకే విశాఖపట్నంలోని రుషికొండ టూరిజం పునర్నిర్మాణ ప్రాజెక్టుపై 'ఈనాడు' విష ప్రచారం మొదలెట్టింది. బోడి గుండుకి.. మోకాలికి ముడేస్తూ వాస్తవాల వక్రీకరణకు తెరలేపింది. త్వరలో రుషికొండను మిగలకుండా చేసేస్తారంటూ ప్రజలను మభ్యపెట్టేలా ఊహాజనిత కథనాన్ని అచ్చేసింది. విశాఖ జిల్లా పరవాడ మండలం ఎండాడ గ్రామం సర్వే నంబర్ 19/3, 19/4లో రుషికొండలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కి 61 ఎకరాల భూమి ఉంది. అందులో కేవలం 9.88 ఎకరాల్లో మాత్రమే రిసార్టుల పునర్నిర్మాణ ప్రాజెక్టును ఏపీటీడీసీ ప్రతిపాదించింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్), అటవీ, జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి పూర్తి స్థాయి క్లియరెన్స్‌లు వచ్చిన తర్వాతే పనులు చేస్తోంది. కానీ, ఈనాడు మాత్రం 61 ఎకరాల్లోనూ కట్టడాలకు అనుమతులిచ్చారని, కొండ పూర్తిగా కనుమరుగవుతుందంటూ భయాందోళన కలిగించేలా కథనం ప్రచురించడంపై పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ కె.కన్నబాబు ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. ప్రభుత్వం ఏపీటీడీసీ ద్వారా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైఎండ్ లగ్జరీ రిట్రీట్ రుషికొండ ప్రాజెక్టును లీజుకిచ్చే ప్రతిపాదన ఇప్పటివరకు లేదన్నారు. టీడీపీ నేత బండారు సత్యనారాయణ నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే ప్రాజెక్టుపై న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలయ్యాయని, ప్రతి అంశంపై కోర్టుకు సమగ్ర నివేదిక ఇచ్చిన తర్వాతే పనులు చేశామని చెప్పారు. భవనాల నిర్మాణం, రహదారులు సహా అన్ని పనులకు సంబంధిత శాఖల ఆమోదం తీసుకున్నామని, ఎక్కడా ఉల్లంఘనలకు చోటివ్వలేదని స్పష్టంచేశారు. ప్రభుత్వంతో సమగ్రంగా చర్చించి, పరిపాలనపరమైన అనుమతులు పొందామని, ఇదంతా పర్యాటక శాఖకు తెలియకుండా జరగదని చెప్పారు. అదేవిధంగా అప్పటి పర్యాటక మంత్రికి తెలియకుండా ఈ ప్రాజెక్టు జరగదని, ఈనాడు రాసినవి అవాస్తవాలని చెప్పారు. అసలు వాస్తవాలను ఆయన వెల్లడించారు.

ఆరోపణ: 61 ఎకరాల్లో కట్టడాలకు అనుమతులు

వాస్తవం: రుషికొండలో ఏపీటీడీసీకి ఉన్నది 61 ఎకరాలు. అందులో 9.88 ఎకరాల్లో మాత్రమే పర్యాటక రిసార్టుల పునర్నిర్మాణ ప్రాజెక్టుకు సీఆర్‌జెడ్ నుంచి అనుమతులు తీసుకుని పనులు చేపట్టింది. ఇందులో 19,968 చదరపు మీటర్లలో 7 బ్లాక్‌లు నిర్మించాలన్నది ప్రతిపాదన. 5.18 ఎకరాల్లో మాత్రమే భవనాలు ఉంటాయి. మిగిలిన 4.70 ఎకరాలు రోడ్లు, గ్రీనరి, గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్, డ్రెయిన్ల కోసం వినియోగిస్తారు.

ఆరోపణ: రుషికొండలో 90 శాతం విస్తీర్ణంలో పనులు

వాస్తవం: ఏపీటీడీసీ ప్రాజెక్టులో కేవలం 1.84 ఎకరాల్లో మాత్రమే 4 బ్లాకులను (విజయనగరం, గజపతి, కళింగ, వేంగి) నిర్మించింది. మిలిగిన 8.04 ఎకరాల్లో ఎటువంటి భవన నిర్మాణాలు చేపట్టలేదు. వాటిని ల్యాండ్ స్కేపింగ్ పనుల కోసం వినియోగిస్తారు. అంటే ప్రతిపాదిత 19,968 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కేవలం 13,542 చదరపు మీటర్లకు మాత్రమే నిర్మాణాలకు పరిమితమైంది. రుషికొండలో అందుబాటులో ఉన్న మొత్తం విస్తీర్ణంలో 3 శాతం భూమిలో మాత్రమే భవనాల నిర్మాణం జరిగింది. ఇంకా 97 శాతం ప్రాంతం ఖాళీగానే ఉంది.

ఆరోపణ: రుషికొండపై పర్యావరణానికి విఘాతం

వాస్తవం: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి సీఆర్‌జెడ్ క్లియరెన్స్, ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, జీవీఎంసీ నుంచి ప్లాన్ అప్రూవల్, ఫైర్ క్లియరెన్స్ తీసుకుంది. పర్యావరణ సమతుల్యత కోసం ఏపీటీడీసీ 16,350 స్థానిక జాతుల మొక్కలు, 24,120 హెడ్జ్ ప్లాంట్స్, 4,047 తీగజాతి మొక్కలతో గ్రీనరీని అభివృద్ధి చేసింది. రుషికొండను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో భారీ ఎత్తున మొక్కలు నాటుతూ వృక్ష సంపదను పెంచుతోంది. సీఆర్‌జెడ్ అనుమతి పొందిన ప్రాంతంలో ఎక్కడా బోర్‌వెల్స్ వేయలేదు. ఇక భూగర్భ జలాలను వెలికితీశారనడానికి అవకాశమే లేదు.

అనుసంధానం అడుగు పడేదెలా?

- కృష్ణా డెల్టాకు మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలకు గోదావరి ట్రిబ్యునల్ అనుమతి
- కృష్ణా జలాల్లో ఎగువ రాష్ట్రాలకు అదనంగా నీరు కేటాయింపు
- మహారాష్ట్రకు 14, కర్ణాటకకు 21, ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీలు అదనపు నీరు
- 45 టీఎంసీలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యత బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు
- అన్ని నదుల అనుసంధానంలో అదనపు కేటాయింపుల కోసం ఎగువ రాష్ట్రాల పట్టు
- సవాల్‌గా మారిన ఏకాభిప్రాయ సాధన



సాక్షి, అమరావతి: దేశంలో నదుల అనుసంధానానికి ట్రిబ్యునళ్ల అవార్డులే ప్రతిబంధకంగా మారుతున్నాయి. ఒక నదిలో మిగులు జలాలను లభ్యత తక్కువగా ఉన్న మరో నదికి మళ్లించడానికి.. ఆ నదీ పరివాహక ప్రాంతం (బేసిన్)లో ఎగువన ఉన్న రాష్ట్రాలు అదనంగా నీటిని కేటాయించాలంటూ పట్టుబడుతున్నాయి. ఇందుకు గోదావరి, మహానది ట్రిబ్యునళ్ల అవార్డులను అస్త్రాలుగా చేసుకుంటున్నాయి. దీంతో నదుల అనుసంధానం సాధ్యం కావడంలేదు. ఇది సాకారం కావాలంటే న్యాయపరంగా అడ్డంకులను తొలగించుకోవడంతోపాటు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించాలి. ఇదే పెద్ద సవాల్.

గోదావరి నుంచి పోలవరం కుడి కాలువ ద్వారా కృష్ణా డెల్టాకు 80 టీఎంసీల మళ్లింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన గోదావరి ట్రిబ్యునల్.. ఇందుకు బదులుగా కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న మహారాష్ట్రకు 14, కర్ణాటకకు 21, సాగర్ ఎగువన ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీల కృష్ణా జలాలను అదనంగా వాడుకొనే వెసులుబాటు కల్పించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలన ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచే కృష్ణా బేసిన్‌లో అదనపు నీటిని వాడుకునే అవకాశం కల్పించింది. ఈ నీటి వాడకానికి మహారాష్ట్ర, కర్ణాటక తొమ్మిదేళ్ల క్రితమే కసరత్తు ప్రారంభించాయి. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 45 టీఎంసీలను విభజనానంతరం రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను ఇటీవల బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం అప్పగించింది. గోదావరి – కావేరి అనుసంధానం తొలి దశలో 141 టీఎంసీల గోదావరి జలాలను తరలించడానికి జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ప్రతిపాదన చేసింది. ఈ ప్రతిపాదనను ప్రాధాన్యతగా చేపట్టాలని కేంద్రం ఆదేశించింది. అయితే, కృష్ణా నది మీదుగా ఈ అనుసంధానం చేపడుతున్నందున, కృష్ణా జలాల్లో తమకు అదనంగా కేటాయింపులు చేయాలని మహారాష్ట్ర, కర్ణాటక పట్టుబడుతున్నాయి. కావేరి బేసిన్‌కు గోదావరి జలాలను మళ్లిస్తున్న నేపథ్యంలో కావేరి జలాల్లో అదనపు కోటా ఇవ్వాలంటూ కర్ణాటక, కేరళ పట్టుబడుతున్నాయి. దీన్ని కృష్ణా, కావేరి బేసిన్‌లో దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు వ్యతిరేకిస్తున్నాయి. దాంతో గోదావరి– కావేరి అనుసంధానంపై ఏకాభిప్రాయ సాధన సవాల్‌గా మారింది. ఇదొక్కటే కాదు.. ద్వీపకల్ప భారతదేశంలో ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించిన 15 అనుసంధానాలపై ఏకాభిప్రాయ సాధన సాధ్యమయ్యే అవకాశమే లేదని సాగు నీటి రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

30 ఏళ్లుగా చంద్రబాబుకు చర్మ వ్యాధి

- ఎంపీ మోపిదేవి



నగరం: చంద్రబాబు 30 ఏళ్లుగా చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని, కొత్తగా వచ్చేదేముందని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. ప్రజల సానుభూతి కోసం టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. బాపట్ల జిల్లా పెదపల్లిలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. అవినీతికి పాల్పడి సాక్ష్యాధారాలతో దొరికినందునే రిమాండ్ ఖైదీగా ఉన్నారని చెప్పారు. స్వార్థపూరిత ఆలోచనలు, కుట్రలు, కుతంత్రాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యేనని, జైల్లో ఉండి కూడా కుట్రలు పన్నుతూ సానుభూతి పొందాలని చూస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబుకు హాని కలిగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, ఆయనకు ఇంటి వద్ద నుంచే భోజనం వస్తుందని, ఏదైనా హాని ఉంటే అక్కడ నుంచే ఉంటుందన్నారు. పేదలకు మంచిచేయాలనే తపన సీఎం జగన్‌కు ఉందని, అందుకే మరలా సీఎంను చేసేందుకు ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదిస్తున్నారని మోపిదేవి వివరించారు.

బోర్డు తిప్పేసిన అన్నమయ్య చిట్స్ అండ్ డిపాజిటర్స్

రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేటలో అన్నమయ్య చిట్స్ అండ్ డిపాజిట్స్ సంస్థ బోర్డు తిప్పేసింది. బాధితులు పోలీసుల్ని ఆశ్రయించడంతో ఆదివారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఐడీబీఐ బ్యాంక్ పై అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ సంస్థ రూ.3 కోట్లకుపైగా వ్యాపారలావాదేవీలు కొనసాగించింది. డబ్బు చెల్లింపులు తదితర విషయాల్లో మోసాలు జరుగుతున్నాయని గమనించిన బాధితులు రాజంపేట రూరల్ పోలీసులను ఆశ్రయించారు. అన్నమయ్య చిట్స్ సంస్థ ద్వారా మోసపోయామని, తమ డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని 15 మంది ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ భక్తవత్సలం చెప్పారు. నలుగురు వ్యక్తుల ఆధ్వర్యంలో నడిచిన ఈ సంస్థలో చిట్స్ పేరుతో రూ.20 లక్షలు మోసం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నాలుగు నెలలుగా ఈ సంస్థ నిర్వహణ గాడితప్పినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం సంస్థ బోర్డు కూడా కనిపించడంలేదు. కొన్నాళ్లుగా ముందువైపు తాళాలు వేసి వెనుకవైపు నుంచి కార్యకలాపాలను నిర్వహించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నందలూరు మండలంలోని తోటపాళేనికి చెందిన అరిగెల రవిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

అరెరె.. మర్చిపోయా!

ముదురుతున్న మతిమరుపు సమస్య

యువతపై సూడో డిమెన్షియా ప్రభావం.. ● మల్టీ టాస్కింగ్ నుంచి ఒత్తిడి దాకా కారణాలెన్నో...

బాగా తెలిసిన వ్యక్తుల పేర్లను మర్చిపోవడం, మన బండి తాళాలను తరచుగా వెతుక్కోవడం, ఒకటి రెండ్రోజుల క్రితం చూసిన సినిమా పేరు కూడా గుర్తు లేకపోవడం.. ఈ లక్షణాలను వైద్యులు 'సూడో–డిమెన్షియా'గా పేర్కొంటున్నారు. డిమెన్షియా అనేది ఓ వయసు దాటాక వృద్ధాప్యంలో చుట్టుముట్టే వ్యాధి కాగా.. ప్రస్తుతం యువతపై కూడా ఇది ప్రభావం చూపుతోంది. దీని బారిన పడిన రోగులకు తరచుగా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి లోపించడం నిరాశ లేదా అతిగా ఆలోచించడం వంటి లక్షణాలు ఉంటాయి.

> "అతనూ.. మన ఆఫీస్‌లో పనిచేస్తాడే.. పేరేంటో మర్చిపోయానబ్బా"
> "నిన్ననే నెట్‌ఫ్లిక్స్‌లో చూశా సినిమా చాలా బాగుంది.. పేరేంటంటే, నోట్లో నానుతూనే ఉంది.. గుర్తు రావడం లేదు"
> "మమ్మీ.. బైక్ కీస్ కనపడటం లేదు, కాస్త చూడు ఎక్కడ పెట్టానో గుర్తురావడం లేదు"
> ఇలాంటి మాటలు మీరు తరచుగా అంటుంటే.. లేదా ఎవరి నుంచైనా వింటుంటే.. సిల్లీగా తీసుకోకండి. ఎందుకంటే ఇది కూడా ఒక వ్యాధి. దాని పేరు సూడో డిమెన్షియా!



కేసులు పెరుగుతున్నాయి...

ప్రధానంగా అధిక ఒత్తిడి, మల్టీ టాస్కింగ్, తద్వారా చోటు చేసుకుంటున్న నిస్పృహ, నిరాశ.. వంటివి ఈ పరిస్థితికి కారణం. ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన న్యూరాలజీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ గుప్తా మాట్లాడుతూ, ''యువతలో గణనీయంగా మతిమరుపు కేసులు పెరుగుతున్నాయి. ఇటువంటి సమస్యల నుంచి పరిష్కారం కోరుతూ నెలలో కనీసం 5–10 మంది వరకూ 50 ఏళ్ల లోపు వారు మమ్మల్ని సంప్రదిస్తున్నారు''అని చెప్పారు. ''ప్రస్తుతం యువతలో కెరీర్–సంబంధిత ఒత్తిడి బాగా ఉంటోంది. తద్వారా అధిక పనిభారం సర్వసాధారణమైంది. సోషల్ స్టేటస్ గురించి ఆందోళన కూడా దీనికి తోడవుతోంది. ఇలాంటివన్నీ మెదడుపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి, అది సమాచారాన్ని పూర్తిగా ప్రాసెస్ చేయడమనే దాని విధి నిర్వహణకు ఆటంకం కలిగిస్తుంది, ఎక్కువ సమయం పాటు ప్రాసెసింగ్ చేసే 'మల్టీ టాస్కింగ్' కూడా జ్ఞాపకశక్తిని కోల్పోయేలా చేస్తుంది''అని డాక్టర్ గుప్తా చెప్పారు.

మెమొరీ.. మెదడే దారి..

''ఓ విషయంపై శ్రద్ధ పెట్టడం, దాన్ని స్వీకరించడం అనంతరం దాన్ని నిలుపుకోవడం.. ఇలా జ్ఞాపకశక్తి మూడు భాగాలుగా రూపుదిద్దుకుంటుంది. దీనిలో ప్రతి దశకు మెదడు నుంచి సహకారం అవసరం, కానీ అధిక స్థాయి పని ఒత్తిడి దాని పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. సూడో డిమెన్షియా వెనుక కారణాల గురించి తెలుసుకున్న తర్వాత కొద్దిపాటి ప్రయత్నం ద్వారా దాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. ఏకాగ్రత సాధించేందుకు ప్రయత్నించడం, డిప్రెషన్‌కు చికిత్స తీసుకోవడం వల్ల పరిస్థితి మెరుగుపడుతుంది, ఆందోళన తగ్గుతుంది''అని గుప్తా వివరించారు.

– సాక్షి, సిటీబ్యూరో

''ఈ తరహా లక్షణాలతో నెలకు 10–12 మంది రోగులు వస్తున్నారు. పని ఒత్తిడి, అతిగా ప్రతికూల ఆలోచనలు, ఒకే సమయంలో అనేక పనులు చేయాలనే మల్టీ టాస్కింగ్.. ఇతరులతో సమస్యల కారణంగా మానసిక ఆందోళన పెరుగుతుంది. మనసులో తెలియని ఆరాటం, ఆత్రుత ఉన్నప్పుడు, అనేక రకాల పనులు చేయలేం. కౌన్సెలింగ్ సెషన్‌లు, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ రిలాక్సేషన్‌లు ఈ పరిస్థితితో బాధపడుతున్న వ్యక్తులు కోలుకోవడానికి సహాయపడతాయి''.

– డాక్టర్ ఆర్తీ ఆనంద్, ప్రముఖ సైకాలజిస్ట్

హాస్టళ్లలో 'చైల్డ్ ఫ్రెండ్లీ' మాన్యువల్

పిల్లలతో ఎలా ప్రవర్తించాలో సిబ్బందికి శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలలో స్నేహపూర్వక వాతావరణం ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ప్రధానంగా హాస్టళ్లలోని పిల్లలతో సిబ్బంది, అధికారులు స్నేహపూర్వకంగా మెలిగేలా ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఐదు ప్రధాన అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రామాణిక ఆపరేటివ్ విధానాన్ని (ఎస్‌ఓపీ) అమలులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 3,783 హాస్టల్స్, రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ, వికలాంగుల, జువెనైల్ సంక్షేమ శాఖలకు చెందిన వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఇందులో భాగంగానే హాస్టల్స్ సిబ్బంది, అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై కొన్ని మార్గదర్శకాలను పేర్కొంది.

మార్గదర్శకాలు ఇవీ

- ▲ పిల్లలతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పాటు చేయాలి. డ్రిల్ నిర్వహించే సమయంలో విద్యార్థులకు తప్పనిసరిగా భద్రతపై అవగాహన కల్పించాలి. ఇందుకోసం చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్‌ను ఏర్పాటు చేసి విధులు అప్పగించాలి.
- ▲ పిల్లలతో ఎలా ప్రవర్తించాలో సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి. ఈ తరహా శిక్షణలు నిరంతరం కొనసాగించాలి. శిక్షణ పొందిన పీఈటీ, టీచర్ ద్వారా బాలికలకు ఆత్మరక్షణపై శిక్షణ అందించాలి.
- ▲ పిల్లల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి కౌన్సెలింగ్ అందించాలి. ఉపశమన చర్యలు చేపట్టాలి.
- ▲ వసతి గృహాలకు వచ్చే సందర్శకులకు పరిమితి విధించాలి. వారి వివరాలు నమోదు చేసేలా రిజిస్టర్‌ను కచ్చితంగా నిర్వహించాలి.
- ▲ పిల్లలకు ల్యాండ్ ఫోన్ సౌకర్యం అందుబాటులో ఉంచాలి. సమీపంలోని పోలీస్ స్టేషన్, సహాయ అధికారుల నంబర్లు అందుబాటులో ఉంచాలి.
- ▲ పిల్లలకు అందించే ఆహారాన్ని పరీక్షించడం, మెనూ అమలుపై, తీసుకున్న చర్యలపై ఒక రిజిస్టర్ నిర్వహించాలి.
- ▲ హాస్టల్లోని సిబ్బంది విధి జాబితా (జాబ్ చార్ట్)ను ప్రదర్శించాలి. ▲ హాస్టల్ భవనానికి సరైన ఎలక్ట్రికల్ వైరింగ్, పరిసరాల్లోని బావుల చుట్టూ ఫెన్సింగ్ సరిహద్దు, సేఫ్టీ గ్రిల్ మొదలైనవి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రకృతి ప్రకోపానికి మూల్యం...

12,300 కోట్ల డాలర్లు!

పంటలు, పశువులకు ఏటా వాటిల్లుతున్న నష్టమిది... 30 ఏళ్లలో.. 3.8 లక్షల కోట్ల డాలర్లు ఆవిరి!






(సాక్షి, సాగుబడి డెస్క్)

అధిక ఉష్ణోగ్రతలు, కరువు, వరదలు, తుపాన్లు, భూకంపం, కార్చిచ్చులు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులు పెను సవాళ్లు విసురుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి గతమెన్నడూ లేనంత ఎక్కువ సార్లు, తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పంటలు, పశువులకు విపత్తుల నష్టం ప్రతి ఏటా 12,300 కోట్ల డాలర్లు! గత 30 ఏళ్లలో 3.8 లక్షల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లిందని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) తాజా అధ్యయనంలో తేలింది. ప్రపంచ ఆహార దినోత్సవం(అక్టోబర్ 16) సందర్భంగా 'వ్యవసాయం, ఆహార భద్రతలపై విపత్తుల ప్రభావం'పేరుతో వెల్లడించిన మొట్టమొదటి సమగ్ర నివేదికలో ఎఫ్ఏఓ ఈ వివరాలను తెలిపింది.

ఎఫ్ఏఓ నివేదికలోని ముఖ్యాంశాలివీ...

- పంటలు, పశువులకు గత (1991–2021) 30 ఏళ్లలో ప్రకృతి విపత్తుల వల్ల 3.8 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం జరిగింది. ప్రధానంగా అధిక ఉష్ణోగ్రతలు (26%), కరువు (19%), వరదలు (16%) వల్ల వీటికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.
- ప్రపంచవ్యాప్తంగా విపత్తుల వల్ల పంటలు, పశువులకు జరిగే ఆర్థిక నష్టంలో సగానికి సగం ఆసియా దేశాల్లోనే జరుగుతోంది. ఆసియా దేశాలు 45% (1,72,000 కోట్ల డాలర్లు), ఉత్తర, దక్షిణ అమెరికా దేశాలు 22% (82,800 కోట్ల డాలర్లు), యూరప్ దేశాలు 17% (65,900 కోట్ల డాలర్లు), ఆఫ్రికా దేశాలు 15% (57,800 కోట్ల డాలర్లు), ఓసియానియా 1% (5,500 కోట్ల డాలర్లు) నష్టపోయాయి.
- ప్రతి ఏటా సగటున నష్టం 12,300 కోట్ల డాలర్లు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి కనీసం 5% ప్రకృతి విపత్తుల వల్ల చిల్లుపడుతోంది. అంటే గత 30 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా పంటలు, పశువులకు జరిగిన నష్టం.. 2022లో బ్రెజిల్ జీడీపీకి సమానం!
- అల్పాదాయ దేశాలు, అల్ప–మధ్య ఆదాయ దేశాల్లో ఈ నష్టం అత్యధికంగా వాటి జీడీపీల్లో 10–15% వరకు ఉంటోంది.
- గత 30 ఏళ్లలో గణాంకాలను పరిశీలిస్తే.. విపత్తుల వల్ల సగటున ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా 6.9 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి చే జారిపోతోంది. 2021లో ఫ్రాన్స్‌లో ఉత్పత్తయిన మొత్తం ఆహార ధాన్యాలతో ఇది సమానం.
- ఏడాదికి 4 కోట్ల టన్నుల పండ్లు, కూరగాయలు, చెరకు ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోతున్నాం. 2021లో వియత్నాం, జపాన్ ఉత్పత్తి చేసిన పండ్లు, కూరగాయలతో ఇది సమానం.
- మాంసం, పాల ఉత్పత్తులు, గుడ్ల ఉత్పత్తిలో ఏటా 1.6 కోట్ల టన్నులు కోత పడుతోంది. 2021లో భారత్, మెక్సికో దేశాల్లో ఉత్పత్తయిన వాటికి ఇది సమానం.
- అయితే, వ్యవసాయ జీడీపీలో ఆసియా దేశాలు 4% విపత్తుల వల్ల కోల్పోతుంటే.. ఆఫ్రికా దేశాలు 8% వరకు కోల్పోతున్నాయి.
- పోషకాల పరంగా చూస్తే.. విపత్తుల వల్ల గత 30 ఏళ్లుగా ప్రతి రోజూ ఒక్కొక్కరు 147 కిలో కేలరీలను నష్టపోతున్నారు. విపత్తులతో కోల్పోతున్న ఆహారం ప్రతి రోజూ 40 కోట్ల మంది పురుషులు లేదా 50 కోట్ల మంది మహిళల ఆకలి తీర్చడానికి సరిపోతుంది.
- కార్చిచ్చుల వల్ల ఏటా 34–37 కోట్ల హెక్టార్ల భూమిలో పచ్చదనం దగ్ధమవుతోంది. ఒక్క 2021లోనే 2.5 కోట్ల అడవులు తగులబడ్డాయి.
- పంటలను రక్షించుకోవడానికి ఉపకరించే, వాతారణ మార్పుల్ని దీటుగా తట్టుకునే, ప్రకృతికి అనుగుణమైన వ్యవసాయ పద్ధతులను అమల్లోకి తేవాలి.
- వాతావరణ మార్పుల వల్ల ఇతర దేశాల నుంచి వచ్చిపడే సరికొత్త చీడపీడలు పంటలకు కలిగిస్తున్న నష్టం గురించి సమగ్రంగా అంచనా వేయగలిగే యంత్రాంగం, కొలమానం కొరవడ్డాయి. అయితే, ఈ నష్టం సంపన్న దేశాల్లో ఎక్కువగా ఉంటోంది.
- సాంకేతిక సహకారం, క్షేత్రస్థాయిలో ఉత్తమ సాగు పద్ధతులను అనుసరిస్తే వ్యవసాయంలో విపత్తుల నష్టాన్ని నివారించుకోవచ్చు, తగ్గించుకోవచ్చు. తద్వారా వాతావరణ మార్పుల్ని దీటుగా తట్టుకోవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలపై రూపాయి వెచ్చిస్తే 7 రూపాయిల మేరకు ప్రయోజనం కలుగుతోందని అంచనా.



క్లుప్తంగా...

కలాం స్ఫూర్తితో బహుజన హక్కులు సాధిస్తాం

బహుజన పరిరక్షణ సమితి నాయకులు



నిరాహార దీక్షల్లో పాల్గొన్న సమితి నేతలు

తాడికొండ: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమ హక్కులను సాధించుకుంటామని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,113వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరంలో పలువురు మాట్లాడుతూ..అవినీతిపరులకు సమాజంలో తిరిగే హక్కు లేదని, అందుకు కాలం, పరిస్థితులు తీసుకునే నిర్ణయాలే సమాధానం చెబుతాయనేందుకు చంద్రబాబు అరెస్టే నిదర్శనమన్నారు. 29 గ్రామాల్లో ప్రపంచం తలదన్నే రాజధాని కడతానని అబద్ధాలు చెప్పి పూలింగ్ పేరుతో పంచాయతీలుగా ఉన్న గ్రామాల్లోని రైతులను మోసం చేసి రూ.లక్షల కోట్లు దోచుకున్న బాబుకు ఏ శిక్ష వేసినా తప్పులేదని ధ్వజమెత్తారు. బాబు చేసిన మోసాలను చూసి ప్రజలు సిగ్గుతో తలదించుకుంటుంటే.. ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గు చేటన్నారు. సమితి నేతలు పులి దాసు, కారుమూరి పుష్పరాజు, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

18 నుంచి తెలంగాణలో రాహుల్ పర్యటన

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణలో మూడు రోజుల పర్యటన ఖరారైంది. ఈనెల 18న కాంగ్రెస్ బస్సుయాత్రను ప్రారంభించేందుకు రానున్న ఆయన మూడు రోజులపాటు ఇక్కడే ఉండనున్నారు. రామప్ప ఆలయం వద్ద రాహుల్ కాంగ్రెస్ బస్సుయాత్రను ప్రారంభిస్తారు. షెడ్యూల్ ప్రకారం 18, 19, 20 తేదీల్లో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో రాహుల్ బస్సుయాత్రలో పాల్గొంటారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని సందర్శించనున్నారు. ములుగు, పెద్దపల్లి, ఆర్మూర్ బహిరంగ సభల్లో పాల్గొంటారు. దసరా తర్వాత రాష్ట్రంలో రెండో విడత పర్యటనను రాహుల్ చేపడతారు. ఆ సమయంలో ప్రియాంకా గాంధీ హాజరయ్యే వీలుంది.

69 మందికి బీఆర్ఎస్ బీఫారాలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్న బీఆర్ఎస్ అభ్యర్థులలో 69 మందికి ఆ పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం పార్టీ బీఫారాలను అందజేశారు. తొలుత 51 మంది అభ్యర్థులకు ఆయన బీఫారాలు పంపిణీ చేశారు. ఇందులోనూ ఆరుగురు అభ్యర్థులకు సంబంధించి ప్రగతిభవన్‌లో, మిగతా 45 మందికి తెలంగాణ భవన్‌లో అందజేశారు. ముందుగా నిర్ణయించిన ముహూర్తం మేరకు ప్రగతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో జీవన్ రెడ్డి (ఆర్మూర్), కేటీఆర్ (సిరిసిల్ల), హరీశ్ రావు (సిద్దిపేట), పల్లా రాజేశ్వర్‌రెడ్డి(జనగాం) కేసీఆర్ చేతుల మీదుగా బీఫారాలు అందుకున్నారు. వీరితోపాటు సీఎం కేసీఆర్ తరఫున కామారెడ్డి బీఫారంను సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్దన్ తీసుకున్నారు. తన తల్లి మృతిచెందిన నేపథ్యంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి (బాల్కొండ) రాలేకపోవడంతో ఆయన తరఫున ఎమ్మెల్సీ కవిత బీఫాం అందుకున్నారు. ఆదివారం సాయంత్రం కేసీఆర్ చేతుల మీదుగా మరో 18 మంది అభ్యర్థులు బీఫారాలు అందుకున్నారు. దీంతో ఆదివారం బీఫారాలు తీసుకున్నవారి సంఖ్య 69కి చేరింది.

55 మందితో కాంగ్రెస్ తొలి జాబితా

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను 55 మంది పేర్లను ప్రకటించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం ఉదయం ఢిల్లీలో ఈ జాబితాను విడుదల చేశారు. తొలి జాబితాలోని మొత్తం 55 స్థానాల్లో.. 18 మంది రెడ్లు, ఏడుగురు వెలమ, 12 మంది బీసీ, ముగ్గురు ముస్లిం, ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులకు చోటు కల్పించారు. వీటితోపాటు 12 ఎస్సీ, 2 ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించారు. ఇటీవల పార్టీలో చేరిన మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్ రావు ఇద్దరికీ సీట్లు దక్కాయి. మరోవైపు ఎంపీ ఉత్తమ్‌తోపాటు ఆయన భార్య పద్మావతిలకు తొలి జాబితాలోనే సీట్లు కేటాయించారు.

కేసీఆర్‌తో పొన్నాల భేటీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి రెండు రోజుల క్రితం రాజీనామా చేసిన పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య దంపతులు.. బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావుతో భేటీ అయ్యారు. ఆదివారం సాయంత్రం ప్రగతిభవన్‌కు వెళ్లిన పొన్నాల దంపతులను సీఎం కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. పుష్పగుచ్ఛం అందజేసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీని వీడిన పొన్నాలను బీఆర్ఎస్‌లోకి రావాల్సిందిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానించిన విషయం తెలిసిందే.

ప్రకృతి ఒడిలో సాహస సంబరం

అడవుల నడుమ నేల, నింగి, నీటిపై సాహస విన్యాసాలు



సీతంపేట ఎడ్వెంచర్ పార్కులో 5డి థియేటర్ వద్ద పర్యాటకులు

ఆకట్టుకుంటున్న ఫైవ్ డీ థియేటర్

- మన్యం జిల్లా సీతంపేటలో తొలి గిరిజన గ్రామీణ పార్కు
- రోజుకు 600 మంది.. వారాంతంలో 3 వేల మంది సందర్శకులు రాక
- అడ్వెంచర్ పార్కు ఆదాయం నెలకు రూ.7 లక్షలు

(సీతంపేట నుంచి సాక్షి ప్రతినిధి యిర్రింకి ఉమామహేశ్వరరావు)

అడవుల నడుమ నేల.. నింగి.. నీటిపై సాహస విన్యాసాలు పులకింపజేస్తాయి. ప్రకృతి ధర్మాలకు ఆలవాలమైన మెరుపులు.. వర్షం.. గాలి దుమారం.. పొగ మంచు.. మంచు కురవడం వంటి అనుభూతులన్నీ కృత్రిమంగా ఒకేసారి సాక్షాత్కరించి మనసుల్ని ఆనంద డోలికల్లో ఓలలాడిస్తాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో నిర్మించిన తొలి గిరిజన గ్రామీణ అడ్వెంచర్ పార్కులో ఫైవ్ డీ థియేటర్‌లోకి వెళితే ప్రకృతి అనుభూతులు ఒకేచోట దొరుకుతాయి. సీతంపేట ఏజెన్సీలో లోయలు, కొండలు, జలపాతాలు, నీటి వనరులు పర్యాటక ప్రదేశాలకు అనువైన ప్రాంతాలు. వీటిని దృష్టిలో పెట్టుకుని అడ్వెంచర్ థీమ్‌గా పర్యాటకులకు విహారంతోపాటు వినోదాన్ని పంచేలా పార్కును నిర్మించారు. ఇది 2019 డిసెంబర్ 31 నుంచి అందుబాటులోకి వచ్చింది. మొదట్లో బోటింగ్ కోసమే ఈ పార్కు ఉపయోగపడేది. ఇప్పుడు అందరి వినోద, విహార యాత్రకు నెలవైంది.



మెట్టుగూడ జలపాతాలు



అడ్వెంచర్ పార్కులో బోటింగ్

పార్కులో ప్రత్యేకతలివీ

అడ్వెంచర్ పార్కులో 5డీ థియేటర్ ప్రధాన ఆకర్షణ. రూ.79 లక్షలతో నిర్మించిన ఈ థియేటర్ వద్ద కృత్రిమ జలపాతం, థియేటర్ ముందు భాగం అంతా అడవి జంతువుల బొమ్మలతో తీర్చిదిద్దారు. లోపలికి వెళ్లే గది, పక్కన విభాగాలన్నీ ఫైబర్ మెటీరియల్‌తో అందంగా మలిచారు. 5డీ థియేటర్‌లో మెరుపులు, వర్షం, గాలి, బుడగలు, పొగమంచు, మంచు వంటివి వెంటవెంటనే వచ్చేలా 5 నిముషాల నిడివితో సినిమా ప్రదర్శన ఆకట్టుకుంటుంది. అడ్వెంచర్ పార్కులో నేల, నింగి, నీటిపై సాహస విన్యాసాలతో వినోదం పొందేలా అభివృద్ధి చేశారు. చిన్నారులకు మెర్రీ గ్రో రౌండ్, క్యాట్ వాక్, క్లైంబింగ్ వాల్, బర్మా బ్రిడ్జి, కమాండో నెట్ వంటి వాటితో బాల విహార్ విభాగం ఉంది. యువతకు కమాండో నెట్, బంగీ జంప్, రాపెల్లింగ్ వాల్ వంటి విన్యాసాలతో కూడిన సాహస విహార్. ఆట పాటలతోపాటు కళలు, నృత్య ప్రదర్శనలకు వేదికగా ఆనంద విహార్. బోటింగ్, వాటర్ రోలర్ వంటి వాటితో జల విహార్. ఎతైన కొండలు, అవరోధాలను దాటుకుని టెర్రైన్ వెహికల్ రైడ్‌కు వైవిధ్య విహార్. నీటిపై తాళ్ల సాయంతో వేలాడే బ్రిడ్జిపై నడిచి వెళ్లే విస్మయ విహార్. నీటిపై గాలిలో తేలుతూ వెళ్లే స్కై సైక్లింగ్ వినూత్న విహార్. బుల్‌రైడ్స్, సుమో ఫైటింగ్, బంగీ రన్నింగ్, టార్పలిన్ వంటి వినోద విహార్. షూటింగ్, ఆర్చరీ, బాస్కెట్ బాల్‌తో సౌర్య విహార్. గుర్రాలపై స్వారీ ఆశ్వవిహార్. పారాచూట్‌తో చిన్నపాటి ఎగిరే యంత్రాలతో గగన విహార్ విభాగాలను ఏర్పాటు చేశారు. రోజుకు 600 మంది సందర్శకులు వస్తున్నారు. వారాంతంలో అయితే 3 వేల మంది వస్తున్నారు. అడ్వెంచర్ పార్కు ద్వారా నెలకు రూ.7 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

తొలి అడ్వెంచర్ పార్కు



మన్యం జిల్లా సీతంపేటలో 'రావెకలబండ' పేరుతో సహజసిద్ధమైన పురాతన చెరువు ఉంది. 3.70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దీనిని అభివృద్ధి చేశాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఫైవ్ డీ థియేటర్ ప్రారంభించి అడ్వెంచర్ పార్కులోని అన్ని విభాగాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో దీన్ని అభివృద్ధి చేయడంతో గిరిజన ప్రాంతంలో తొలి అడ్వెంచర్ పార్కుగా పర్యాటకులను ఆకట్టుకుంటోంది. 57 గిరిజన కుటుంబాలకు ప్రత్యక్షంగా, మరిన్ని కుటుంబాలకు పరోక్షంగా ఈ పార్కు వల్ల ఉపాధి లభిస్తోంది.

– పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి

పర్యాటక కేంద్రంగా మారింది



సుమారు పదెకరాల్లో విస్తరించిన సీతంపేట అడ్వెంచర్ పార్కును రూ.2.53 కోట్లతో అభివృద్ధి చేశాం. రాష్ట్రంతోపాటు సరిహద్దు జిల్లాలకు చెందిన పర్యాటకులు పెద్దఎత్తున వస్తున్నారు. పర్యాటకులతో రాకతో ఏజెన్సీ గ్రామాల్లోని ప్రజలకు పరోక్ష ఉపాధి లభిస్తుంది. గిరిజన ఉత్పత్తుల విక్రయాలు గణనీయంగా పెరుగుతున్నాయి.

– కల్పనా కుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్, సీతంపేట ఐటీడీఏ

కూచిపూడి నాట్యాన్ని భావితరాలకు అందిద్దాం

వెంపటి చినసత్యం జయంతి వేడుకల్లో మంత్రి రోజా

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి నృత్యాన్ని భావి తరాలకు అందించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా సూచించారు. పిల్లలకు సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు కూచిపూడి నాట్యాన్ని నేర్పించాలన్నారు. ప్రపంచంలో కూచిపూడి నాట్యానికి వెంపటి చినసత్యం గుర్తింపు తెచ్చారని కొనియాడారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కళాక్షేత్రం ఆవరణలో ఆదివారం పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వెంపటి చినసత్యం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రులు ఆర్కే రోజా, జోగి రమేష్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కలెక్టర్ రాజాబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. వెంపటి చిత్రపటానికి నివాళులర్పించారు. మంత్రి రోజా మాట్లాడుతూ సినీరంగ ప్రముఖులు వైజయంతీమాల, హేమమాలిని, మంజుభార్గవి తదితరులతో పాటు వేలాది మందికి వెంపటి చినసత్యం కూచిపూడి నాట్యం నేర్పించారని చెప్పారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ డాక్టర్ వెంపటి చినసత్యం కూచిపూడిలో పుట్టి కూచిపూడి నాట్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడని కొనియాడారు. తెలుగు యూనివర్సిటీ ప్రాంగణాన్ని కూచిపూడిలో ఏర్పాటు చేయాలని, సిద్ధేంద్రయోగి కళాశాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మంత్రి రోజాను కోరారు.



మంజుభార్గవిని సత్కరిస్తున్న మంత్రులు ఆర్కే రోజా, జోగి రమేష్

పలువురికి అవార్డుల ప్రదానం..

వెంపటి చినసత్యం జయంతిని పురస్కరించుకుని ప్రముఖ నర్తకి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజు భార్గవికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెండు లక్షల నగదు బహుమతిని అందజేసి సత్కరించారు. వెంపటి జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అలాగే శ్రీ సిద్ధేంద్రయోగి కళాక్షేత్రం కూచిపూడి ప్రధానాచార్యుడు, కేంద్ర సంగీత నృత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రికి సిద్ధేంద్ర యోగి పురస్కారం, నాట్యాచార్యుడు మాధవపెద్ది మూర్తికి వెంపటి చినసత్యం జీవిత సాఫల్య పురస్కారం, పార్వతీరామచంద్రన్‌కు కుమారి లంక అన్నపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం, పఠాన్ మొహిద్దీన్‌ఖాన్‌కు వెంపటి వెంకట సేవా పురస్కారాలను అందజేశారు.

టీబీ డ్యామ్ వద్ద నీటిలభ్యత 46.5 శాతమే

- 75% లభ్యత ఆధారంగా 230 టీఎంసీల ప్రవాహం ఉంటుందని బచావత్ ట్రిబ్యునల్ అంచనా
- కానీ.. ఈ ఏడాది ఇప్పటిదాకా వచ్చింది 106.96 టీఎంసీలే
- టీబీ డ్యామ్ చరిత్రలో ఇది రెండో కనిష్ఠ ప్రవాహం
- 2016–17లో డ్యామ్‌లోకి చేరింది కేవలం 86.71 టీఎంసీలే
- 2019–20 నుంచి 2022–23 వరకు డ్యామ్‌లోకి భారీగా ప్రవాహం

సాక్షి, అమరావతి: తుంగభద్ర (టీబీ) డ్యామ్‌లోకి ఈ నీటిసంవత్సరం (ఈ ఏడాది జూన్ 1 నుంచి వచ్చే మే 31 వరకు)లో ఇప్పటిదాకా కేవలం 106.96 టీఎంసీల జలాలు మాత్రమే వచ్చాయి. 75 శాతం లభ్యత ఆధారంగా (నికర జలాలు) టీబీ డ్యామ్ వద్ద 230 టీఎంసీల లభ్యత ఉంటుందని బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసింది. కానీ.. ఈ ఏడాది బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసిన దాంట్లో 46.5 శాతం లభ్యత మాత్రమే ఉండటం గమనార్హం. టీబీ డ్యామ్ చరిత్రలో 2016–17లో కేవలం 85.719 టీఎంసీలే డ్యామ్‌లోకి చేరాయి. ఆ తర్వాత ఈ ఏడాది కనిష్ఠంగా 106.96 టీఎంసీల ప్రవాహం రావడం గమనార్హం. డ్యామ్‌లోకి 482 క్యూసెక్కులు చేరుతుండగా.. కాలువలకు 9,049 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గతేడాది ఇదేరోజు నాటికి డ్యామ్‌లో గరిష్ఠస్థాయిలో 105.19 టీఎంసీల నీరు ఉంది. ఆరోజు డ్యామ్‌లోకి 53,542 క్యూసెక్కులు చేరుతుండగా గేట్లు ఎత్తి 60,206 క్యూసెక్కులు దిగువకు వదిలారు.

నవంబర్ 1 వరకే ఆయకట్టుకు నీళ్లు

తుంగభద్ర పరివాహక ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. అప్పుడప్పుడు చెదురుముదురుగా కురిసిన వర్షాల వల్ల టీబీ డ్యామ్‌లోకి అడపాదడపా వరద చేరింది. టీబీ డ్యామ్ వద్ద 230 టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్.. కర్ణాటకకు 151.49, ఏపీకి 72 (హెచ్చెల్సీ 32.50, ఎల్లెల్సీ 29.50, కేసీ 10.00), తెలంగాణకు 6.51 (రాజోలిబండ డైవర్షన్ స్కీం) టీఎంసీల చొప్పున కేటాయించింది. ఏటా పూడిక పేరుకుపోతుండటంతో డ్యామ్ నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. 2016లో నిర్వహించిన సర్వేలో డ్యామ్ సామర్థ్యం 105.78 టీఎంసీలని తేలింది. దాన్ని పరిగణలోకి తీసుకుని.. నీటిలభ్యత ఆధారంగా దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలకు తుంగభద్ర బోర్డు పంపిణీ చేస్తూ వస్తోంది. ఈ ఏడాది నీటిలభ్యత తగ్గిన నేపథ్యంలో ఆయకట్టుకు నవంబర్ 1 వరకు నీటిని విడుదల చేస్తామని తుంగభద్ర బోర్డు ప్రకటించింది. 2019–20 నుంచి 2022–23 వరకూ నాలుగేళ్లు టీబీ డ్యామ్‌లో బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసిన దానికంటే అధికంగా లభ్యత ఉండటంతో రాయలసీమ, కర్ణాటకలో ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లందించారు. దీంతో రైతులు భారీ ఎత్తున పంటలు సాగుచేసుకున్నారు.

టీబీ డ్యామ్‌లోకి గత పదేళ్లుగా వచ్చిన ప్రవాహం వివరాలు

నీటి సంవత్సరం	వచ్చిన నీరు (టీఎంసీల్లో)
2014–15	348.04
2015–16	113.81
2016–17	85.71
2017–18	125.39
2018–19	357.66
2019–20	419.60
2020–21	299.53
2021–22	410.21
2022–23	606.64
2023–24	106.96

(ఈనెల 12వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు)

కష్ట జీవులకే గుండె సమస్యలు

- 93% మంది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కాయకష్టం చేసుకునే వారే
- కర్నూలు జీజీహెచ్ సీటీవీఎస్ విభాగం అధ్యయనంలో వెల్లడి
- 2016–2021 మధ్య చేసిన 126 వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ కేసులపై అధ్యయనం
- మహిళల్లోనే అధికంగా వాల్వ్ రీప్లేస్‌మెంట్



సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు.. పట్టణాల్లో కూలి పనులు చేసుకునే కష్ట జీవులను ప్రాణాంతక గుండె సమస్యలు ఆవరిస్తున్నాయి. రుమాటిక్ హార్ట్ డిసీజ్ (ఆర్‌హెచ్‌డీ)గా పిలిచే రుమాటిక్ జ్వరం, స్ట్రెప్టోకోకల్ బ్యాక్టీరియా (స్ట్రెప్టోకోకల్ ఫారింగైటిస్ లేదా స్ట్రెప్ థ్రోట్) సంక్రమించడం వల్ల గుండె కవాటాలు దెబ్బతింటున్నాయి. ఈ విషయం కర్నూలు జీజీహెచ్ కార్డియో. థొరాసిక్, వాస్కులర్ సర్జరీ (సీటీవీఎస్) విభాగం వైద్యుల బృందం చేపట్టిన అధ్యయనంలో వెల్లడైంది. కర్నూలు పెద్దాస్పత్రిలో 2016 ఆగస్టు నుంచి 2021 డిసెంబర్ మధ్య నిర్వహించిన వాల్వ్‌స్ రీప్లేస్‌మెంట్ (కవాటాల మార్పిడి) సర్జరీలపై అధ్యయనం చేశారు. ఆ కాలంలో కవాటాల మార్పిడి చేసిన 126 కేసుల్లో 90 కేసులు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, పట్టణాల్లో కూలి పనులు చేసుకునే వారని తేలింది. 92.9 శాతం అంటే 117 రోగులు క్రానిక్ రుమాటిక్ డిసీజెస్, 4.8 శాతం (ఆరుగురిలో) పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు, 2.4 శాతం (ముగ్గురిలో) డీజెనరేటివ్ వాల్యులర్ హార్ట్ డిసీజ్ ఉన్నట్టు గుర్తించారు.

మహిళలే అధికం

వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయించుకున్న వారిలో అత్యధికంగా మహిళలు ఉండటం గమనార్హం. 126 మందిలో 54.8 శాతం అంటే 69 మంది మహిళలు కాగా.. మిగిలిన 45.2 శాతం అంటే 57 మంది పురుషులు. వాల్వ్‌లు దెబ్బతిన్న వారిలో అత్యధికంగా యువత, మధ్య వయసు వారే ఉన్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో 2016 ఆగస్టు-2021 డిసెంబర్ మధ్య వయసుల వారీగా వాల్వ్స్ రీప్లేస్‌మెంట్ సర్జరీల సంఖ్య ఇలా

వయస్సు	రోగులు
10–19	8
20–29	13
30–39	39
40–49	41
50–59	14
60–69	11

నిర్లక్ష్యం చేయకుంటే మేలు

రుమాటిక్ హార్ట్ డిసీజ్‌కు బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ప్రధాన కారణం. ఇది శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే వ్యక్తి నుంచి మరో వ్యక్తికి సులభంగా వ్యాపిస్తుంది. బాల్యంలో ఈ ఇన్ఫెక్షన్లు సర్వసాధారణం. ఈ జబ్బులున్న వారిలో తరచూ థ్రోట్ ఇన్ఫెక్షన్, ఛాతీ నొప్పి, గుండె దడ, పడుకున్నప్పుడు శ్వాస తీసుకోలేకపోవడం, అలసట, కాళ్లు, ముఖం వాపు వంటి లక్షణాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో పదేపదే స్ట్రెప్ ఇన్ఫెక్షన్లు రుమాటిక్ ఫీవర్‌కి దారి తీయవచ్చు. రుమాటిక్ జ్వరం వల్ల వచ్చే మంట, ఏర్పడే మచ్చల వల్ల గుండె కవాటాలు, గుండె కండరాలు దెబ్బతిని రుమాటిక్ గుండె జబ్బులు వస్తాయి.

జాగ్రత్తలు పాటించాలి

అధిక జనాభా గల అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎక్కువగా రుమాటిక్ హార్ట్ డిసీజెస్ కనిపిస్తుంటాయి. కొంత మందిలో పుట్టుకతో వాల్వ్ సమస్య ఉంటుంది. అనుమానిత లక్షణాలున్న వారికి ఎకో పరీక్ష చేస్తే ఏ కవాటం పాడైంది తెలుస్తుంది. 35 ఏళ్లు దాటిన వాళ్లకు యాంజియో కూడా చేస్తాం. ఒక్కోసారి వాల్వ్‌తో పాటు కరోనరి ఆర్టెరీ జబ్బులు ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో బైపాస్, వాల్వ్ మార్పిడి ఒకేసారి చేస్తాం. బలవర్థక ఆహారం తీసుకోవడం, కాలుష్య ప్రదేశాల్లో, ఫ్యాక్టరీల్లో పనిచేసే వాళ్లు తప్పనిసరిగా మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, సీటీవీఎస్ విభాగాధిపతి, కర్నూలు జీజీహెచ్

విభిన్న ప్రతిభావంతులకు వెన్నుదన్ను

- జీవితంలో వారు నిలదొక్కుకునేలా ఆసరా
- ప్రత్యేకంగా విద్య, ఉద్యోగావకాశాలు
- ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు
- అన్ని విధాలా వారికి అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. రాష్ట్ర జనాభాలో 2.23 శాతంగా ఉన్న వారి సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లలో అనేక చర్యలు చేపట్టింది. సమాజంలో సాధారణ జనం మాదిరిగానే విభిన్న ప్రతిభావంతులు సైతం నిలదొక్కుకునేలా ఆసరా అందిస్తోంది. స్వయం ప్రతిపత్తి, సాధికారత, ప్రతిభావంతంగా నిలబెట్టేందుకు కృషి చేస్తోంది. ప్రత్యేకంగా వారికి విద్యా, ఉద్యోగం, ఉపాధి కల్పించేందుకు అనేక చర్యలు చేపట్టింది. ఏపీ దివ్యాంగుల హక్కుల నియమాలు–2023ను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 20న జారీ చేసింది. దివ్యాంగుల జాబితాలో 21 రకాల వైకల్యాలను ప్రకటించింది. వాటిననుసరించి వైకల్య ధ్రువీకరణ ప్రక్రియ జరిగేలా చేయడంతో పాటు వారికి అవసరమైన అన్ని రాయితీలు, ప్రయోజనాలు కల్పించేలా చర్యలు చేపట్టింది. వారి కోసం ప్రత్యేకంగా మహిళా, శిశు సంక్షేమ, వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సలహా మండలిని ప్రభుత్వం నియమించింది. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. విభిన్న ప్రతిభావంతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా ప్రతి ప్రభుత్వ శాఖలోను ప్రత్యేక అధికారిని నియమించింది. ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో వారికి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏపీ స్టేట్, సబార్డినేట్ రూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. వైకల్యం ఉందన్న కారణంతో వారికి పదోన్నతి నిరాకరించడం, ఉన్న పోస్టు నుంచి తగ్గించడం, తొలగించడం చేయకూడదని ప్రభుత్వం అన్ని శాఖలకూ స్పష్టమైన ఆదేశాలివ్వడం విశేషం. ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో వారికి 5 శాతం రిజర్వేషన్ కల్పించింది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశానికి సైతం ఐదు సంవత్సరాల గరిష్ఠ వయస్సును సడలించింది.

విద్య, ఉపాధి, ఉద్యోగానికి ప్రాధాన్యం



రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో సీఎం వైఎస్ జగన్ పెద్ద మనస్సుతో అనేక చర్యలు చేపట్టారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లోను వారికి సీట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వారు బడికి వెళ్లేలా సౌకర్యాలు కల్పించాం. చెవిటి వారికి, అంధ విద్యార్థులకు ప్రత్యేకంగా చదువు చెప్పేందుకు రాష్ట్రంలో ఆరు ప్రత్యేక విద్యా సంస్థలను నెలకొల్పాం. విభిన్న ప్రతిభావంతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 20 వసతి గృహాల(హాస్టల్స్)ను నిర్వహిస్తోంది. జగనన్న వసతి దీవెన, స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాం. ప్రత్యేక భర్తీతో 691 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం.

– కేవీ ఉషశ్రీ చరణ్, రాష్ట్ర మంత్రి

సామాజిక భద్రతలో రాష్ట్రం ఆదర్శం

విభిన్న ప్రతిభావంతులకు సామాజిక భద్రత పెన్షన్లు అందించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. సీఎం వైఎస్ జగన్ పెద్ద మనస్సుతో 8,82,109 మంది విభిన్న ప్రతిభావంతులకు నెలకు రూ.3 వేల నుంచి రూ.పది వేల వరకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందిస్తున్నారు. తలసేమియా, సికిల్‌సెల్ వంటి రుగ్మతలతో బాధపడుతున్న వారికి రూ.10 వేలు, బోదకాలు, కండరాల నొప్పులు, పక్షవాతం వంటి రుగ్మతలతో బాధపడుతున్న వారికి రూ.5 వేల చొప్పున పెన్షన్ అందిస్తున్నాం.

–బి.రవిప్రకాశ్‌రెడ్డి, సంచాలకుడు, వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ

తెలంగాణ

భద్రాద్రిలో శరన్నవరాత్రులు ఆరంభం


ఆదిలక్ష్మిగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు తొలిరోజు ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీరామపారాయణ హవనం, స్నపన తిరుమంజనం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారు సోమవారం సంతానలక్ష్మిగా దర్శనమిస్తారు.



శైలపుత్రిగా జ్ఞాన సరస్వతి

భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో ఆదివారం దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువజామున 4 గంటల నుంచే ఆలయంలో అర్చకులు పూజలు చేశారు. పెద్ద సంఖ్యలోనే భక్తులు సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారు మొదటి రోజు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కట్టిపొంగలి నైవేద్యంగా సమర్పించారు.



సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
సోమవారం । 16 । అక్టోబర్ । 2023



దాండియా ఆటలు, సరదా పాటలు

దేవీ శరన్నవరాత్రుల ప్రారంభం సందర్భంగా విజయవాడ లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించిన దాండియా కార్యక్రమం ఆకట్టుకుంది. ▸10లో



అబ్దుల్ కలామ్ స్ఫూర్తితో..

భారతమాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ ఆకాంక్షించారు. ▸10లో

నేటి స్పందన రద్దు



గాంధీనగర్: జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో విధులు కేటాయించినందున ఈనెల 16వ తేదీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ ఢిల్లీరావు ఆదివారం తెలిపారు.

న్యూస్‌రీల్

తొలి రోజు ఆదాయం రూ. 29.13 లక్షలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలలో తొలి రోజైన ఆదివారం టికెట్ల విక్రయం ద్వారా రూ. 29.13 లక్షల ఆదాయం సమకూరిందని ఈవో కేఎస్ రామారావు తెలిపారు. రూ. 500 టికెట్ల విక్రయం ద్వారా రూ. 6.35 లక్షలు, రూ. 300 టికెట్ల ద్వారా రూ. 8.97 లక్షలు, రూ. 100 టికెట్ల విక్రయం ద్వారా రూ. 3.20 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఇక కేశఖండన టికెట్ల విక్రయం ద్వారా రూ. 1.28 లక్షలు, 54 వేల లడ్డూలను విక్రయించడం ద్వారా రూ. 8.10లక్షల ఆదాయం సమకూరిందన్నారు.

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు 60 మంది ఎంపిక



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): చిత్తూరు జిల్లా తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో డిసెంబర్ 8,9,10 తేదీల్లో జరగనున్న మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు కృష్ణా జిల్లా నుంచి 60 మంది ఎంపిక అయ్యారని కృష్ణాజిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జీవీ ప్రసాద్ చెప్పారు. నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం ఆవరణలో ఆదివారం ఎంపిక ప్రక్రియ జరిగింది. అనంతరం అసోసియేషన్ హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 30 నుంచి 90 ఏళ్ల లోపు ఉన్న మహిళలు, పురుషులు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 75 మంది హాజరయ్యారని, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో పోటీలు నిర్వహించి 60 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు.

రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు జట్టు ఎంపిక



పెనమలూరు: రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును ఎంపిక చేశామని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్షుడు బి.మనోహర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కానూరులో అశోక్‌జిమ్‌లో క్రీడాకారుల జాబితా ప్రకటించారు. మిస్టర్ ఆంధ్ర–2023 రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీలను ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న ఫిట్‌నెస్ జోన్‌లో సెలక్షన్స్ నిర్వహించామన్నారు. 55 కేజీల విభాగంలో పి.బన్నీ, పి.వెంకటేష్, 60 కేజీల విభాగంలో ఎం.రాము, 70 కేజీల విభాగంలో పి.రామారావు, 75 కేజీల విభాగంలో ఆర్.గోపీకృష్ణ, వై.సందీప్, 80 కేజీల విభాగంలో ఎస్.గిరీష్, వై.గోకుల్, ఎం.మహబూబ్‌బాషా ఎంపికయ్యారన్నారు. అలాగే స్పోర్ట్స్ ఫిజిక్ విభాగంలో పి.వెంకటేష్, ఎస్.జయంత్, షేక్ లుక్‌మల్, వై.సందీప్ ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని ప్రధాన కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు.

ముగిసిన మానసిక వైద్యుల వార్షిక సదస్సు



నగరంపాలెం: స్థానిక ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో దక్షిణ భారత మానసిక వైద్యుల 56 వ వార్షిక సదస్సు ఆదివారం ముగిసింది. ప్రమాదాలు జరిగాక వచ్చే మానసిక సమస్యలపై ప్రముఖ మాన సిక వైద్యులు అశోక్‌పాయ్ (ఆస్ట్రేలియా), సీరియల్ కిల్లర్స్ మనస్తత్వంపై వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, మానసిక ఒత్తిడికి గురైన వారు పూనకాలు, అర్ధంతరంగా వచ్చే మరుపు, హిస్టీరియా, స్పృహ కోల్పోవడం వంటి డిసోసియేటివ్ మానసిక రుగ్మతలపై వైద్యులు ఎన్.ఎస్.రాజు ప్రసంగించారు. సదస్సులో దక్షిణ రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది మానసిక వైద్యులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. దక్షిణ భారత దేశ మానసిక వైద్య విజ్ఞాన సదస్సు ముగింపు సభలో నూతన అధ్యక్షులు, వైద్యులు అభయ మట్కర్, కార్యవర్గ సభ్యులు సదస్సుని విజయవంతం చేశారు. అనేక నూతన పరిశోధన ఫలితాలను చర్చించడంతో వైజ్ఞానికంగా ఉపయోగపడిందని వక్తలు వెల్లడించా రు. నిర్వాహక సంఘం అధ్యక్షుడు, వైద్యులు ఐవీఎల్ నరసింహారావు, కార్యదర్శి వైద్యులు ఇవటూరి శరత్ చంద్ర, కోశాధికారి ఐ.శ్రీరమ్యను అభినందించారు.

జయహో జగన్మాత

ఇంద్రకీలాద్రిపై భక్తి కెరటం ఎగిసిపడింది. జగన్మాత బాలాత్రిపుర సుందరీదేవిగా సాక్షాత్కరించిన వేళ.. భక్తి కోటి శరణు ఘోషతో కొండంతా మార్మోగింది. అల కైలాసం ఇల దిగి వచ్చిందా అన్నంతగా విజయవాడ నలుదిశలా నవరాత్రుల శోభ పండువెన్నెలలా ప్రకాశించింది. ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.

కొండంత వైభవం.. 'శరన్నవ' సంబరం

- వైభవంగా ఆరంభమైన దసరా ఉత్సవాలు
- బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ
- అమ్మవారికి గవర్నర్ నజీర్ దంపతుల ప్రత్యేక పూజలు
- తొలి దర్శనం చేసుకున్న సీపీ, చైర్మన్, ఈవో
- మొదటి రోజే రికార్డు స్థాయిలో భక్తులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా మహోత్సవాలలో తొలి రోజైన ఆదివారం దుర్గమ్మను శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అశేష భక్తజనం దర్శించుకుని తరించారు. దసరా ఉత్సవాల చరిత్రలోనే తొలి రోజున రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 80 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో శనివారం రాత్రే నగరానికి చేరుకున్న భక్తులు తెల్లవారు జామునకే క్యూలైన్ లోకి చేరారు. క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులను వీఎంసీ కంపార్టుమెంట్‌లోకి తరలించారు. ఉదయం 8.40 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం కాగా, సాయంత్రం 6.30 గంటల వరకు ఏకరీతిన రద్దీ కొనసాగింది. సర్వ దర్శనం క్యూలైన్లతో పాటు రూ.100, రూ.300, రూ. 500 టికెట్ క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్‌లో అడుగడునా మంచినీటి ప్యాకెట్లు, చిన్నారులకు పాలు పంపిణీ చేశారు.




హారతి కనుమా.. కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులకు హారతి ఇస్తున్న అర్చకులు

మేళతాళాలతో ఊరేగింపు..

దసరా ఉత్సవాల నేపథ్యంలో తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరణ, నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8.40 గంటలకు అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సీపీ టి.కె. రాణా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, పోలీసు సిబ్బంది అమ్మవారిని తొలి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద ఇత్తడితో తయారు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా మహా మండపం ఆరో అంతస్తుకు తరలించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా సాగింది. అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ప్రత్యేక లక్ష కుంకుమార్చనను ప్రారంభించారు. ప్రత్యేక కుంకుమార్చనలో చైర్మన్ దంపతులతో పాటు ఈవో దంపతులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. నగర మేయర్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన..

ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె. రాణా, ఎస్పీ రవీంద్రబాబు, డీసీపీ విశాల్ గున్ని, వెంకటరత్నం, అజిత, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలించారు. ఈవో కేఎస్ రామారావులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు చేస్తూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఓ దశలో పెద్ద ఎత్తున భక్తులు ఐడీ కార్డులు ధరించి అమ్మవారిని దర్శించుకోవడంతో పోలీసులు విస్మయానికి గురయ్యారు. ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకునే వారి ఐడీకార్డులను రెవెన్యూ, పోలీసు సిబ్బంది కార్డులను తనిఖీ చేశారు. వాటిపై పేరు, ఇతర వివరాలు లేకపోవడంతో పాటు కనీసం ఫొటో కూడా లేకపోవడంతో వారి నుంచి కార్డులు స్వాధీనం చేసుకున్నారు.



చూసిన కనులదే భాగ్యము.. పల్లకీపై ఊరేగుతున్న ఉత్సవమూర్తి

నగరోత్సవం.. నేత్రపర్వం

దసరా మహోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆది దంపతుల నగరోత్సవం కనుల పండువగా జరిగింది. మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవంలో తొలుత ఆది దంపతులకు ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో కేఎస్ రామారావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహామండపం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గోశాల, కనకదుర్గనగర్, దుర్గాఘాట్, ఘాట్ రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య సాగిన ఊరేగింపులో భక్తులు, ఉభయదాతలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యత మరవొద్దు: మంత్రి కొట్టు



అధికారులందరూ బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పని చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అమ్మవారి దర్శనం కల్పించాలని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకొని చేసిన ఏర్పాట్లను మంత్రి ఆదివారం పరిశీలించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద క్యూలైన్లను పరిశీలించి, అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. అమ్మవారి దర్శనం చేసుకుని ఘాట్ రోడ్డు వైపు వస్తున్న భక్తులను ఆరా తీశారు. ఇంత మంది భక్తులు ఘాట్‌రోడ్డు వైపుగా ఎందుకు వస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిఫార్సులు, డ్యూటీ కార్డులపై దర్శనాలకు వచ్చే వారిని నియంత్రించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరి ఉండటంతో పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలైన్లు ఎక్కడా ఆగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును ఆదేశించారు. రూ. 500 టికెట్ క్యూలైన్‌లో కొన్ని లోపాలను గుర్తించామని, వాటిని వెంటనే పరిష్కరించి భక్తుల ఇబ్బందులను తొలగించామన్నారు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారి దర్శనం
- తెల్లవారుజామున 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7 గంటలకు, ఉదయం 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు అమ్మవారికి మహానివేదన, పంచహారతుల సేవ, చతుర్వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం



అతిథులకు ఆహ్వానం.. దుర్గమ్మ సన్నిధిలో గవర్నర్ దంపతులు



ధూంధాం సంబరం.. కేరళ సంప్రదాయ దప్పు కళాకారుల విన్యాసం



సాంస్కృతిక సౌరభం.. కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణి



భక్తఝరి.. విజయవాడ వినాయక గుడి వద్ద భక్తుల రద్దీ

సమష్టిగా అడుగులేద్దాం

- ప్రజల మెప్పు పొందడమే లక్ష్యం
- సమస్యలుంటే చెప్పండి.. పరిష్కరించుకుందాం
- కృష్ణా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కే రోజా
- పెడన నియోజకవర్గ సమీక్ష సమావేశం
- పాల్గొన్న మంత్రి జోగి రమేష్



మాట్లాడుతున్న మంత్రి రోజా, పక్కన మంత్రి జోగి రమేష్, కలెక్టర్ రాజాబాబు

పెడన: ప్రజలు మెచ్చుకునేలా సమన్వయంతో అంతా కలిసి పనిచేద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. ఎన్నికలకు ఇంకా ఆరు నెలలు సమయం మాత్రమే ఉందని.. సమస్యలు ఏమైనా ఉంటే వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆదివారం గూడూరు మండలం సుమ కన్వెన్షన్ హాలులో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో పాటు పెడన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏమైనా సమస్యలు ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి వస్తే వాటిని తక్షణం పరిష్కరించాలని స్పష్టం చేశారు. మీ స్థాయిలో పరిష్కరించలేనివి ఉంటే వాటిని కలెక్టర్‌కు తెలియజేయాలన్నారు. కలెక్టర్ స్థాయిలో కూడా పరిష్కారం కాకపోతే మేం వాటిని సీఎంవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి రోజా స్పష్టం చేశారు. అర్హులైన వారికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని మంత్రి రోజా అన్నారు. రాష్ట్రంలో 2 లక్షల 47వేల కోట్ల రూపాయలను అందజేశామని, ప్రతి కుటుంబానికి కూడా లబ్ధి చేకూరిందన్నారు.

నాలుగు నియోజకవర్గాలకు కృష్ణాజలాలు..

జిల్లాలోని పెడన, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తీసుకువచ్చేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. కృత్తివెన్ను మండలం నుంచి తాగునీటి సమస్యపై పలువురు ప్రశ్న వేసిన సమయంలో మంత్రిపై విధంగా స్పందిస్తూ పెడన నియోజకవర్గానికి రూ.125 కోట్లు మంజూరు చేశామని, ప్రస్తుతం తాగునీటి చెరువులు ఏర్పాటుకు స్థలాల సేకరణ, టెండర్లు ప్రక్రియ తదితర పనులు పూర్తికావాల్సి ఉందని మంత్రి చెప్పారు. జిల్లాలు చిన్నవి అయ్యాయని, ఆ విషయాన్ని గుర్తుంచుకుని జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే మండల స్థాయి అధికారులు మరింత బాధ్యతగా పనిచేస్తారని మంత్రి చెప్పారు.

- పెడన నియోజకవర్గంలోని ఆయా సమస్యలపై సమీక్షించిన సమయంలో గూడూరు మండలం ఎంపీపీ మధుసూదనరావు, జెడ్పీటీసీ సురేష్‌రంగబాబు, పెడన నాయకులు అచ్యుతరావు, వెంకటరామానాయుడు తదితరులు పనులు వేగంగా జరగడం లేదని, జరిగిన పనులకు బిల్లులు రాకపోవడం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని మంత్రులకు వివరించారు.
- సీపీడబ్ల్యూసీ స్కీం కింద ఉన్నటువంటి ట్యాంకర్లు, చెరువుల వద్ద నిర్వహణ సక్రమంగా ఉండటం లేదని, నిధులు కూడా ఇవ్వడం లేదని కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, పెడన నాయకులతో పాటు పలువురు నాయకులు మంత్రి రోజా దృష్టికి తీసుకువెళ్లారు.
- మల్లేశ్వరం స్కీంలో రెండు చెరువులున్నాయని, ఒక చెరువు ద్వారా మాత్రమే తాగునీటిని అందిస్తున్నారని, రెండు చెరువులను ఒకటిగా చేసి తాగునీటిని అందించేలా చూడాలని బంటుమిల్లి ఎంపీపీ చినబాబు కోరారు.

పరిష్కారానికి కృషి..

ఆయా సమస్యలపై క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పర్యటించి పరిష్కరించేలా చూస్తారని, అలాకాని పక్షంలో సీఎంవో దృష్టికి తీసుకువెళ్తామని మంత్రి రోజా హామీ ఇచ్చారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, డీఆర్వో వెంకటరమణ, జోగి రాజీవ్, పెడన నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా, డివిజన్, మండల అధికారులు, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'లో 1,00,410మందికి వైద్య సేవలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 1,00,410 మంది వైద్య సేవలు పొందారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 168, పట్టణాల్లో 19 మొత్తం 187 వైద్య శిబిరాలు జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య ఆరోగ్య శిబిరాలను సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాలను 1,00,410 మంది సద్వినియోగం చేసుకున్నారని, వీరిలో 95,794 మందికి ఉచితంగా మందుల కిట్స్ పంపిణీ చేశామన్నారు. కిట్‌లో మందులు వాడే విధానాన్ని వివరిస్తూ ప్రత్యేకంగా పేపర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు 1,213 మంది తదుపరి చికిత్స కోసం పెద్దాస్పత్రులకు తరలించినట్లు తెలిపారు. ఆస్పత్రులకు తరలించిన వారికి అండగా ఉంటూ అక్కడ కూడా వారికి సరైన వైద్యం అందేలా చూస్తామన్నారు. వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా 10,108 మంది కంటి పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశామన్నారు. వారిలో 3,882 మందికి కంటి అద్దాలు కూడా ఉచితంగా పంపిణీ చేశామన్నారు. 1,309 మందికి కాటరాక్ట్ ఆపరేషన్ అవసరమైనట్లు గుర్తించామన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా వెంపటి చినసత్యం జయంతి



వెంపటి విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న మంత్రులు రోజా, జోగి రమేష్, కలెక్టర్ రాజాబాబు

పమిడిముక్కల: కూచిపూడి గ్రామంలోని సిద్ధేంద్రయోగి కళాక్షేత్రంలో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా యంత్రాంగం, సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్, కూచిపూడి అకాడమీ చెన్నై, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జయహో భారతీయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, కలెక్టర్ పి. రాజాబాబు హాజరయ్యారు. కూచిపూడిలోని బాలా త్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం స్వగృహం వద్ద గల వారి విగ్రహానికి మంత్రులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. నాలుగో కూచిపూడి దినోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వెయ్యి మంది విద్యార్థులు డాక్టర్ వెంపటి చినసత్యం రూపొందించిన బ్రహ్మాంజలి మహా బృంద నృత్యం మంత్రముగ్ధుల్ని చేసింది. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాకారులు, తల్లిదండ్రులు, కళాభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో మంత్రి విశ్వరూప్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని అమ్మవారిని పూజించినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్ పేర్కొన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మను మంత్రి విశ్వరూప్ ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రిని ఆలయ ఈవో కేఎస్ రామారావు సాదరంగా ఆహ్వానించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఈవో అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

గన్నవరం: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని కేసరపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం...కేసరపల్లి శివారు దుర్గాపురానికి చెందిన గోళ్ల బసవరావు (33) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై కేసరపల్లిలో నిర్మాణంలో ఉన్న మినీ ఫ్లైఓవర్ వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నం చేశాడు. అయితే ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చిన బైక్‌ను ఏలూరు వైపు వెళ్తున్న తుని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో బసవరావు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

ఆన్‌లైన్‌లో సొమ్ము స్వాహా

పెనమలూరు: ఉద్యోగం పేరులో మహిళను నమ్మించి ఆమె వద్ద సైబర్ నేరగాళ్లు సొమ్ము స్వాహా చేసిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రామం చదలవాడ రెసిడెన్సీకి చెందిన ఎం.కోకిల సాయికి గత నెల 10వ తేదీన పార్టుటైమ్ ఉద్యోగం కోసం టెలిగ్రాంలో మెసేజ్ వచ్చింది. హోటళ్లలో డీలక్స్ రూమ్‌ల బుకింగ్ ఉద్యోగం చేయాలని చెప్పారు. ఎర్నిగ్‌స్టార్స్ 24 గ్రూప్‌లో కోకిలసాయిని చేర్చి గత నెల 23వ తేదీన ట్రయిల్‌బోనస్‌గా రూ.10 వేలు ఆమె ఎకౌంట్‌లో జమ వేశారు. డీలక్స్ రూమ్‌లు బుక్ చేస్తే కమీషన్ ఎక్కువగా వస్తుందని నమ్మబలికి కోకిలసాయి వద్ద దశల వారీగా రూ.1,41,729 సొమ్ము కాజేశారు. ఇంకా సొమ్ము జమ చేస్తే లాభం ఎక్కువగా వస్తుందని మాయమాటలు చెప్పారు. దీంతో బాధితురాలికి అనుమానం వచ్చి సొమ్ము వేయలేదు. జరిగిన మోసం పై ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

కొండంతా పండగ సందడి








దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై పండగ సందడి నెలకొంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కొండంతా కోలాహలంగా మారింది. విద్యుద్దీపాల వెలుగుల్లో ఆలయ ప్రాంగణం, పరిసరాలు, దిగువ సన్నిధి కాంతులీనుతోంది. అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా కొనసాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా మహిళలు కుంకుమ పూజలు చేశారు. కనకదుర్గ నగర్‌లో వేదిక మీద ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): క్రీడాకారులు ఆటల్లో మంచి ప్రతిభను ప్రదర్శించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 18వ జూనియర్ నేషనల్స్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలను మల్లాది విష్ణు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు తమ ప్రభుత్వం అండగా నిలబడుతుందని తెలిపారు. క్రీడల ద్వారానే శారీరక ఆరోగ్యం పొందవచ్చని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం పొందే అవకాశం కూడా ఉందన్నారు. అమెచ్యూర్ సాఫ్ట్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, ఎమ్మెల్యే (గుజరాత్) మహేష్ కస్వాలా మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ క్రీడలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఒలింపిక్స్‌లో సాఫ్ట్ టెన్నిస్ క్రీడను ప్రవేశపెట్టేందుకు తమ అసోసియేషన్ కృషి చేస్తుందని వెల్లడించారు. ఇందుకోసం త్వరలో అంతర్జాతీయ ఒలింపిక్ కౌన్సిల్‌తో చర్చలు నిర్వహిస్తామని వివరించారు. ఇటీవల చైనాలో జరిగిన 19వ ఆసియా క్రీడల్లో మన దేశానికి 107 పతకాలు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. 2034వ సంవత్సరంలో ఒలింపిక్స్‌ను భారత్‌లో నిర్వహించే ఆలోచనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉన్నారని తెలిపారు. అందుకు సంబంధించి భారత ఒలింపిక్ సంఘం ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారని కస్వాలా చెప్పారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే భావాలను అలవరచుకోవాలన్నారు. సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కోశాధికారి విజయ్ సోలంకి, అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్‌జీ వేగ్డా, సాఫ్ట్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు మక్వానా తదితరులు పాల్గొన్నారు. మల్లాది విష్ణు, మహేష్ కస్వాలా సాఫ్ట్ టెన్నిస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పోటీ పడనున్నారు.

అత్యాచారయత్నం ఘటనపై కేసు నమోదు

జి.కొండూరు: బాలికపై వ్యక్తి అత్యాచార యత్నం చేసిన ఘటనపై పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. వెల్లటూరు శివారు బీమవరప్పాడు గ్రామంలో ఓ బాలిక (15)పై అదే గ్రామానికి చెందిన వల్లూరి వినోద్ అనే వ్యక్తి గత మంగళవారం బాలిక తన ఇంట్లో ఉండగా అత్యాచార యత్నం చేశాడు. ఆ సమయంలో బాలిక పెద్దగా కేకలు పెట్టడంతో వినోద్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయం బాలిక ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పలేదు. గత ఐదు రోజులుగా ఆమె ప్రవర్తనలో మార్పు కనిపెట్టిన తల్లిదండ్రులు గట్టిగా మందలించడంతో అసలు విషయం వెల్లడించింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మరాజు తెలిపారు.

అబ్దుల్ కలామ్ స్ఫూర్తితో శాస్త్రవేత్తలుగా ఎదగాలి

-సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతమాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ ఆకాంక్షించారు. డీపీఆర్టీయూ కార్యాలయంలో డెమొక్రటిక్ పీఆర్టీయూ, ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్తంగా కలాం జయంతి నిర్వహించారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించిన విద్యార్థులు, గైడ్ టీచర్లకు కలాం పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో నేటి విద్యార్థులు భారతదేశ ప్రతిష్టను పెంచే మహోన్నతమైన శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో డల్లాస్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించిన విద్యార్థులను గైడ్ టీచర్లను, ప్రధానోపాధ్యాయులను కలాం పురస్కారాలతో సత్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డి.శ్రీను మాట్లాడుతూ 100 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు కలాం పురస్కారాలు అందజేశామన్నారు. గవర్నమెంట్ ఎగ్జామ్స్ డైరెక్టర్ దేవానందరెడ్డి, లయన్స్ క్లబ్ నాయకులు ఉపేంద్ర, నీలిమ దేవి ట్రస్ట్ చైర్మన్ అబ్రహాం లింకన్, పి. వెంకటేశ్వరరావు, ప్రభాకర్, దర్శి రాంబాబు, జ్ఞానేశ్వర్‌రావు, అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఐవీఎం సేవలు అభినందనీయం

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- 220 మంది విద్యార్థులకు రూ.28 లక్షల ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

పురిటిగడ్డ(చల్లపల్లి): పేద విద్యార్థులకు ఐవీఎం (ఇండియా విలేజ్ మినిస్ట్రీస్) సురేష్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. పురిటిగడ్డలో ఐవీఎం స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం 220 మంది విద్యార్థులకు రూ.28 లక్షలు ఆర్థిక సహాయం అందించారు.

ప్రతిభ కలిగి ప్రైవేట్ స్కూళ్లలో చదువుకుంటున్న పేద విద్యార్థులు 190 మందికి రూ.20 లక్షలు సాయం చేశారు. పలు కళాశాలలు, యూనివర్సిటీల్లో ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ చదువుతున్న 30 మంది పేద విద్యార్థులకు రూ.8 లక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రమేష్ బాబు ఐవీఎం సహాయాన్ని విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పేదలు, విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్న ఐవీఎం సురేష్ అభినందనీయులని చెప్పారు. పేద విద్యార్థులు విద్యావంతులై మరి కొందరికి సహాయం చేయాలని సూచించారు. సురేష్ మాట్లాడుతూ కరోనాకు ముందు అనాథ బాల, బాలికలకు విద్యా సహాయం, మహిళల ఆర్థిక స్వావలంబనకు శిక్షణ కార్యక్రమాలు, ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ చేశామన్నారు. కోవిడ్‌లో ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు సహాయం, నియోజకవర్గంలో 20 వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం అందించినట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి రోజా, విజయ, ఐవీఎం ట్రస్ట్ సభ్యులు పి.రాజేష్ బాబు, మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలనకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ పి.రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలోని గోడౌన్లలో ఈవీఎంల మొదటిదశ పరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజాబాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఏర్పాట్లను ఎస్పీ పి.జాషువాతో కలిసి ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం ఉదయం నుంచి ఈ ఈవీఎంల పరిశీలన ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలన జరగాలని తెలిపారు. తనిఖీ చేసిన ఈవీఎంలకు సంబంధించి ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశీలన ప్రక్రియలో పాల్గొనే అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు, సిబ్బందికి ఐడీ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్డు లేకుండా లోపలకు అనుమతించరని స్పష్టం చేశారు. అలాగే మొబైల్ ఫోన్లు కూడా అనుమతించేది లేదని వెల్లడించారు. వివిధ రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు తమ ప్రతినిధిని పంపేటప్పుడు ఆథరైజేషన్ లెటర్, ఆధార్‌కార్డుతో పంపాలని సూచించారు. ఈవీఎంల మొదటిదశ పరిశీలన కార్యక్రమం ఎప్పటికప్పుడు రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా పరిశీలిస్తారని వివరించారు. ఈ ప్రక్రియకు గట్టి పోలీస్ బందోబస్తును 24 గంటలూ ఉంటుందన్నారు. డీఆర్వో పి. వెంకటరమణ, డీపీవో నాగేశ్వరనాయక్, బందరు డీఎస్పీ మాధవరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సురేష్, డెప్యూటీ తహసీల్దార్ ఎంవీ శ్యామ్‌నాథ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఇంటికి అన్న బాబు జైలుకు..



బంటుమిల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి రోజా, వేదికపై ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తదితరులు

బంటుమిల్లి: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ సీపీని ఇంటికి పంపుతామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు స్కాంల్లో ఇరుక్కొని జైలుకు వెళ్లాడని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, యువజన శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్‌కే రోజా ఎద్దేవా చేశారు. ఆదివారం రాత్రి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అధ్యక్షతన బంటుమిల్లిలో పెడన నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని, ఆ పార్టీ నాయకులను ఎక్కడికో పంపిస్తామని మాట్లాడిన చంద్రబాబు జైలుకు వెళ్తే తన ఉత్తర కుమారుడు ఢిల్లీకి పారిపోయాడని విమర్శించారు. వీరి దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ జగన్‌మోహన్‌రెడ్డిని శాసనసభకు వెళ్లనీయనంటూ ఊగిపోతూ ఉపన్యాసాలు ఇచ్చి శాసనసభ గేటు వద్దకు కూడా వెళ్లలేకపోయాడన్నారు. ఈ ముగ్గురు ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా వైఎస్సార్ సీపీ నాయకులను దెబ్బకొడతాం, జైలుకు పంపుతామంటూ చెబుతున్న మాటలకు ప్రజలు ఓట్లు వేయాలా.. అంటూ ప్రశ్నించారు. 98 శాతం మ్యానిఫెస్టోను అమలు చేసిన ఆదర్శ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనని చెప్పారు. 2019లో ప్రజలకు ఏమి చేయకుండానే 151 సీట్లు ఇచ్చారని, 2024లో సంక్షేమ ఫలాలను అందుకున్న ఓటర్లు 175 సీట్లుతో పట్టం కడతారని తెలిపారు. నాడు నేడుతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను, 17 మెడికల్ కళాశాలలతో వైద్య సేవలను ప్రజల వద్దకు, ఆర్‌బీకేలతో రైతు సంక్షేమాన్ని అందించిన ఆదర్శ ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ మా భవిష్యత్తు బాబుతోనే అన్న టీడీపీ నాయకుల భవిష్యత్తు కూడా జైలుపాలు కాక తప్పదన్నారు. బాబుతో నేను సైతం అంటున్న నాయకులందరూ జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారా..అంటూ ప్రశ్నించారు. కొన ఊపిరితో ఉన్న టీడీపీకి మరలా ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే ఓపిక ఉందా అన్నారు. సభలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, యువ నాయకుడు జోగి రాజీవ్‌లతో బంటుమిల్లి, పెడన, గూడూరు, కృత్తివెన్ను మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దాండియా ఆటలు.. సరదా పాటలు

క్రియేటివ్ సోల్ ఆధ్వర్యంలో గార్బా - దాండియా 2023 కార్యక్రమం విజయవాడ లబ్బీపేటలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం సందడిగా సాగింది. యువతీ, యువకులు దాండియా ఆడుతున్న చిత్రాలివి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

లారీని కారు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు



పరిటాల శివారు దొనబండ సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన అప్పారావు, పార్వతి



కంచికచర్ల : రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని వేగంగా వస్తున్న కారు ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న కారు మండలంలోని పరిటాల శివారు దొనబండ సమీపంలోకి రాగానే జాతీయ రహదారి పక్కన ఆగిఉన్న లారీని వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో విశాఖపట్నంకు చెందిన పి.అప్పారావు, పార్వతి, కారు డ్రైవర్ వర్మ కిషోర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను వైద్యం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

మరో విద్యార్థి మృతదేహం లభ్యం



వల్లముల భరత్ (ఫైల్)



లంకమ్మ మాన్యం వద్ద పంట కాలువలో వల్లముల భరత్ మృతదేహం

అవనిగడ్డ: స్థానిక పంచాయితీ పరిధిలోని సీతాయిలంక వద్ద పంట కాలువలో ఇద్దరు విద్యార్థులు గల్లంతైన ఘటనలో మరో విద్యార్థి వల్లముల భరత్ అలియాస్ బాలయ్య (14) మృతదేహం ఆదివారం లభ్యమైంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. శనివారం సరదాగా ఈతకు వెళ్లి ఆవుల సిద్దార్థ (12), వల్లముల భరత్ గల్లంతైన విషయం విదితమే. సిద్దార్థ మృతదేహం శనివారం లభ్యమైంది. భరత్ మృతదేహం దొరకడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కన్నీటి నయనాలతో బంధువుల ఆర్తనాదాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఇద్దరి మరణంతో సింహాద్రి కాలనీలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

క్లుప్తంగా

వీఎంసీ కార్యాలయాల్లో నేడు 'స్పందన' రద్దు

పటమట(విజయవాడతూర్పు): నగరవాసుల నుంచి నేరుగా ఇబ్బందులు తెలుసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయాల్లో జరిగే సోమవారం స్పందనను దసరా ఉత్సవాల కారణంగా రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ అధికారులు నవరాత్రి ఉత్సవాల్లో విధులు నిర్వహిస్తుండటం, ట్రాఫిక్ మళ్లింపులతో ప్రజలు కార్పొరేషన్ బిల్డింగ్ వద్దకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉండటంతో స్పందన రద్దు చేస్తున్నట్లు వివరించారు.

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి 50 బారికేడ్లు అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉపయోగించుకునేలా అనంత్ డైమండ్స్ వారు 50 స్టెయిన్‌లెస్ స్టీల్ బారికేడ్స్ అందజేశారు. షోరూమ్ అధినేతలు జాస్తి వెంకట భానుప్రకాష్, విష్ణుప్రియ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులకు వాటిని అందచేశారు. భానుప్రకాష్ మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండటంతో వారికి ఉపయోగపడేలా స్టెయిన్‌లెస్ స్టీల్ బారికేడ్స్ అందచేసినట్లు తెలిపారు. బృందావనకాలనీ టిక్కిల్‌రోడ్డులోని షోరూమ్‌లో దసర నవరాత్రి వేడుకలు ప్రారంభించారు.

1800 మందికి అన్నదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ భక్తుల ఆకలిదప్పులు తీర్చడం అభినందనీయమని పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీం ఆధ్వర్యంలో వన్‌టౌన్ రథం సెంటర్‌లోని అప్పన వెంకట కృష్ణయ్య ధర్మ సత్రం వద్ద క్లబ్‌కు సంబంధించి ఈ ఏడాది రిలీవింగ్ హంగర్ కార్యక్రమ రికగ్నైజ్డ్ డీసీ అప్పన వెంకట సత్యసాయిబాబు సహకారంతో ఆదివారం అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సుమారు 1800 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించిన నిర్వాహకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, వాసవి పాస్ట్ గవర్నర్ కొనకళ్ల సత్య కృష్ణప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు సీహెచ్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుశిక్షణ కేంద్రం ఏర్పాటు అభినందనీయం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. ఏపీ మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో నగరంలోని ఫుడ్ జంక్షన్ వద్ద శ్రీకృష్ణ మహిళా ఉచిత కుట్టు మిషన్ ఏర్పాటు చేశారు. తోలేటి శ్రీకాంత్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మహిళా సాధికారతకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

బాలా లీలావినోదినీ..



వాసవీకన్యకాపరమేశ్వరీదేవిగా..



దత్తపీఠంలో బాలాత్రిపురసుందరిగా మరకత రాజరాజేశ్వరి

ఘనంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఎల్లప్పుడూ నిను భజింతుమే అంటూ భక్తజనం జగజ్జననిని మనసారా ప్రార్థించారు. దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాలాంధ్ర రోడ్డులోని చలసాని చౌక్‌లో బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని సోమవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించనున్నారు.

- ధనకొండపై అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. సోమవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించనున్నారు. మారుతీనగర్ కొండపై ఉన్న దుర్గాదేవి ఆలయంలో బాలాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

కృష్ణలంకలో..

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని త్రిశక్తిపీఠంలో దసరా ఉత్సవాల్లో మొదటిరోజు ఆదివారం కాళీమాత.. రజత కవచాలంకృత మహాకాళీమాత అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జగదీష్‌కుమార్, పుల్లయ్య, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు తదితరులు పర్యవేక్షించారు.

- భ్రమరాంబపురంలోని బాల అన్నమ్మ పేరంటాల అమ్మవారి దేవస్థానం వద్ద ఆదివారం అన్నమ్మ తల్లి సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో గణపతి పూజ, స్వస్తి, పుణ్యాహవచనం, కలశస్థాపన, అర్చనలు, ఖడ్గమాలా స్తోత్ర పారాయణం, లలిత సహస్ర నామ పారాయణం చేశారు.
- కృష్ణలంక మెట్లబజార్‌లోని వాసవీ కల్యాణ మండపంలో వాసవీ సేవా సంఘం ఆధ్వర్యాన అమ్మవారు వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, పుష్పాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మానేపల్లి మాణిక్యాలరావు, గొంట్లా రామ్మోహనరావు, కోశాధికారి చందలూరి వెంకట సుబ్బారావు, గౌరవ సలహాదారుడు మట్టా సుబ్బారావు తదితరులు పర్యవేక్షించారు.
- రాణిగారితోటలోని శ్రీమహాశక్తి దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

పటమట(విజయవాడతూర్పు): స్థానిక దత్తపీఠంలోని శ్రీ మరకతరాజరాజేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభయ్యాయి.

ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం 6 గంటలకు జరిగిన క్షీరాభిషేకం తర్వాత దర్శనానికి అనుమతిచ్చారు. పిల్లలందరికి కుమారి పూజను, ముత్తైదువలకు సుహాసినీ పూజను పండితులు చేశారు. అనంతరం గిరిజా కల్యాణం, మహా గణపతి హోమం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.



భ్రమరాంబపురంలో అన్నమ్మ గుడి వద్ద..



శ్రీ బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో

సిద్ధార్థ ప్రాంగణంలో..

లబ్బీపేట(విజయవాడతూర్పు): శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యాన సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో తొలిసారిగా నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలతో కళాశాల ప్రాంగణానికి ఆధ్యాత్మిక శోభ వచ్చింది. ఉత్సవాల్లో తొలిరోజు ఆదివారం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో అమ్మవారిని లేతగులాబీ వస్త్రంతో అలంకరించి తుమ్మిపూల పుష్పాలు, బెల్లపు పరమాన్నం నైవేద్యం సమర్పించారు. తొలిరోజు శత చండీహోమంలో కమిటీ సభ్యులచ పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం శాంతికల్యాణం చేశారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ జనరల్ సెక్రటరీ వైట్ల కృష్ణ ప్రసన్న, చైర్మన్ గోకరాజు గంగరాజు, కో చైర్మన్లు చదలవాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చండీహోమంలో భక్తులు



చలసాని చౌక్‌లో బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు



రజత కవచాలంకృత మహాకాళీమాత



బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో మహాశక్తి అమ్మవారు

మౌలిక వసతులపై వీఎంసీ ప్రత్యేక దృష్టి

- రూ.5.43 కోట్ల పనులకు స్థాయీ సంఘం ఆమోదం
- రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణానికి చర్యలు
- కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చు



స్థాయీ సంఘ సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు వీఎంసీ పాలక పక్షం పలు నిర్ణయాలు తీసుకుంది. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి రూ.5.43కోట్లు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు వెచ్చించడానికి ఇటీవల మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన స్థాయీ సంఘం తీర్మానాలు చేసింది. అందులో సర్కిల్-1 పరిధిలోని 5 పనులకు రూ. 2.5కోట్ల నిధులు, సర్కిల్-2 పరిధిలో నాలుగు పనులకు రూ. 1.71 కోట్లు, సర్కిల్-3 పరిధిలో మూడు పనులకు రూ. 1.06 కోట్లు నిధులు వెచ్చించనున్నారు.

సర్కిల్-1 పరిధిలో..

- 34వ డివిజన్లోని కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు డ్రెయిన్ నిర్మాణానికి రూ. 34 లక్షలు నిధులు వెచ్చించనున్నారు
- 42వ డివిజన్‌లో రామాలయం స్ట్రీట్ నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 22.77 లక్షలు
- 42వ డివిజన్‌లో నేతాజీ స్కూల్ మెయిన్ రోడ్డులో 330 మీటర్ల దూరం వరకు రూ.49.84 లక్షలు
- 45వ డివిజన్ పయ్యావుల దశరథ్ స్ట్రీట్‌లో అంబేడ్కర్ రోడ్డు నుంచి 300 మీటర్ల వరకు రూ.24.53లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- 43వ డివిజన్‌లో ఊర్మిళా నగర్ మెయిన్ రోడ్డు నుంచి పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఆటోస్టాండ్ వరకు సీసీ అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.49.74 లక్షలు వెచ్చించనున్నారు.

సర్కిల్-2 పరిధిలో..

- 30వ డివిజన్ రామకృష్ణాపురం వద్ద ముత్యాలంపాడు డీపీ స్టేషన్ నుంచి అజిత్‌సింగ్‌నగర్ వరకు ఎస్టీపీకి కలిపే పంపింగ్ మెయిన్ రోడ్డులో విజయవాడ-హౌరా రైల్వేట్రాక్ బాక్ కల్వరుట వద్ద ఎస్టీపీ పైపు తుప్పిపట్టింది. స్థానికంగా డ్రైనేజీ లీకవుతుండటంతో స్థానికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొత్తగా పైపు ఏర్పాటు చేయటానికి రూ.72.15లక్షలు నిధులు కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి వెచ్చించనున్నారు
- 58వ డివిజన్ నందమూరి నగర్ మెయిన్‌రోడ్డు నుంచి ఇన్నర్‌రింగ్‌రోడ్డును కలిపే వశిష్ఠ కాలనీ మెయిన్ రోడ్డును బీటీ రోడ్డు నిర్మాణనికి రూ. 36.45లక్షలు
- 60వ డివిజన్‌లో వాంబే కాలనీ డీపీ స్టేషన్ నుంచి అజిత్‌సింగ్ నగర్ ఎస్టీపీకి కలిపే పైపులైను వాంబేకాలనీ వెనకభాగంలో తుప్పుపట్టి నీరు లీకవుతుంది. దీని పరిష్కారానికి రూ.23.89 లక్షలు
- 23, 24 డివిజన్ల పరిధిలోని కూర్మయ్య వంతెన రోడ్డు, నక్కల రోడ్డులో ట్రాఫిక్ రాకపోకలతో రోడ్డు మరమ్మతులకు గురవడంతో ఈ ప్రాంతంలో బీటీ రోడ్డు వేయటానికి రూ. 39.20 లక్షలు వెచ్చించనున్నారు.

సర్కిల్-3 పరిధిలో..

- రాణిగారితోట 18వ డివిజన్‌లో రామాలయం నుంచి తారకరామానగర్ వరకు ప్రస్తుతం ఉన్న డ్రెయిన్ మరమ్మతులకు గురవ్వటంతో స్థానికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నూతన డ్రెయిన్ నిర్మాణానికి రూ. 39.72 లక్షలు వెచ్చించనున్నారు.
- రామలింగేశ్వరనగర్ 15వ డివిజన్‌లో ఫిష్‌మార్కెట్ పాత బ్రిడ్జినుంచి న్యూబ్రిడ్జి వద్ద వీఎం రంగా పార్కు వరకు బందరుకాల్వ వెంట తాగునీటి పైపులైను ఏర్పాటుకు రూ.29.80లక్షలు
- 3వ డివిజన్‌లోని గోకుల్ వారి వీధి, పానుగుమాటి వారి వీధి, దోసనపూడి సూర్యనారాయణ వీధులకు సీసీ రోడ్డు వేయటానికి రూ. 39.46లక్షలు నిధులు వెచ్చించనున్నారు.

నగరం మరింత అభివృద్ధి

నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రతి నెలా జరిగే స్థాయీ సంఘం సమావేశంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో, వైఎస్సార్ సీపీ వీఎంసీ పాలక పక్షం ఆధ్వర్యంలోనే నగరం మరింత అభివృద్ధి చెందుతుంది.

– రాయన భాగ్యలక్ష్మి, మేయర్

గుండె వైద్యంలో గణనీయమైన పురోగతి

కార్డియాక్ సొసైటీ ఆఫ్ ఇండియా సదస్సులో డాక్టర్ రమేష్‌బాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండె వైద్యంలో గణనీయమైన పురోగతి సాధించామని కార్డియాలజిస్ట్, ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అన్నారు. ఒకప్పుడు శస్త్ర చికిత్సలతో నయం చేసే గుండె జబ్బులను, ఇప్పుడు ఇంటర్వెన్షనల్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్డియాక్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం గుండె జబ్బుల వైద్యంలో శస్త్ర చికిత్సలకు బదులుగా వచ్చిన ఇంటర్వెన్షన్ వైద్య విధానంలో అధునాతన వైద్య విధానాలపై నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. నగరంలో 'స్ట్రక్చరల్ కార్డియాక్ ఇంటర్వెన్షన్స్ కాంక్లేవ్-2023 పేరుతో నిర్వహించిన సదస్సులో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన కార్డియాలజిస్టులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. చిన్న పిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్.జ్యోతి ప్రకాష్, డాక్టర్.వాసుదేవ్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డాక్టర్. ఎన్.రాజా రమేష్, డాక్టర్.హరిత మాట్లాడారు. డాక్టర్ దగ్గుబాటి రమేష్ వర్చువల్ పాల్గొన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, తిరుపతి పద్మావతి చిన్న పిల్లల గుండె వైద్యశాల సంచాలకులు డాక్టర్ శ్రీనాథ్, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ ఎస్ కేశవరావుబాబు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఫెస్ట్ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ సమీపంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే కంప్యూటర్ ఫెస్ట్ టెక్నో ఫీలియా ఆదివారం ప్రారంభమైంది. కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జ్ఞానముని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభా పాటవాలు ఇలాంటి కార్యక్రమాలతో వెలుగులోకి వస్తాయన్నారు. విద్యార్థులు మార్పులను అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదిత్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ డాక్టర్ ఎన్.స్నేహరెడ్డి, నల్లిమల్లి శేషరెడ్డి, సుగుణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులారా.. మనసారా..









ఇంద్రకీలాద్రి పరిసరాలు జై దుర్గ.. జైజై దుర్గ నామస్మరణతో మార్మోగాయి. దసరా ఉత్సవాల్లో తొలిరోజు ఆదివారం బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మను భక్తజనం కనులారా దర్శించుకుని మనసారా ప్రార్థించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలుగా మారాయి. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. ఘాట్లల్లో, దుర్గమ్మ అన్నప్రసాదం, ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తులు కిటకిటలాడారు. వలంటీర్లు విభిన్న ప్రతిభావంతుల సేవలో తరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, అధికారులు పర్యవేక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఉత్సవాల్లో నిర్విరామంగా వీఎంసీ సేవలు

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాల్లో వీఎంసీ సిబ్బంది నిర్విరామంగా సేవలు అందిస్తున్నారని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో దుర్గగుడి, స్నానఘాట్లు, గిరి ప్రదక్షిణ జరిగే 27 ప్రాంతాల్లో తాగునీటి సరఫరా చేశారు. క్యూలైన్, ఘాట్‌లో కొండపై వరకు కూడా వివిధ ప్రాంతాల్లో ఉచిత వాటర్ ప్యాకెట్ల లొకేషన్స్ ఏర్పాటు చేశామన్నారు. 12 ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం 120 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారని తెలిపారు. పోలీసు సిబ్బంది వసతి గృహం వద్ద మరో 50 మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఎస్టేట్ విభాగం నుంచి రథం సెంటర్ వద్ద, కార్పొరేషన్ మెయిన్ ఆఫీస్ బిల్డింగ్ ఎదురుగా, సీతమ్మ పాదాల దగ్గర, భవానీపురంలో, రాజీవ్ గాంధీ పార్క్ ఎదురుగా భక్తుల కోసం ఉచితంగా ఆరు ఉచిత క్లాక్ రూమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. స్నానఘాట్లలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండటానికి 1500 మందికి పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం 24 గంటలు మూడు షిఫ్టులు వారీగా పని చేస్తున్నారన్నారు. వీఐపీలకు దుర్గమ్మ దర్శనానికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ తరఫున ఏడు కారులను కేటాయించామని, వివిధ విభాగాల అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.

మత్తు వైద్యంపై ప్రజలకు అవగాహన అవసరం

మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తారకప్రసాద్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మత్తు వైద్యం(ఎనస్తీషియా)పై ప్రజలకు విస్తృత అవగాహన అవసరమని ఏపీ మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ అన్నారు. అక్టోబరు 16 ప్రపంచ మత్తు వైద్య దినోత్సవం పురస్కరించుకుని ఎనస్తీషియాపై అవగాహన కలిగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఐఎంఏ హాలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియాలజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ పిలుపుపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న వైద్య కళాశాలల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్టోబరు 16,1846లో అమెరికాలోని హాస్పటల్‌లో తొలిసారిగా ఈదర్ ద్వారా మొదటిసారిగా రోగికి మత్తు ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో ఏటా అక్టోబరు 16న 150 దేశాల్లో ఎనస్తీషియా డే జరుపుకుంటామన్నారు. ఎనస్తీషియాలో 175 సంవత్సరాల్లో ఎన్నో ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. సమావేశంలో రాష్ట్ర అదనపు వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ టి.సూర్యశ్రీ, మత్తు వైద్యుల సంఘం విజయవాడశాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ విశ్వేశ్వరరావు, ఏపీ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ పి దుర్గాప్రసాద్, డాక్టర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

చంద్రబాబుకు ఏసీ

- కోర్టు ఆదేశాలతో ఏర్పాటు చేసిన జైలు అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం కేంద్రకారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న తెలుగుదేశం అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కోర్టు ఆదేశాలతో ఏసీ వసతి కల్పించారు. చంద్రబాబు ఉన్న స్నేహ బ్యారక్‌లో ఎనిమిది ఫ్యాన్లున్నా వాతావరణం చల్లగా లేకపోవడంతో ఆయన శరీరంపై ర్యాషెస్ వచ్చాయని కుటుంబ సభ్యులు శనివారం ఏసీబీ కోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ వేశారు. దీన్ని స్వీకరించిన కోర్టు ఆ దిశగా విచారించింది. జైలు అధికారులతో, జీజీహెచ్ ప్రత్యేక వైద్యబృందంతో ఏసీబీ కోర్టు న్యాయాధికారి మాట్లాడారు. వారు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని చంద్రబాబుకు టవర్ ఏసీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్ శనివారం రాత్రి 10 గంటల సమయంలో కొత్త టవర్ ఏసీ కొనుగోలు చేసి తీసుకొచ్చారు. చంద్రబాబు ఉంటున్న స్నేహ బ్యారక్ గదిలో ఆదివారం ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేసి, టవర్ ఏసీని అందుబాటులోకి తీసుకొచ్చారు.

జనసేనతో సమన్వయం కోసం టీడీపీ కమిటీ

సాక్షి, అమరావతి: జనసేన పార్టీతో సమన్వయం కోసం టీడీపీ ఐదుగురు సభ్యులతో ఒక కమిటీ నియమించింది. చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కమిటీని నియమించినట్లు టీడీపీ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపింది. అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, పయ్యావుల కేశవ్, పితాని సత్యనారాయణ, తంగిరాల సౌమ్యలను ఈ కమిటీలో నియమించింది.

చంద్రబాబుపై ప్రభుత్వ వైఖరి అమానవీయం

- జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న వైఖరి అమానవీయంగా ఉందని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు జనసేన పార్టీ ఆదివారం మీడియాకు ప్రకటన విడుదల చేసింది. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న చంద్రబాబు ఆరోగ్య స్థితిగతుల విషయంలో నిర్లక్ష్యం తగదని..ఆయన వయసును దృష్టిలో ఉంచుకోవడంతోపాటు, ఆయన ఎదుర్కొంటున్న ఆరోగ్యపరమైన సమస్యలపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని పవన్ కోరారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి సరికాదని పేర్కొన్నారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా ఆందోళన చెందితే ప్రభుత్వ సలహాదారులు, జైళ్ల శాఖ అధికారులు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరిని సూచిస్తున్నాయన్నారు. చంద్రబాబు విషయంలో ప్రభుత్వ వైఖరిపై కోర్టులు జోక్యం చేసుకొని విచారణ చేపట్టాలని కోరారు.

సీఎం జగన్‌కు అందరూ అండగా నిలవాలి

- సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ప్రతిరోజూ విషం చిమ్మే దుష్ట చతుష్టయం నుంచి రాష్ట్రాన్ని కాపాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి కోరారు. యూకే వైఎస్సార్‌సీపీ కన్వీనర్ డాక్టర్ చింతా ప్రదీప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో లండన్‌లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర ప్రగతి కోసం, ప్రజల అభివృద్ధి, మెరుగైన భవిష్యత్ కోసం సీఎంవైఎస్ జగన్ ఎంతగానో కష్టపడుతున్నారు. ఏపీలోని గ్రామాలన్నింటినీ అభివృద్ధి చేస్తున్నారు. మీరందరూ భారత్ వచ్చినప్పుడు ఏపీలోని గ్రామాల్లో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలను చూస్తే ఆశ్చర్యపోతారు. ప్రజా సంక్షేమంలోనే కాదు.. అవినీతిపరుల గుండెల్లో కూడా సీఎం జగన్ సింహస్వప్నంగా నిలిచారు. 175కు 175 నియోజకవర్గాల్లో విజయమే లక్ష్యంగా రానున్న రోజుల్లో సోషల్ మీడియాలో అందరం కలిసి పనిచేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియా కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నేను ఉంటా' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు మేడపాటి వెంకట్, ఏపీఎస్ఎస్‌డీసీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చల్లా మధు, వైఎస్సార్‌సీపీ అమెరికా కన్వీనర్ పండుగాయల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

విద్యుదాఘాతానికి తండ్రీకొడుకుల మృతి

గజ్వేల్‌రూరల్: వరిపొలంలో తెగిపడ్డ కరెంటు తీగలను తాకడంతో తండ్రీకొడుకులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన కుమ్మరి కనకయ్య(52), లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు భాస్కర్, కరుణాకర్, అనిల్ ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున వరిపైరుకు నీరు పెట్టేందుకు వెళ్లిన కనకయ్య తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను గమనించకుండా తాకడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో భాస్కర్(30), కరుణాకర్ పొలం వద్దకు వెళ్లారు. భాస్కర్ సైతం నేలపై పడిన విద్యుత్‌తీగలను గమనించకుండా తాకడంతో షాక్‌కు మృతి చెందాడు. వీరి వెంట వచ్చిన శునకం కూడా ఆ తీగలను తాకడంతో మృతి చెందింది.

టెన్త్ ఫెయిలైన 88,342 మంది తిరిగి బడికి..

ఫలిస్తున్న ప్రభుత్వ చర్యలు.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యార్థులందరూ ఉన్నత విద్య చదవాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం. అందుకే ఆయన పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యా రంగానికి ఎనలేని ప్రాధాన్యతనిస్తున్నారు. పలు సంస్కరణలు తెచ్చారు. అందులో భాగమే టెన్త్ ఫెయిలైన విద్యార్థులను తిరిగి స్కూళ్లలో ఎన్‌రోల్ చేయించి తరగతులకు పంపడం. వారు పదో తరగతి ఫెయిలైన తర్వాత చదువు మానేయకుండా ఈ చర్యలు చేపట్టారు. మధ్యలో చదువు మానేస్తే పిల్లల భవిష్యత్తు అస్తవ్యస్తమవుతుంది. దీంతో వారిని తిరిగి తరగతులకు పంపుతున్నారు. తిరిగి పదో తరగతిలో చేరిన వారికి విద్యా రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నింటినీ ప్రభుత్వం అందిస్తోంది. గత విద్యా సంవత్సరంలో 1.23,680 మంది విద్యార్థులు టెన్త్ ఫెయిలయ్యారు. వారు తిరిగి స్కూల్స్‌లో చేరారా లేదా అనే వివరాలన్నింటినీ గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రత్యేక ట్రాకింగ్ సాఫ్ట్‌వేర్‌తో ప్రభుత్వం సేకరించింది. వారిలో 88,342 మందిని ఇప్పటివరకు తిరిగి పదో తరగతిలో ఎన్‌రోల్ చేయించింది. ఇప్పుడు ఈ విద్యార్థులంతా తిరిగి తరగతులకు హాజరవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కె.ఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ అంశంపై సమీక్షించారు.

అదనంగా చేరికలు



గత విద్యా సంవత్సరంతో పోల్చితే ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 1,26,212 మంది అదనంగా చేరారు. గత విద్యా సంవత్సరంలో టెన్త్‌లో 6,64,511 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది 7,90,723 మంది ఎన్‌రోల్ అయ్యారు. అందరినీ బడిబాట పట్టించడంతో పాటు ఆ పిల్లలందరూ డిగ్రీ వరకు చదివేలా సూక్ష్మస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను అమలు చేయడమే ఇందుకు కారణమని అధికారులు వెల్లడించారు. పాస్ అయిన విద్యార్థులు అంతటితో చదువు ఆపేయకుండా తదుపరి కోర్సుల్లో చేరుతున్నారా లేదా అనే వివరాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మస్థాయిలో సేకరిస్తోంది. చదువు ఆపేసిన వారిని పై తరగతుల్లో చేరేలా ప్రోత్సహిస్తోంది. ప్రతి పేద విద్యార్థి ఆర్థిక స్తోమత లేక మధ్యలో చదువు మానేయకుండా ఉన్నత విద్యను అభ్యసించేలా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద, నాడు–నేడు కార్యక్రమాలన్నీ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించే పథకాలే.

టెన్త్ ఫెయిలైన విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ జిల్లాల వారీగా..

జిల్లా	తిరిగి ఎన్‌రోలైన విద్యార్థుల సంఖ్య
అనంతపురం	9,112
నంద్యాల	5,693
విజయనగరం	3,200
తూర్పు గోదావరి	6,413
గుంటూరు	3,403
పశ్చిమ గోదావరి	6,084
పల్నాడు	4,395
విశాఖపట్నం	2,711
కర్నూలు	8,065
బాపట్ల	1,894
ఏలూరు	6,084
కృష్ణా	4,160
కాకినాడ	3,525
నెల్లూరు	3,527
వైఎస్సార్	1,807
ప్రకాశం	1,106
ఎన్టీఆర్	4,046
శ్రీకాకుళం	1,361
అనకాపల్లి	1,684
పార్వతీపురం మన్యం	482
శ్రీ సత్యసాయి	3,938
అంబేడ్కర్ కోనసీమ	1,270
తిరుపతి	1,926
చిత్తూరు	834
అన్నమయ్య	1,270
అల్లూరి సీతారామరాజు	352

మొత్తం: 88,342



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య, చిత్రంలో ఏపీ బీసీ సంఘం నాయకులు

కుల గణన నిర్ణయం చరిత్రాత్మకం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కృష్ణయ్య
- కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

సాక్షి, అమరావతి: ఏపీలో కుల గణన చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు ఎన్.మారేష్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ బీసీ సంఘాల నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీలకు మేలు చేసే విషయంలో సీఎం జగన్ దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కుల గణనను పూర్తి పారదర్శకంగా జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీని వల్ల ఏ కుల జనాభా ఎంత అనేది స్పష్టంగా తెలుస్తుందన్నారు. తద్వారా వారికి దక్కాల్సిన ఫలాలు అందుతాయన్నారు. సీఎం జగన్ గత నాలుగేళ్ల పాలనలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. అలాగే పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టించడం ద్వారా దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ మాట్లాడుతూ.. సర్పంచ్ నుంచి రాజ్యసభ స్థానాల వరకు బీసీలకు రాజ్యాధికారంలో 65 శాతానికి పైగా వాటా ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఇప్పుడు కుల గణన చేపట్టడం బీసీల జీవితాల్లోనే మర్చిపోలేని అంశమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధి ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల నాయకులు రాజేందర్, వెంకట సుబ్బారావు, జనార్దన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పనికిరాని ప్రతిపక్షం

- బాబు, పవన్ ఉండేది, తినేది హైదరాబాద్‌లో.. విషం చిమ్మేది ఆంధ్రరాష్ట్రంలో
- మంత్రి జోగి రమేశ్



చిలకలపూడి (మచిలీపట్నం): రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు పనికిరాని పక్షాలుగా మారాయని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్ విమర్శించారు. ఆయన ఆదివారం కృష్ణాజిల్లా మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఉండేది, తినేది హైదరాబాద్‌లోనని, విషం చిమ్మేది మాత్రం ఏపీపైన అని చెప్పారు. ఆ పార్టీలకు చెందిన డ్రామా, క్యారెక్టర్ ఆర్టిస్టులు తమ నాయకుడికి ఏదో జరిగిపోతోందని చెబుతున్న కల్లబొల్లి మాటలు, కన్నీళ్లను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా న్యాయం నిలకడగా ఉంటుందని చెప్పారు. చంద్రబాబు జైలుకెళ్లిన నాటి నుంచి ఆ పార్టీ నాయకులు కొవ్వొత్తులు వెలిగించి, లైట్లు ఆపి, కృష్ణానదిలో దూకి.. ఇలా వేషాలన్నీ వేశారని విమర్శించారు. ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపితే పీడాపోతుందన్నారు. చంద్రబాబు అవినీతిలో భాగస్వామ్యం ఉన్నట్లుగా చంద్రబాబుతో నేను.. అంటూ కార్యక్రమాలు చేపడుతున్నారని, టీడీపీ సభ్యులు కూడా జైలుకెళ్లాలని ఉబలాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. అవినీతిలో అడ్డంగా దొరికిపోతే ఎటువంటి వారైనా తీర్పుకు బద్ధులై ఉండాల్సిందేనని చెప్పారు. సీఎం జగన్‌పై నోరుపారేసుకుంటే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. చిల్లర వేషాలు కట్టిపెట్టాలని హితవు పలికారు. ఐదుకోట్ల మంది ప్రజలు చంద్రబాబు మోసాన్ని, అవినీతిని తెలుసుకున్నారు కాబట్టే టీడీపీ నాయకులు ఏ కార్యక్రమం చేసినా ప్రజల మద్దతు లభించటం లేదన్నారు. మరోపక్క దత్తపుత్రుడి వారాహి యాత్రకు ప్రజల స్పందనే కరువై అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. చంద్రబాబు జైల్లో, లోకేశ్ ఢిల్లీలో, దత్తపుత్రుడు ఎక్కడో ఉంటూ రాష్ట్ర ప్రజలను పట్టించుకోవడంలేదనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెబుతారని ఆయన చెప్పారు.

'మద్యం'పై మాట్లాడే అర్హత పురందేశ్వరికి లేదు

- జగనన్న ప్రభుత్వంలో ఒక్క డిస్టిలరీకి అనుమతి ఇవ్వలేదు
- చంద్రబాబు ప్రభుత్వంలో 7 డిస్టిలరీలకు అనుమతి
- మరిదిని కాపాడుకునే తాపత్రయం ఆమెది: డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి



పుత్తూరు రూరల్: మద్యం పాలసీపై మాట్లాడే అర్హత ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి లేదని డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి అన్నారు. ఆదివారం తిరుపతి జిల్లా పుత్తూరులో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీ రామారావు మద్యపాన నిషేధం తీసుకొస్తే.. ఆయన స్థాపించిన పార్టీని చంద్రబాబు లాక్కుని మద్య నిషేధం ఎత్తివేసినప్పుడు పురందేశ్వరి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చంద్రబాబు పాలించిన 2014–19 కాలంలోనే ఏకంగా 7 డిస్టిలరీలకు అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. 2019లో ఏర్పడిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇప్పటివరకు ఒక్క డిస్టలరీకి గానీ, ఒక్క బ్రూవరీకి గాని అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. పీఎంకే డిస్టలరీ యనమల రామకృష్ణుడిదని, శ్రీకృష్ణ డిస్టలరీ ఆదికేశవులనాయుడిదని, స్పై డిస్టిలరీ ఎస్పీవై రెడ్డిదని, విశాఖ డిస్టిలరీ అయ్యన్నపాత్రుడిదని వివరించారు. ఇప్పుడున్న ప్రతి బ్రాండు చంద్రబాబు పాలనలో తీసుకొచ్చినవే అని, అందుకే వాటిని 'సీ' బ్రాండ్లు అంటున్నారని తెలిపారు. కేజీహెచ్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో నెలకు సుమారు 20 మంది పాడైన లివర్, పాంక్రియాస్ రోగులు అడ్మిట్ అవడమనేది పదేళ్లుగా జరుగుతున్న విషయమేనని స్పష్టం చేశారు.

మద్యపానం చేస్తే లివర్ చెడిపోవచ్చు

బ్రాండుతో సంబంధం లేకుండా మద్యాన్ని 8 నుంచి 10 ఏళ్ల పాటు తీసుకుంటే లివర్ చెడిపోవచ్చని మంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. దేశంలోనే మద్యం సేవించే వారి సంఖ్య 15 శాతానికి పెరిగిందని నిమ్హాన్స్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. చంద్రబాబు పాలనలో మద్య నిషేధాన్ని ఎత్తివేయడాన్ని సమర్థిస్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి వార్తలు రాశాయని గుర్తు చేశారు. చంద్రబాబు తన అనుచర గణానికి 4,378 మద్యం షాపులను కట్టబెట్టడమే కాకుండా, 43 వేల బెల్ట్ షాపులు పెట్టి మద్యపానాన్ని ఏరులై పారించారని గుర్తు చేశారు.

అందుకే పురందేశ్వరి మద్యం పాట పాడుతోంది

పురందేశ్వరి తన మరిది చంద్రబాబు, ఆయన కొడుకు లోకేశ్‌ను కాపాడేందుకే మద్యం పాట పాడుతున్నారని మంత్రి నారాయణస్వామి ఎద్దేవా చేశారు. పురందేశ్వరి బీజేపీ అధ్యక్షురాలా? టీడీపీ అధ్యక్షురాలా అర్థం కావడం లేదన్నారు. చంద్రబాబుతో కలిసి పురందేశ్వరి, ఆమె భర్త సైతం ఎన్టీఆర్ మృతికి కారకులయ్యారని, ఎన్టీఆర్ కూతురుగా చెప్పుకోవడానికి ఆమెకు అర్హత లేదని పేర్కొన్నారు. చంద్రబాబు ఆర్థిక నేరస్తుడని తొలిసారిగా చెప్పింది దేశ ప్రధాని నరేంద్ర మోదీ అని.. ఆ తరువాత చెప్పింది పవన్‌కళ్యాణ్ అని గుర్తు చేశారు. చంద్రబాబు అరెస్ట్ న్యాయపరంగానే జరిగిందని రాష్ట్ర ప్రజలు విశ్వసించారు కాబట్టే ప్రజల నుంచి ఎలాంటి వ్యతిరేక స్పందన రాలేదన్నారు.

సానుభూతి కోసమే టీడీపీ విషప్రచారం

- చంద్రబాబు ఆరోగ్యంపై శ్రద్ధ ఉంటే ఇప్పటివరకు ఏసీ కావాలని పిటిషన్ వేయలేదే?
- చట్టం దృష్టిలో అందరూ సమానమే
- మంత్రి అంబటి రాంబాబు



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబును ఎలాగైనా సెంట్రల్ జైలు నుంచి బయటికి తీసుకురావాలనే దురుద్దేశంతో బాబుకు ఆరోగ్యం బాలేదని, బరువు తగ్గారని టీడీపీ నాయకులు విషప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టి సానుభూతి పొందాలని చూస్తున్నారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. చంద్రబాబు తప్పు చేశాడు కాబట్టే న్యాయస్థానాలు ఆయనకు బెయిల్ ఇవ్వడం లేదన్నారు. నాలుగు రోజులుగా కుటుంబసభ్యులు, టీడీపీ శ్రేణులు చంద్రబాబు ఆరోగ్యం బాలేదని, బరువు తగ్గారని, ఆహారంలో స్టెరాయిడ్స్ కలిపి ఆయన్ని అంతమొందించాలని చూస్తున్నారని, ఆయనకు ప్రాణాపాయం ఉందని రాద్ధాంతం చేస్తూ రాష్ట్ర ప్రజల సానుభూతి పొందాలని కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఆరోగ్యం బాగాలేకపోతే డాక్టర్లు పరిశీలించి అవసరమైతే ఆస్పత్రికి పంపుతారన్నారు. ఆయన ఆరోగ్యం బాగుందని డాక్టర్లు చెబుతుంటే టీడీపీ నాయకులు చంద్రబాబుకు ఏదో జరిగిపోతుందని విషప్రచారం చేయడం సబబు కాదన్నారు. చంద్రబాబు ఎప్పటి నుంచో చర్మవ్యాధితో బాధపడుతున్నారని, మందులు వాడుతున్నారని అందరికీ తెలుసన్నారు. బాబు ఆరోగ్యం పట్ల అంత శ్రద్ధ ఉన్న కుటుంబసభ్యులు, టీడీపీ నాయకులు 35 రోజులుగా జైల్లో ఉంటే ఏసీ కావాలని పిటిషన్ వేశారా అని ప్రశ్నించారు. ఏదో ఇప్పుడే చర్మవ్యాధి వచ్చినట్లు హడావుడిగా పిటిషన్ వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుకు కోర్టు ఆదేశాల మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని, ఇంటినుంచి భోజనం, మందులు కూడా పంపుతున్నారని తెలిపారు. కోర్టు పర్యవేక్షణలో అధికారులు, డాక్టర్లు నిత్యం ఆయన్ని పర్యవేక్షిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా పనిచేసిన కరుణానిధి, జయలలిత, యడియూరప్ప, లాలూప్రసాద్‌యాదవ్ అవినీతి ఆరోపణలతో జైలు జీవితం గడిపిన విషయాన్ని టీడీపీ శ్రేణులు గమనించాలని సూచించారు. పురందేశ్వరి టీడీపీ అధ్యక్షురాలా.. బీజేపీ అధ్యక్షురాలా అని సందేహం వస్తోందని చెప్పారు. చంద్రబాబును కాపాడేందుకు ఆమె లోకేశ్‌తో వెళ్లి కేంద్ర హోంమంత్రిని కలిశారని, అక్కడ తప్పు ఉందని తెలుసు కాబట్టే కేంద్రం కూడా ఏం చేయలేకపోయిందని పేర్కొన్నారు. ములాఖత్ తర్వాత చంద్రబాబు కుటుంబ సభ్యులు ఏం మాట్లాడకుండా వెళ్లిపోయారని, అనారోగ్యంగా ఉంటే మాట్లాడేవారు కాదా అన్ని ప్రశ్నించారు. చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంతో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, దీన్ని వక్రీకరించి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే టీడీపీకే నష్టమని మంత్రి అంబటి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌కు షాకిచ్చిన టీడీపీ శ్రేణులు

'న్యాయానికి సంకెళ్లు'కు స్పందన కరువు

సాక్షి, అమరావతి: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌కు టీడీపీ శ్రేణులు మరోసారి గట్టి షాకిచ్చాయి. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టు అంశాన్ని ప్రజల్లో నానుతూ ఉండేలా చేయాలని టీడీపీ అధినాయకత్వం ఎంత ప్రయత్నిస్తున్నా పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా చంద్రబాబుకు మద్దతుగా లోకేశ్ పిలుపు మేరకు చేపట్టిన మరో కార్యక్రమం కూడా విఫలమైంది. 'న్యాయానికి సంకెళ్లు' పేరుతో ఆదివారం రాత్రి 7 గంటలకు చేతులకు తాడు లేదా రిబ్బను కట్టుకుని 5 నిమిషాలపాటు నిరసన తెలపాలని లోకేశ్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ప్రజల్లోనే కాదు పార్టీలోనూ కనీస స్పందన లభించలేదు. చంద్రబాబు పట్ల ప్రజల్లో ఏమాత్రం సానుభూతి లేదనే విషయాన్ని ఈ కార్యక్రమం నిరూపించింది. హైదరాబాద్‌లోని నివాసంలో లోకేశ్, ఆయన భార్య బ్రాహ్మణి, రాజమహేంద్రవరంలో భువనేశ్వరి చేతులకు తాళ్లు కట్టుకుని నిరసన తెలిపారు. పలుచోట్ల పార్టీ నాయకులు కార్యక్రమం చేశామంటే చేశామన్నట్టు మమ అనిపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలకు గాను కనీసం 50 నియోజకవర్గాల్లో కూడా ఈ కార్యక్రమం జరగలేదని ఆ పార్టీ నేతలే వాపోతున్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే పార్టీ నేతలు తప్ప మిగిలిన పార్టీ నేతలు అసలు దీన్ని పట్టించుకోలేదు. ప్రజల్లో అయితే అసలు దీని ఊసే వినిపించలేదు.

టీడీపీ అధిష్టానంలో ఆందోళన

ఇంతకుముందు చంద్రబాబుకు మద్దతుగా చేపట్టిన కార్యక్రమాలు కూడా పూర్తిగా విఫలమయ్యాయి. సెప్టెంబర్ 30న మోత మోగిద్దాం పేరుతో పళ్లాలు, గంటలు మోగించే కార్యక్రమంతోపాటు అక్టోబర్ 7న కొవ్వొత్తులు వెలిగించే కార్యక్రమం సైతం తుస్సుమన్నాయి. తాజాగా న్యాయానికి సంకెళ్లు కార్యక్రమానికి స్పందన లేకపోవడంతో టీడీపీలో ఆందోళన నెలకొంది. చంద్రబాబుపై ప్రజల్లో సానుభూతి వెల్లువెత్తుతోందని చూపించేందుకు ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియా ఎంత ప్రయత్నించినా వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉండటంతో వారి ఆటలు సాగడం లేదు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి దిగజారిందంటూ హైడ్రామా నడిపి ప్రజల్లో సానుభూతి పొందాలని చూశారు. ఈ డ్రామా వల్ల ప్రజల్లో స్పందన వస్తుందో లేదో తెలుసుకునేందుకు ఆదివారం న్యాయానికి సంకెళ్లు కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అసలు దీన్ని పట్టించుకునేవారు పార్టీలో లేకుండాపోయారు.

ఏపీలో పింఛన్ పథకం అమలు భేష్

- మేం కూడా అదే బాటలో పెంచుకుంటూ పోతాం
- బీఆర్ఎస్ మేనిఫెస్టో వెల్లడిస్తూ ఏపీ సీఎం జగన్‌కు తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రశంసలు



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న పెన్షన్ల విధానం బాగుందని.. ఆయన దానిని విజయవంతంగా అమలుచేస్తున్నారని సీఎం కేసీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. రూ.2వేల నుంచి పెన్షన్‌ను ప్రారంభించి ఏటా పెంచుకుంటూ చివరి కొచ్చేసరికి రూ.3వేలకు తీసుకెళ్లారని ఆయన కొనియాడారు. తాము కూడా ప్రస్తుతం తెలంగాణలో ఇస్తున్న ఆసరా పెన్షన్ రూ.2,016ను దశల వారీగా రూ.500 చొప్పున పెంచుకుంటూ వెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇక్కడి తెలంగాణ భవన్‌లో ఆదివారం కేసీఆర్ బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసి మాట్లాడారు.

ఆరునెలల్లో హామీల అమలు..

రాష్ట్ర ఆదాయాన్ని పెంచి పేదలకు పంచాలన్నదే తమ విధానమని.. మళ్లీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే హామీలన్నింటినీ అమలుచేస్తామని ఆయన ప్రకటించారు. మేనిఫెస్టోలో కేసీఆర్ ప్రకటించిన ప్రధాన హామీలు.. అర్హులైన మహిళలకు ప్రతీనెలా రూ.3 వేల భృతి.. తెల్ల రేషన్‌కార్డుదారులున్న పేద కుటుంబాలకు రైతు బీమా తరహాలో ఎల్ఐసీ ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా. ప్రస్తుత ఎకరాకు రూ.10వేల సాయాన్ని.. తొలి ఏడాది రూ.12 వేలకు, క్రమంగా రూ.16 వేలకు పెంపు.. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత కార్మికులు తదితరులకు ప్రతీనెలా ఇచ్చే మొత్తం రూ.5 వేలకు పెంపు. వచ్చే ఏడాది మార్చిలో రూ.3,016కు, తర్వాత ఏటా మరో రూ.500 చొప్పున రూ.5 వేల దాకా పెంపు.. అలాగే, ప్రస్తుతమున్న రూ.4,016కు ఏటా రూ.300 చొప్పున చేర్చుతూ రూ.6,016కు పెంపు.. ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంపు.. డబుల్ బెడ్రూం పథకం కొనసాగింపు, పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీ.. రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు రూ.400కే వంట గ్యాస్ సిలిండర్.. ఉద్యోగులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) నుంచి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)కు తిరిగి మార్చే అంశంపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ.. అసైన్డ్ భూముల విముక్తికి చర్యలు.

2017లోనే 'స్కిల్' కేసు

మొదటి పేజీ తరువాయి

కీలక ప్రశ్నలకు సమాధానాలు దొరికినట్టైంది.

సాంకేతిక సాకు ఎత్తుగడ

స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్ట్ చేయాలంటే గవర్నర్ అనుమతి అవసరమంటూ టీడీపీ వ్యూహాత్మకంగా ఓ ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. సీమెన్స్‌కు తెలియకుండా, ఆ కంపెనీ ముసుగులో సాగించిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు ఎలాంటి అవినీతికి పాల్పడలేదని టీడీపీ గానీ ఆయన న్యాయవాదులు గానీ చెప్పే సాహసం చేయలేకపోతున్నారు. 2018 నవంబరు నుంచి అమలులోకి వచ్చిన 17 ఏ సెక్షన్ ప్రకారం చంద్రబాబుకు రాజ్యాంగ రక్షణ లభిస్తుందని మాత్రమే అడ్డగోలుగా వాదిస్తున్నారు.

2017లోనే కేసు నమోదు..

చంద్రబాబు బృందం ఎతుగడలను కేంద్ర జీఎస్టీ విజిలెన్స్ విభాగం చిత్తు చేసింది. ఈమేరకు కేంద్ర జీఎస్టీ డైరెక్టర్ జనరల్ (డీజీ) రాసిన లేఖ తాజాగా వెలుగులోకి రావడంతో టీడీపీ పన్నాగం బెడిసికొట్టింది. స్కిల్ స్కామ్ కేసు 2017లోనే నమోదై దర్యాప్తు కూడా అప్పుడే మొదలైనట్లు స్పష్టమైంది. కాబట్టి చంద్రబాబుకు సెక్షన్ 17ఏ వర్తించదని తేటతెల్లమైంది. 2017 మే నెలలో పుణెలో కొన్ని షెల్ కంపెనీల్లో నిర్వహించిన తనిఖీల్లో జీఎస్టీ విభాగం భారీ అక్రమాలను గుర్తించింది. నకిలీ ఇన్వాయిస్‌లతో జీఎస్టీ ఎగవేతకు పాల్పడ్డ కంపెనీలను గుర్తించి విస్తృతంగా సోదాలు జరిపింది. వీటిలో స్కిల్లర్ అనే కంపెనీ కూడా ఉంది. దీనిపై నాడే తీగ లాగడంతో చంద్రబాబు ప్రభుత్వ అవినీతి డొంకంతా కదిలింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (ఏపీఎస్ఎస్‌డీసీ) పరికరాలను సరఫరా చేసినట్లు చూపించేందుకు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించినట్లు తేలింది. ఆ ఇన్వాయిస్‌లను చూపించే ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి నిధులు పొందినట్లు నిర్ధారణ అయింది. దీనిపై జీఎస్టీ విభాగం 2017 మే నెలలోనే కేసు నమోదు చేసింది. పూర్తి స్థాయిలో విచారించి ఆధారాలతో సహా కుంభకోణాన్ని బట్టబయలు చేసింది.

పాత కేసులకు పాత చట్టమే

ఏపీఎస్ఎస్‌డీసీ నిధులు దారి మళ్లడంపై విచారించాలని సూచిస్తూ ఏపీ ఏసీబీ విభాగానికి 2018 ఫిబ్రవరిలోనే సమాచారం ఇచ్చింది. ఈమేరకు కేంద్ర జీఎస్టీ ఇంటలిజెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ లేఖ రాశారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. చంద్రబాబు ఒత్తిడితో ఏసీబీ విభాగం ఆ కేసును తొక్కిపెట్టింది. అంటే స్కిల్ స్కామ్ బయటపడింది... కేసు నమోదైంది 2017లోనే అని స్పష్టమవుతోంది. అప్పటికి 17ఏ సెక్షన్ అమలులోకి రాలేదు. ఆ సెక్షన్ 2018 జూలైలో చేయగా 2018 నవంబరు నుంచి అమలులోకి వచ్చింది. కాబట్టి స్కిల్ స్కామ్ కేసులో నిందితుడు చంద్రబాబుకు 17ఏ సెక్షన్ కింద రక్షణ లభించదన్నది నిర్ధారణ అయినట్టేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పాత కేసులకు పాత చట్టమే వర్తిస్తుందని తేల్చి చెబుతున్నారు. అవినీతికి పాల్పడి ఆధారాలతోసహా అడ్డంగా దొరికిన చంద్రబాబు సాంకేతిక సాకులతో తప్పించుకునేందుకు చేస్తున్న యత్నాలు ఫలించవని వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్ర జీఎస్టీ ఇంటలిజెన్స్ విభాగం డీజీ లేఖతో చంద్రబాబు కుట్ర బెడిసికొట్టినట్టేనని చెబుతున్నారు.

సన్నిధి

మంచిమాట

ఏడవలేక నవ్వటం

మనుషులు ఏడవ లేక పోవటం వల్ల నవ్వుతారు అంటాడు జార్జ్ బెర్నార్డ్ షా. నిజమే కదా! పిల్లలు కింద పడి దెబ్బతగిలితే ఏడుస్తారు. పెద్దవాళ్ళకి ఆ ధైర్యం ఉండదు. పైకి ఏడవరు. ఎవరు ఏమనుకుంటారో అని సంకోచం. ఇతరుల అభిప్రాయాల కోసం బతకటం అలవాటు అవుతుంది ఎదుగుతున్న కొద్దీ. చిన్న పిల్లలకి ఆ బాధ లేదు. తమ నొప్పి మాత్రమే వాళ్ళకి ప్రధానం. భావాలని దాచుకోవటం తెలియదు. అవసరం లేదు.

బాల్యావస్థ దాటి ఎదుగుతున్న కొద్దీ ఇతరులు తనని గురించి ఏమనుకుంటున్నారో అన్న దానికి ప్రాధాన్యం ఇవ్వటం ఎక్కువ అవుతూ ఉంటుంది. తన ప్రవర్తన మార్చుకునే ఉద్దేశం ఉండదు గాని, అందరు తనని గొప్పవాడుగా భావించాలనే తపన ఉంటుంది. దాని కోసమే నటించటం. ఏడుపు వచ్చినా దాన్ని అదుపులో పెట్టి, బాధాప్రకటనకి ఒక మాధ్యమం కావాలి కనుక ఏడుపునే నవ్వుగా మార్చటం జరుగుతుంది. తెలివితేటలు పెరుగుతున్న కొద్దీ ఆ సంఘటనకి రకరకాల చిలవలు పలవలు చేర్చటం కూడా చూస్తాం. తాను కావాలనే పడినట్టు చెప్పటమో, అదే బండి అయితే అది బాగుండ లేదనో, బాగు చేయటానికి ఇస్తే సరిగ్గా చేశారో లేదోనని పరీక్ష చేయబోయాననో చెపుతూ ఉంటారు.



''అసలు దెబ్బ తగలనే లేదు'', ''ఇట్లాంటివి ఎన్ని చూశాం? ఇదొక లెక్కా?'' వంటి వ్యాఖ్యానాలు విషయాన్ని తేలిక చేయటానికి చెప్పినా చెప్పకపోతేనే మర్యాదగా ఉండేది అనిపిస్తుంది.

ఇది నేలమీద పడటం అన్నదానికి సంబంధించింది మాత్రమే కాదు. అన్ని విషయాలకి వర్తిస్తుంది. ఆర్థికంగా కాని, వ్యాపారపరంగా కాని, ఉద్యోగపరంగా కాని, కుటుంబపరంగా కాని, మరేదైనా కాని, దెబ్బ తగిలినప్పుడు గుట్టుగా ఉండటం మంచిదే కాని, అదేదో ఘనతగా చెప్పుకోవటం హర్షణీయం కాదు. ఏడిస్తే చూసి సంతోషించేవారు, ఓదార్చి తృప్తిపడేవారు ఉంటారు. మరింత నైతిక ధైర్యాన్ని దిగజార్చేవారూ ఉంటారు. కనుక బాధ పడుతున్నట్టు చెప్పకూడదు. అసలు విషయం ఏమంటే బాధపడకూడదు. పైకి నవ్వేసి లోపల బాధతో కుమిలి పోవటం మంచిది కాదు.

ప్రస్తుతం మనం సమకాలిక సమాజాన్ని గమనించినట్టయితే చాలా మంది మనుషులు నవ్వుతూ కనపడటం ఏడవ లేక మాత్రమే అని అర్థం అవుతుంది. ఆ నవ్వులలో ఏ మాత్రం స్వచ్ఛత కనపడదు. లోపల ఉన్న బాధని, దుఃఖాన్ని, కష్టాలని, దిగులుని, నిరాశా నిస్పృహలని తెచ్చిపెట్టుకున్న నవ్వు వెనక దాచి కనపడతారు. ఆ నవ్వుల్లో జీవం ఉండదు. సహజత్వం ఉండదు. నవ్వు ఒక ముసుగు. నటులు ముఖానికి వేసుకున్న రంగు లాంటిది.

మనోభావాలని యథేచ్ఛగా ప్రకటించ కలిగితే, కనీసం ఆత్మీయుల ముందు గుండెల్లో ఉన్న బరువు తగ్గుతుంది. తరువాత హాయిగా నవ్వగలుగుతాం. ఏడవటం తప్పు కాదే! మనిషికి సహజంగా ఉన్న లక్షణం.

ఒకరు బాగుపడుతుంటే చూసి ఏడవటం తప్పు కాని, కష్టం వచ్చినప్పుడు ఏడవటం మానవ సహజం. శ్రీరామచంద్రుడంతటి వాడే తండ్రి మరణవార్త విని భోరున విలపించాడు. అది మానవత్వం. బాధ కలిగినప్పుడు ఏడిచి మనసులో ఉన్న బాధని బయటికి వెళ్ళగక్కకపోతే ఎన్నోరకాల అనారోగ్యాలు వస్తాయి. గుండె బరువుని తగ్గించి తేలిక పరచకపోతే అది గుండెపోటు, రక్తపోటు, మధుమేహం మొదలైన రూపాంతరాలు చెందుతుంది.

నవ్వు ముఖకండరాలకి మంచి వ్యాయామం. శరీరానికి ఆరోగ్యం. మనస్సుకి రసాయనం ఎదుటి వారికి ఆహ్లాదం. అట్లా ఉండాలంటే ఏడవలేక నవ్వకూడదు. ఆనందంతో నవ్వాలి.

– డా. ఎన్. అనంతలక్ష్మి

అమృత బిందువులు

- దుర్మార్గులతో స్నేహం చేయకూడదు. వాళ్ళతో విరోధం కూడా కూడదు. వారిని పట్టించుకోకుండా ఉండడమే మేలు. నిప్పును పట్టుకుంటే కాలుతుంది. చల్లారిన తర్వాత పట్టుకున్నా మసి అవుతుంది. కనుక దాని జోలికి పోకపోవడమే మేలు.
- విలువలేని దుమ్ము కూడా ఒక్కోసారి నీ కంట్లో పడి విలవిలలాడేలా చేస్తుంది. విలువ లేని కొందరు మనుషులు కూడా చాలాసార్లు తమ మాటలతో బాధ పెడతారు. ఊదేసుకుని ముందుకు వెళ్ళడమే ఉత్తముల లక్షణం.
- నమ్మకం అనేది గాజు పాత్ర లాంటిది. గాజుపాత్ర ఒక్కసారి చేతి నుండి కింద పడితే దాన్ని అతికించడం ఎలా అసాధ్యమో, ఒకసారి మనం ఒక వ్యక్తి దగ్గర నమ్మకాన్ని కోల్పోతే మళ్ళీ తిరిగి ఆ నమ్మకాన్ని సంపాదించడం అలా అసాధ్యం... అసంభవం. కాబట్టి కలుషితమైన ఈ రోజుల్లో కల్మషం లేకుండా నిన్ను ఎవరైనా నమ్మితే ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం నీ ప్రాణాన్ని అయినా పణంగా పెట్టు తప్పులేదు కానీ నమ్మకాన్ని కోల్పోకు...

వాగ్గేయకార వైభవం

భక్తుడికి ఆహారం భక్తే



యోగరతోవా భోగ రతోవా/ సంగ రతోవా సంగ విహీనః/ యస్య బ్రహ్మణి రమతే చిత్తం/ నందతి నందతి నందత్యేవ... చెరుకు గడను తీసుకొచ్చి కత్తితో నరికినా, మరలోవేసి తిప్పినా, నోటితో కొరికినా... ఎంత హింసించినా తియ్యటి రసాన్ని ఒలికించడం తప్ప అది మరో విధంగా స్పందించదు. కారణం – త్యాగం దాని లక్షణం. ఏ వాగ్గేయకారుడి జీవితం చూసినా ప్రతివారి జీవితంలో ఈ ప్రశాంతత, ఈ కారుణ్యం, ఈ ద్వంద్వాతీత స్థితి, అందరినీ ప్రేమించగల, అనుగ్రహించగల శక్తి కనపడుతుంటాయి. వాళ్ళు కూడా అంత గొప్పగా ఆ సంగీతంతోనే ఎదిగారు. ఆ సంగీతంతోనే మనల్ని ఉద్ధరించారు.

త్యాగరాజ స్వామి జీవితం వడ్డించిన విస్తరేమీ కాదు. మహారాజుగారు అన్ని కానుకలు పంపితే 'నిధి చాల సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా నిజ ముగబల్కు మనసా..'' అంటూ వాటిని తీసుకెళ్ళి చెత్తదిబ్బలో పారేస్తాడా ... అని తోడబుట్టిన అన్నగారికే నచ్చలేదు తమ్ముడి పద్ధతి. 'ఎప్పుడూ ఆ విగ్రహాలు పట్టుకుని కూర్చుంటాడు. తమ్ముడు కనుక రాజుగారి కొలువులో పాడితే ఎంత హాయిగా జీవించవచ్చు...' అనే భావన అన్నగారిది.

కాదు... సంగీతం మోక్ష సామ్రాజ్యాన్ని ఇవ్వగలదు. ఇది ఇవ్వగలిగిన ఆనందం వేరొకటి ఇవ్వలేదు. వాగ్గేయకారులకు ఉన్నది సంగీతసాహిత్యాలు మాత్రమే కాదు. నేను పాట రాస్తాను, బాణీ కడతాను, అంటే ఎవడూ వాగ్గేయకారుడై పోడు. సంగీత సాహిత్యాల్లో అంతర్లీనంగా భక్తి ప్రవహించాలి. అది ఎటువంటి భక్తి ...అంటే నువ్వు ఏమయిపోతున్నా... నమ్ముకున్న వాడి చరణాలు వదలలేనిది అది.. అచంచలమైనది... అదే భర్తృహరి మాటల్లో చెప్పాలంటే... నిను సేవింపగ ఆపదల్ పొడమనీ, నిత్యోత్సవం బబ్బనీ,/జనమాత్రుండననీ, మహాత్ముడననీ, సంసార మోహంబు పై/కొననీ, జ్ఞానము గల్గనీ, గ్రహగతుల్ కుందింపనీ, మేలు వ/చ్చిన రానీ... అంటాడు. ఏది ఏమయిపోయినా ఆ భక్తిలో పరమానందాన్ని పొంది ఎప్పటికప్పుడు లోపల ఈశ్వర గుణానుభవాలు పెరిగి అవి కీర్తనలుగా వెలువడుతుంటే ఆయన వాగ్గేయకారుడు. అంటే భక్తి ప్రధానం.

భక్తుడికి భక్తి అమ్మలాంటిది. పసిబిడ్డకు పాలు ఎలాగో, భక్తుడికి భక్తి అలా ఆహారం. భగవంతుడి పాటలు వింటూ, తాను పాడుకుంటూ, రచన చేస్తూ, స్వరపరుస్తూ, శిష్యులకు చెబుతూ, ఏదీ ఆశించకుండా, ఏది లభిస్తే అది తింటూ, పరమ పవిత్రమైన జీవనాన్ని గడుపుతూ ఆఖరికి తన అవసరం లేదనుకున్నప్పుడు గృహస్థాశ్రమాన్ని విడిచిపెట్టి సన్యాసాశ్రమాన్ని స్వీకారం చేసి... భగవంతుడిలో ఐక్యమవుతాడు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

భక్తుడిని వేరొకరు రక్షింపనక్కర లేదు..''వాడిని నా కొరకు రక్షింపవలయు..'' అంటాడు శ్రీమన్నారాయణుడు భాగవతంలో. వాడిని నేను రక్షించేది వాడి కోసం కాదు, నా కోసం..అంటున్నాడు. నన్ను నమ్ముకున్న వాడినే రక్షించకపోతే ఇక నేను ఉన్నానని లోకం ఎందుకు నమ్ముతుంది? అందుకని నేనున్నానని జనులు నమ్మడం కోసం.. నాకోసం వాడిని రక్షిస్తున్నా... అంటున్నాడు. భక్తుని స్థితి అలా ఉంటుంది. వాగ్గేయకారుల అనుభవాలు కూడా ఇవే.

తాత్త్వికథ

దూరం... దగ్గర

ఓ విదేశీయుడు భారతదేశంలోని దేవాలయాల ప్రాశస్త్యాన్ని కంప్యూటర్ ద్వారా తెలుసుకున్నాడు. శేషాచలం కొండల్లో నెలవై ఉన్న వేంకటేశ్వరస్వామి అతడిని ఆకర్షించాడు. వెంటనే స్వామిని దర్శించుకోవాలనిపించింది. అనుకున్నదే తడవుగా చెన్నై విమానమెక్కాడు.

పక్కన కూర్చున్న ప్రయాణికుడి సలహా మేరకు విమానాశ్రయం నుంచి కాలి నడకన తిరుమలకి వెళ్ళదలిచాడు. సంప్రదాయ దుస్తులు ధరించి, భుజానికి సంచీ తగిలించుకుని బయలుదేరాడు.

ఎప్పుడూ చెప్పులు లేకుండా నడవని అతడు, ఎర్రటి ఎండకి కాళ్ళు కాలుతున్నా లెక్కచేయలేదు. స్వామి రూపాన్నే తలుచుకుంటూ ముందుకు నడిచాడు. దారిలో కొండకి నడిచి వెళ్ళే బృందాలు కొన్ని కనిపించాయి. వారితో కలిసి నడవటం కొనసాగించాడు.

అలా మైళ్ళ కొద్దీ ప్రయాణం చేశాక, తిరుచానూరు చేరాడు. తల్లి పద్మావతి అమ్మవారి దర్శనం పూర్తయ్యింది. అమ్మవారి ప్రసాదం తింటూ తలెత్తి చూశాడు. వెండిరంగులో మిలమిలా మెరుస్తున్న శేషాచలం కొండ చాలా దగ్గరగా అనిపించింది. చిన్న పిల్లవాడిలాగా ఎగిరి గంతులేశాడు.

చకచకా నడుచుకుంటూ తిరుపతి పట్టణంలోని గోవింద రాజస్వామి గుడికి వెళ్ళి దండం పెట్టాడు. అక్కడే నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలు కొని చదువుతూ మళ్ళీ శేషాచలం కొండల వైపు చూశాడు. ఆశ్చర్యం... కొండలు దూరంగా ఉన్నట్లు కనిపించాయి.



ఉండబట్టలేక అతడు, తనతోపాటు నడుస్తూ ఉన్న మరో భక్తుడితో ''అదేమిటండీ...? శేషాచలం కొండలకు దూరంగా ఉంటే, అవి చాలా దగ్గరగా ఉన్నట్లు, దగ్గరికి వెళితే ఎక్కడో... దూరంలో ఉన్నట్లు కనబడుతున్నాయి'' అని ఆసక్తిగా అడిగాడు.

ఆ భక్తుడు చిన్న నవ్వు నవ్వి ''అదే నాయనా శేషాచలం కొండల మహాత్మ్యం. అవి స్వామివారు స్వయంభువుగా వెలసిన పవిత్రమైన కొండలు కదా! మనం పనుల్లో పడి స్వామిని మరిస్తే 'నీకు దగ్గరే ఉన్నాను, వచ్చిపోరాదా!' అని పిలిచినట్లు అనిపిస్తుంది. దగ్గరికి వెళ్తే 'వచ్చావు కదా, నీ కష్టాలు తీరుతాయిలే...' అని చెప్పి దూరమైనట్లవుతుంది. అయినా... అది చెబితే అర్థమయ్యేది కాదు. అనుభూతి చెందాల్సిందే. అందుకే ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి భక్తులు స్వామి దర్శనానికి పరుగులు తీస్తారు'' అని వివరించాడు.

భక్తిభావంతో ఆ విదేశీయుడి కళ్ళు తడి అయ్యాయి. గట్టిగా గోవిందనామ స్మరణలు చేస్తూ బృందాలతో కలిసి అలిపిరి చేరి మెట్ల మార్గంలో తిరుమలకు చేరాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా



● నంద్ గోపాల్ గుప్తా, అభిషేక్ అగర్వాల్, స్నేహలత, వంశీ, రవితేజ, అను కృతి, గాయత్రీ భరద్వాజ్, నూపుర్ సనన్

ఈ దసరా మీదే – రచయిత-దర్శకుడు కె. విజయేంద్ర ప్రసాద్



''మణిరత్నంగారి 'నాయగన్' తరహా సినిమాలు తెలుగులో ఎప్పుడు వస్తాయా? అనుకునేవాడిని. 'పుష్ప'తో నెరవేరింది. 'టైగర్ నాగేశ్వర రావు' కూడా అలా అనిపించింది'' అన్నారు రచయిత-దర్శకుడు విజయేంద్ర ప్రసాద్. రవితేజ టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కె. విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ – ''రవితేజగారు చేసిన 'విక్రమార్కుడు' చిత్రాన్ని తమిళ, కన్నడ, హిందీలో రీమేక్ చేశారు. అయితే ఎవరూ ఆయన్ను మ్యాచ్ చేయలేకపోయారు. రవితేజగారు తెలుగు సినిమాలకే పరిమితమై పోకుండా ఇతర భాషల చిత్రాలు చేయాలని రిక్వెస్ట్ చేస్తున్నాను. 'టైగర్ నాగేశ్వర రావు' ట్రైలర్ చూడగానే ప్రతి ఫ్రేమ్‌ను దర్శకుడు వంశీ అద్భుతంగా తీశారనిపించింది. అభిషేక్ అగర్వాల్‌గారికి మంచి టైమ్ నడుస్తోంది. దసరా పండగ వచ్చింది. దుర్గమ్మ వారికి ఎవడూ ఎదురు నిలబడలేడు. ఆ దుర్గమ్మ తల్లి వాహనం టైగర్ ముందు కూడా ఎవడూ నిలబడలేడు. దసరా మీదే (టైగర్ నాగేశ్వరరావు టీమ్‌ను ఉద్దేశించి)'' అన్నారు. మరో ముఖ్య అతిథి ఉత్తరప్రదేశ్ మంత్రి నంద్ గోపాల్ గుప్తా మాట్లాడుతూ– ''రవితేజగారికి ఉత్తరప్రదేశ్‌లోనూ పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు. సినీ ఇండస్ట్రీ గర్వపడేలా నా మిత్రుడు అభిషేక్ అగర్వాల్ మరిన్ని సినిమాలు తీయాలి. ఈ సినిమా కొత్త రికార్డులను సృష్టించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. రవితేజ మాట్లాడుతూ– ''టైగర్ నాగేశ్వర రావు' సినిమా కథ విని, ఎగ్జయిట్ అయ్యాను. ఎమోషన్, థ్రిల్.. ఇలా అన్ని రకాల భావోద్వేగాలున్నాయి. సినిమాలో ఉన్నవన్నీ ఒరిజినల్ పాత్రలే. రాజీ పడకుండా ఈ సినిమాను నిర్మించిన అభిషేక్‌గారు 'టైగర్'తో హ్యాట్రిక్ హిట్ సాధించాలి'' అన్నారు. ''తెలుగు సినిమా చరిత్రలో ఇది ఒక బెస్ట్ ఫిలిమ్‌గా ఉంటుంది'' అన్నారు దర్శకుడు వంశీ. ''నాలుగేళ్ల 'టైగర్ నాగేశ్వరరావు' ప్రయాణాన్ని జీవితంలో మర్చిపోలేను'' అన్నారు అభిషేక్ అగర్వాల్. ఈ వేడుకలో చిత్ర సహ-నిర్మాత మయాంక్, దర్శకులు గోపీచంద్ మలినేని, హరీష్ శంకర్, నిర్మాతలు నవీన్ ఎర్నేని, టీజీ విశ్వప్రసాద్, సూర్యదేవర నాగ వంశీ, మిర్యాల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



● మహేశ్‌బాబు

పండక్కి పాట?

'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తాజాగా 'గుంటూరు కారం' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీ లీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. మహేశ్‌బాబు, ఇతర ప్రధాన తారాగణంపై ఓ ఇంటి సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని తెలిసింది. కాగా ఈ దసరా పండగ సందర్భంగా 'గుంటూరు కారం' నుంచి ఓ పాటను విడుదల చేయాలనుకుంటున్నారని సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

అన్నయ్య కోసం తమ్ముడు మార్చుకున్నాడు! – హీరో నాని



● విజయేందర్ రెడ్డి, శౌర్యువ్, నాని, కియారా, హేషమ్, మోహన్ చెరుకూరి

''ఎలాంటి లెక్కలు వేసుకోకుండా నాకు నచ్చిన సినిమాలు చేస్తున్నాను. నా ప్రతి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తూ, నాకు నచ్చింది వారికీ నచ్చుతుందనే భరోసా కల్పించారు. 'హాయ్ నాన్న' చిత్రంతో మరోసారి అది నిరూపితమవుతుందని నమ్ముతున్నాను'' అని హీరో నాని అన్నారు. నాని, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా, శ్రుతీహాసన్, బాల నటి కియారా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో డిసెంబరు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ– ''తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో 'హాయ్ నాన్న' ఉంటుంది. అన్ని ఏజ్ గ్రూప్‌లకు నచ్చే సినిమాను కమర్షియల్ మూవీ అనుకుంటే..'హాయ్ నాన్న' మోస్ట్ కమర్షియల్ మూవీ. మా సినిమాను ముందు డిసెంబరు 21న రిలీజ్ చేయాలనుకున్నాం. అయితే ఓ ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు ఉన్నప్పుడు, తమ్ముడు అనుకున్న తేదీకే అన్నయ్య వేడుక (ప్రభాస్ 'సలార్' సినిమా విడుదలను పరోక్షంగా ఉద్దేశించి..) కూడా ఖరారైతే.. తమ్ముడు తేదీ మార్చుకుంటాడు'' అన్నారు. ''ఒక మంచి కథతో 'హాయ్ నాన్న' తీశాం. నా దర్శకత్వంలోని తొలి సినిమాయే పాన్ ఇండియా స్థాయిలో రూపొందడం హ్యాపీ'' అన్నారు శౌర్యువ్. ''ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవుతుంది'' అన్నారు మోహన్, విజయేందర్ రెడ్డి. ''కథకు తగ్గట్లే మ్యూజిక్ ఇచ్చాను'' అన్నారు హేషమ్ అబ్దుల్ వహాబ్.



● 'గాంజా శంకర్'లో సాయిధరమ్ తేజ్

ఊర మాస్ శంకర్

'సూపర్ మ్యాన్ ఏం చేశాడంటే'... 'అబ్బా ఈ స్పైడర్ మ్యాన్‌లు.. సూపర్ మ్యాన్‌లు కాదు నాన్నా.. మన లోకల్ మ్యాన్ కథ ఏదైనా ఉంటే చెప్పు నాన్నా..' అని చిన్నారి కూతురు అడుగుతుంది... అప్పుడు మొదలవుతుంది లోకల్ మ్యాన్ గురించి... ఆడు చిన్నప్పుడే చదువు మానేశాడనీ, అమ్మా నాన్న మాట వినలేదనీ, అన్ని చెడు అలవాట్లు ఉన్నాయనీ, పది రూపాయలుంటే పార్కులో, పది వేలుంటే పార్క్ హయత్‌లో ఉంటాడని చెప్పడంతో ఆ లోకల్ మ్యాన్ ఊర మాస్‌గా పెరిగినవాడని అర్థం అవుతుంది. అతని పేరు 'గాంజా శంకర్'. సాయి ధరమ్ తేజ్ టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'గాంజా శంకర్'. సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. ఆదివారం సాయిధరమ్ పుట్టిన రోజు సందర్భంగా గాంజా శంకర్ పాత్రను పరిచయం చేస్తూ, విడుదల చేసిన టీజర్‌లో పైన పేర్కొన్న డైలాగ్స్ ఉన్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: రిషీ పంజాబి, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.

శక్తీ శెట్టి.. లేడీ సింగమ్



● దీపికా పదుకోన్

లేడీ సింగమ్ శక్తీ శెట్టిగా మారారు దీపికా పదుకోన్. 'సింగమ్', 'సింగమ్ రిటర్న్స్' చిత్రాల తర్వాత బాలీవుడ్ 'సింగమ్' ఫ్రాంచైజీలో రోహిత్ శెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'. అజయ్ దేవగన్ మెయిన్ లీడ్ హీరోగా, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్, కరీనా కపూర్ ముఖ్య పాత్రలు చేస్తున్నారు. ఈ సినిమా నుంచి దీపికా పదుకోన్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. 'సింగమ్ ఎగైన్' చిత్రంలో లేడీ సింగమ్ పోలీసాఫీసర్ శక్తీ శెట్టి పాత్రలో దీపికా నటిస్తున్నారని, కథ రీత్యా క్రూరమైన, హింసాత్మక ధోరణిలో శక్తీ శెట్టి పాత్ర ఉంటుందని రోహిత్ శెట్టి పేర్కొన్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఆగస్టులో విడుదల కానుంది.


రాజకీయ నాయకురాలు మణి మేకల



● మాళవికా నాయర్

మణి మేకల పవర్‌ఫుల్ రాజకీయ నాయకురాలు. ఆమె ప్రసంగాలు ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తాయి. మరి.. ఆ రాజకీయ నాయకురాలికి, బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌కి ఉన్న లింక్ ఏంటి? అనేది 'డెవిల్' చిత్రంలో చూడాల్సిందే. బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తున్నారు. పొలిటీషియన్ మణి మేకల పాత్రను మాళవికా నాయర్ పోషిస్తున్నారు. ఆదివారం మాళవిక లుక్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంలో కథానాయికగా సంయుక్తా మీనన్ నటిస్తున్నారు. నవంబర్ 24న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'డెవిల్' రిలీజ్ కానుంది. దేవాన్ష్ నామా సమర్పణలో స్వీయ దర్శకత్వంలో అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: సౌందర్ రాజన్.

ముగ్గురి స్నేహితుల అదృష్టం



● విశ్వదేవ్, భాను ప్రసాద్, శ్రీనాథ్ బాదినేని, అభినవ్ గోమఠం, నరేశ్ అగస్త్య

నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వదేవ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'కిస్మత్'. అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రంలో రియా సుమన్ హీరోయిన్. శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో రాజు నిర్మించిన ఈ చిత్రం నవంబరులో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను హీరో శ్రీ విష్ణు విడుదల చేశారు. ముగ్గురు స్నేహితులు తమ జీవితంలో ఏదైనా అద్భుతం జరగాలని ఆశిస్తుంటారు. విశ్వదేవ్ నమ్మకం కోల్పోయి ఉంటాడు. అభినవ్ గోమఠంకి సినీ రచయిత అవ్వాలన్నది కల. రియా సుమన్‌తో నరేశ్ అగస్త్య ప్రేమలో ఉంటాడు. ఓ సంఘటనతో ఈ ముగ్గురి కిస్మత్ (అదృష్టం) ఎలా మారిపోయింది అనేది ఈ చిత్రకథ అని యూనిట్ పేర్కొంది. ఇక టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ– ''కిస్మత్' లాంటి చిత్రాలు మౌత్ టాక్ వల్లే హిట్టవుతాయి. ప్రేక్షకులు మమ్మల్ని సపోర్ట్ చేయాలి'' అన్నారు. ''మంచి క్రైమ్ కామెడీ ఫిల్మ్ ఇది'' అన్నారు అభినవ్ గోమఠం. ''చక్కని ఫన్ ఫిల్మ్ ఇది'' అన్నారు విశ్వదేవ్. ''రాజు రెండేళ్ల పాటు ఈ సినిమా స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. నరేశ్, అభినవ్, విశ్వలతో పాటు అందరూ అద్భుతంగా నటించారు'' అన్నారు శ్రీనాథ్. ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె. రాబిన్, కెమెరా: వేదరామన్ శంకర్, సహనిర్మాత: భాను ప్రసాద్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: భరత్ రెడ్డి.



జ్యోతిక శ్రీకి స్వర్ణ పతకం

జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతిక శ్రీ స్వర్ణ పతకం సాధించింది. బెంగళూరులో ఆదివారం ముగిసిన ఈ మీట్‌లో జ్యోతిక శ్రీ మహిళల 400 మీటర్ల విభాగంలో చాంపియన్‌గా నిలిచింది. జ్యోతిక శ్రీ అందరికంటే వేగంగా 53.26 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. సిమర్జీత్ కౌర్ (పంజాబ్ ; 53.77 సెకన్లు) రజతం, కవిత (పీఎస్‌పీబీ ; 54.15 సెకన్లు) కాంస్యం సాధించారు. 220 పాయింట్లతో రైల్వేస్ జట్టు ఓవరాల్ టీమ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.

షాంఘై మాస్టర్స్ టోర్నీ విజేత హుర్కాజ్



పోలాండ్ టెన్నిస్ స్టార్ హుబెర్ట్ హుర్కాజ్ తన కెరీర్‌లో రెండో మాస్టర్స్ సిరీస్ సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో హుర్కాజ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో 17వ ర్యాంకర్ హుర్కాజ్ 6–3, 3–6, 7–6 (10/8)తో ఏడో ర్యాంకర్ ఆండ్రీ రుబ్లెవ్ (రష్యా)పై గెలిచాడు. విజేత హుర్కాజ్‌కు 12,62,220 డాలర్ల (రూ. 10 కోట్ల 52 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.



ఎబ్డెన్ బోపన్న

రన్నరప్‌గా బోపన్న జోడీ

షాంఘై: ఈ ఏడాది మూడో డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నిరాశ ఎదురైంది. ఆదివారం జరిగిన షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీలో బోపన్న–ఎబ్డెన్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ జంట 7–5, 2–6, 7–10తో గ్రానోలెర్స్ (స్పెయిన్)–జెబలాస్ (అర్జెంటీనా) ద్వయం చేతిలో ఓడిపోయింది. రన్నరప్‌గా నిలిచిన బోపన్న–ఎబ్డెన్‌లకు 2,31,660 డాలర్ల (రూ. కోటీ 93 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 600 ర్యాంకింగ్ పాయింట్లు... టైటిల్ నెగ్గిన గ్రానోలెర్స్–జెబలాస్‌లకు 4,36,730 డాలర్ల (రూ. 3 కోట్ల 64 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. తాజా ఫలితంతో బోపన్న–ఎబ్డెన్ జోడీ టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

నేటి నుంచి ముస్తాక్ అలీ టోర్నీ

జైపూర్: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నేడు మొదలవుతుంది. 22 రోజులపాటు జరిగే ఈ టోర్నీలో మొత్తం 38 జట్ల మధ్య 135 మ్యాచ్‌లు జరుగుతాయి. 38 జట్లను ఐదు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో హైదరాబాద్, డిఫెండింగ్ చాంపియన్ ముంబై, బరోడా, హరియాణా, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీర్, మిజోరం, మేఘాలయ ఉన్నాయి. గ్రూప్ 'సి'లో ఆంధ్ర, రైల్వేస్, సౌరాష్ట్ర, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, గుజరాత్, మణిపూర్, పంజాబ్ జట్లకు చోటు కల్పించారు. అక్టోబర్ 27 వరకు గ్రూప్ లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాక ఐదు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన 10 జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. నేడు జరిగే తొలి లీగ్ మ్యాచ్‌ల్లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు మేఘాలయతో... కోన శ్రీకర్ భరత్ నాయకత్వంలోని ఆంధ్ర జట్టు గోవాతో తలపడతాయి. ఈ టోర్నీ మ్యాచ్‌లను జియో సినిమా యాప్, స్పోర్ట్స్ 18 ఛానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

అఫ్గాన్ అద్భుతం...



వోక్స్‌ను బౌల్డ్ చేశాక ముజీబ్ సంబరం

బట్లర్ బౌల్డ్

అడపాదడపా మెరిపించడమే కాదు తమదైన రోజున చిరస్మరణీయ ప్రదర్శనతో పెద్ద జట్లను బోల్తా కొట్టించే ప్రావీణ్యం తమలో ఉందని అఫ్గానిస్తాన్ క్రికెట్ ప్రపంచానికి చాటి చెప్పింది. వరుసగా మూడో వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఎట్టకేలకు ఈ మెగా ఈవెంట్‌లో 14 వరుస పరాజయాలకు తెరదించింది. సంచలన ఆటతీరుతో ఏకంగా డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జట్టునే మట్టికరిపించింది. ఇక నుంచి తమను కూన జట్టుగా పరిగణించకూడదని మిగతా జట్లకు హెచ్చరికలు పంపించింది. 2015 ప్రపంచకప్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడి కేవలం స్కాట్లాండ్‌పై గెలిచిన అఫ్గానిస్తాన్... ఆ తర్వాత 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. తాజా ప్రపంచకప్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్, భారత్ చేతిలో ఓడిన అఫ్గానిస్తాన్ మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై గెలుపొంది పరాజయాల పరంపరకు ముగింపు పలికింది.

డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై సంచలన విజయం

- మెరిసిన గుర్బాజ్, ఇక్రమ్
- ముజీబ్, రషీద్, నబీ మాయాజాలం

న్యూఢిల్లీ: వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు ఊహించని షాక్! అఫ్గానిస్తాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను కంగుతినిపించింది. ఆదివారం జరిగిన పోరులో హష్మతుల్లా కెప్టెన్సీలోని అఫ్గానిస్తాన్ 69 పరుగుల తేడాతో బట్లర్ నాయకత్వంలోని ఇంగ్లండ్ జట్టుపై జయభేరి మోగించింది. ముందుగా అఫ్గానిస్తాన్ 49.5 ఓవర్లలో 284 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ (57 బంతుల్లో 80; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) చెలరేగాడు. ఇక్రమ్ అలీఖిల్ (66 బంతుల్లో 58; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఆదిల్ రషీద్ 3, మార్క్‌వుడ్ 2 వికెట్లు తీశారు. అనంతరం ఇంగ్లండ్ 40.3 ఓవర్లలో 215 పరుగులకే కుప్పకూలింది. హ్యారీ బ్రూక్ (61 బంతుల్లో 66; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. రషీద్ ఖాన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముజీబ్ చెరో 3 వికెట్లు తీయగా, నబీకి 2 వికెట్లు దక్కాయి.

నడిపించిన గుర్బాజ్

జద్రాన్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన రహ్మనుల్లా గుర్బాజ్ చెలరేగాడు. మూడో ఓవర్ నుంచి భారీ సిక్సర్‌తో ఇంగ్లండ్ బౌలింగ్‌పై ఎదురుదాడికి దిగాడు. వోక్స్, టోప్లీ, స్యామ్ కరన్‌ల పేస్... గుర్బాజ్ బౌండరీలు, సిక్సర్లతో విలవిలాడింది. 11వ ఓవర్లో ఆదిల్ రషీద్‌ను దించితే బౌండరీ బాది



గుర్బాజ్

33 బంతుల్లో గుర్బాజ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. 12.4వ ఓవర్లోనే అఫ్గాన్ స్కోరు వందకు చేరింది. 114 స్కోరువద్ద జద్రాన్ (48 బంతుల్లో 28; 3 ఫోర్లు)ను అవుట్ చేసిన రషీద్ ఇంగ్లండ్ శిబిరాన్ని కాస్త ఊపిరి తీసుకోనిచ్చాడు. స్వల్ప వ్యవధిలో రహ్మత్ షా (3), గుర్బాజ్ అవుటైనప్పటికీ ఇక్రమ్ అలీఖిల్ అర్ధసెంచరీ, లోయర్ ఆర్డర్‌లో రషీద్ ఖాన్ (22 బంతుల్లో 23; 3 ఫోర్లు), ముజీబ్ ఉర్ రెహ్మాన్ (16 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) చేసిన విలువైన పరుగులు అఫ్గాన్ పటిష్టమైన స్కోరుకు బాట వేసింది.

బాధ్యతలేని బ్యాటింగ్‌తో...

స్కోరు పెద్దదే. కానీ అఫ్గాన్ బౌలింగ్‌పై ఈ లక్ష్యం ఇంగ్లండ్‌కు అసాధ్యమైందేమీ కాదు. బ్యాటర్లకు కష్టమైందీ కాదు. కానీ బాధ్యత లేని బ్యాటింగ్, చెత్త షాట్లతో జట్టు ఓటమినే మూల్యంగా చెల్లించుకోవాల్సి వచ్చింది. రెండో ఓవర్లోనే బెయిర్‌స్టో (2) లాంటి ఓపెనర్ అవుటైతే... రూట్ (11), కెప్టెన్ బట్లర్ (9)లాంటి అనుభవజ్ఞులు క్రీజును అంటిపెట్టుకోవాల్సింది పోయి... సులువుగా క్లీన్‌బౌల్డయ్యారు. దీంతో మ్యాచ్‌పై పట్టుబిగించే అవకాశాల్ని అఫ్గాన్ అన్ని వైపులా ముమ్మరం చేసింది. మలాన్ (39 బంతుల్లో 32; 4 ఫోర్లు) చేసిన మోస్తరు పరుగులు, హ్యారీ బ్రూక్ అర్ధసెంచరీ ఇంగ్లండ్‌ను కాపాడలేకపోయాయి.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (రనౌట్) 80; ఇబ్రహీమ్ (సి) రూట్ (బి) రషీద్ 28; రహ్మత్ షా (స్టంప్డ్) బట్లర్ (బి) ఆదిల్ రషీద్ 3; హష్మతుల్లా (బి) రూట్ 14; అజ్మతుల్లా (సి) వోక్స్ (బి) లివింగ్‌స్టోన్ 19; ఇక్రమ్ (సి) స్యామ్ కరన్ (బి) టోప్లీ 58; నబీ (సి) రూట్ (బి) వుడ్ 9; రషీద్ (సి) రూట్ (బి) రషీద్ 23; ముజీబ్ (సి) రూట్ (బి) వుడ్ 28; నవీనుల్ హక్ (రనౌట్) 5; ఫరూఖీ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్) 284. వికెట్ల పతనం:** 1–114, 2–122, 3–122, 4–152, 5–174, 6–190, 7–233, 8–277, 9–277, 10–284. **బౌలింగ్:** వోక్స్ 4–0–41–0, టోప్లీ 8.5–1–52–1, కరన్ 4–0–46–0, ఆదిల్ రషీద్ 10–1–42–3, వుడ్ 9–0–50–2, లివింగ్‌స్టోన్ 10– 0–33–1, రూట్ 4–0–19–1.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫరూఖీ 2; మలాన్ (సి) ఇబ్రహీమ్ (బి) నబీ 32, రూట్ (బి) ముజీబ్ 11; బ్రూక్ (సి) ఇక్రమ్ (బి) ముజీబ్ 66; బట్లర్ (బి) నవీనుల్ 9; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్ 10; స్యామ్ కరన్ (సి) రహ్మత్ (బి) నబీ 10; వోక్స్ (బి) ముజీబ్ 9; ఆదిల్ రషీద్ (సి) నబీ (బి) రషీద్ 20; వుడ్ (బి) రషీద్ 18; టోప్లీ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (40.3 ఓవర్లలో ఆలౌట్) 215. వికెట్ల పతనం:** 1–3, 2–33, 3–68, 4–91, 5–117, 6– 138, 7–160, 8–169, 9–198, 10–215. **బౌలింగ్:** ముజీబ్ 10–1–51–3, ఫరూఖీ 7–0–50–1, నవీనుల్ హక్ 6–1–44–1, నబీ 6–0–16–2, రషీద్ ఖాన్ 9.3–1–37–3, అజ్మతుల్లా 2–0–13–0.

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X శ్రీలంక
వేదిక: లక్నో

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	3	3	0	6	1.821
న్యూజిలాండ్	3	3	0	6	1.604
దక్షిణాఫ్రికా	2	2	0	4	2.360
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
అఫ్గానిస్తాన్	3	1	2	2	-0.652
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
శ్రీలంక	2	0	2	0	-1.161
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800
ఆస్ట్రేలియా	2	0	2	0	-1.846

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ రాజ్‌కోట్‌లో 131 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

రాజ్‌కోట్(గుజరాత్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 131
» పోస్టులు: అసిస్టెంట్ లాండ్రీ సూపర్‌వైజర్, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ స్టోర్స్ ఆఫీసర్, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్, క్లినికల్ సైకాలజిస్ట్, డైటీషియన్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ వార్డెన్, లైబ్రేరియన్, లోయర్ డివిజన్ క్లర్క్, మెడికల్ ఆఫీసర్ ఆయుష్, మెడికల్ ఫిజిసిస్ట్, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్, ఆఫీస్ అసిస్టెంట్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: పోస్టును అనుసరించి రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.11.2023.
» వెబ్‌సైట్: www.aiimsrajkot.edu.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 95 పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన సేఫ్టీ అసిస్టెంట్, సెమీ స్కిల్డ్ రిగ్గర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 95
» పోస్టుల వివరాలు: సెమీ స్కిల్డ్ రిగ్గర్–56, సేఫ్టీ అసిస్టెంట్–39. » అర్హత: నాలుగో తరగతి, పదో తరగతి, డిప్లొమా(సేఫ్టీ/ఫైర్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 21.10.2023 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ప్రాక్టికల్ పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ పరీక్ష ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.10.2023.
» వెబ్‌సైట్: https://cochinshipyard.in

ఐఐటీ హైదరాబాద్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్(ఐఐటీ).. తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 01
» అర్హత: ఎంటెక్(మెకానికల్/ఏరోస్పేస్/సివిల్) ఉత్తీర్ణులవ్వాలి.
» వేతనం: నెలకు రూ.31,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 23.10.2023.
» ఈమెయిల్: sidhardh@mae.iith.ac.in
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.iith.ac.in

వైఎస్సార్ జిల్లా, కడప మహిళా–శిశు సంక్షేమ శాఖలో వివిధ ఖాళీలు

వైఎస్సార్ జిల్లా, కడప మహిళా–శిశు సంక్షేమ శాఖ కార్యాలయం.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన జిల్లా కోఆర్డినేటర్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.»మొత్తం పోస్టుల సంఖ్య: 02
» పోస్టుల వివరాలు: జిల్లా కోఆర్డినేటర్–01, ప్రాజెక్ట్ అసిస్టెంట్–01.

అర్హత

» జిల్లా కోఆర్డినేటర్: డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఐటీ లేదా కంప్యూటర్ సైన్స్‌లో సర్టిఫికేట్ లేదా డిప్లొమా ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. రెండేళ్ల పని అనుభవం ఉండాలి. స్థానిక అభ్యర్థులు మాత్రమే అర్హులు.
» ప్రాజెక్ట్ అసిస్టెంట్: డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. మేనేజ్‌మెంట్/సోషల్ సైన్సెస్/న్యూట్రిషన్‌లో పీజీ డిప్లొమా ఉండాలి. రెండేళ్ల పని అనుభవం ఉండాలి. స్థానిక అభ్యర్థులు మాత్రమే అర్హులు.
» వయసు: 25 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫారంతో పాటు అర్హతలకు సంబంధించి అన్ని సర్టిఫికేట్ల జిరాక్స్‌కాపీలను జతచేసి జిల్లా కలెక్టర్/జిల్లా మహిళా–శిశు సంక్షేమ శాఖ కార్యాలయం, కలెక్టరేట్, డి.బ్లాక్, కడప,వైఎస్సార్ జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 18.10.2023.
» వెబ్‌సైట్: https://kadapa.ap.gov.in

మహాత్మా గాంధీ యూనివర్శిటీ,కొట్టాయంలో అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు

కొట్టాయం(కేరళ)లో మహాత్మాగాంధీ యూనివర్శిటీ.. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.»మొత్తం పోస్టుల సంఖ్య: 06
» విభాగాలు: స్కూల్ ఆఫ్ పెడగాజికల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ ఫిజిక్స్, స్కూల్ ఆఫ్ టూరిజం స్టడీస్, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, స్కూల్ ఆఫ్ ఇన్విరాన్‌మెంటల్ సైన్సెస్.
» అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ, ఉత్తీర్ణతతో పాటు పరిశోధన/బోధన అనుభవం ఉండాలి. వయసు: వయోపరిమితి లేదు.
» వేతనం: నెలకు రూ.1,31,400 చెల్లిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.10.2023.
» దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరి తేది: 05.11.2023.
» వెబ్‌సైట్: www.facultyrecruitment.mgu.ac.in

క్యాంపస్ డ్రైవ్స్.. ఆఫర్ దక్కేలా!

క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ కోసం ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులు వేయి కళ్లతో ఎదురు చూస్తుంటారు! ఎందుకంటే.. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అత్యంత కీలకం!! ఏటా కార్పొరేట్ కంపెనీలు కాలేజీల్లో ప్రత్యేకంగా నిర్వహించే ఈ నియామక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఉజ్వల కెరీర్‌కు మార్గం సుగమం అవుతుంది. వచ్చే నెల నుంచి ఇంజనీరింగ్, ఎంబీఏ కళాశాలల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. క్యాంపస్ డ్రైవ్స్ ప్రక్రియ ఎలా ఉంటుంది.. ఇందులో విజయం సాధించడమెలాగో తెలుసుకుందాం..



జాబ్ స్కిల్స్

» వచ్చే నెల నుంచే క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్
» పలు రౌండ్లలో విద్యార్థుల నైపుణ్యాల పరిశీలన
» ముందస్తు సంసిద్ధతతో కొలువు ఖాయం
» విజయంలో కీలకం కోర్ స్కిల్స్,సాఫ్ట్ స్కిల్స్
» టెక్నికల్, పర్సనల్, హెచ్‌ఆర్ రౌండ్ల ద్వారా ఎంపిక

ప్రతి ఏటా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌ను సంస్థలు నవంబర్‌లో ప్రారంభించి.. దాదాపు నాలుగు నెలల పాటు కొనసాగిస్తాయి. ముందుగా కంపెనీలు టైర్–1 ఇన్‌స్టిట్యూట్స్‌గా పేరొందిన ఐఐఎంలు, ఐఐటీలకు వెళుతున్నాయి. ఆ తర్వాత దశలో ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నాయి. ఐఐఎంలు, ఐఐటీల్లో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు దశల వారీగా క్యాంపస్ నియామకాలు జరుగుతున్నాయి. తొలి దశలో టాప్ కార్పొరేట్ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఆ తర్వాత దశల్లో ఇతర సంస్థలు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నాయి.

మూడు రౌండ్లలో

సంస్థలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను మూడు రౌండ్లలో నిర్వహిస్తుంటాయి. అవి..టెక్నికల్ రౌండ్, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ.

టెక్నికల్ రౌండ్

మొదటి దశలో నిర్వహించే టెక్నికల్ రౌండ్‌లో అభ్యర్థుల డొమైన్ నైపుణ్యాలను పరీక్షిస్తారు. డొమైన్ నైపుణ్యాల నుంచి సదరు రంగానికి సంబంధించి తాజా నైపుణ్యాల వరకూ.. అన్నింటిపైనా ప్రశ్నలు సంధించే అవకాశముంది. కాబట్టి అభ్యర్థులు ఇటీవల కాలంలో చర్చనీయాంశంగా మారిన ఏఐ, ఆటోమేషన్, రోబోటిక్స్, ఐఓటీ వంటి వాటిపై అవగాహన పెంచుకొని టెక్నికల్ రౌండ్‌కు హాజరవడం మేలు చేస్తుంది.

సెకండ్ రౌండ్

పలు కంపెనీలు రెండో రౌండ్ ఇంటర్వ్యూను సైతం టెక్నికల్ రౌండ్‌గా పేర్కొంటున్నాయి. ఈ దశలో ప్రధానంగా అభ్యర్థుల ప్రాక్టికల్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. అందుకోసం ఏదైనా ఒక రియల్ టైం టాస్క్‌ను ఇచ్చి.. దాన్ని పరిష్కరించమని అడుగుతున్నారు. ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల విషయంలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. రెండో రౌండ్‌లో విజయం కోసం విద్యార్థులు బేసిక్ స్కిల్స్ అయిన కోడింగ్, ప్రోగ్రామింగ్‌లపై పట్టు సాధించాలి.

హెచ్‌ఆర్ రౌండ్

క్యాంపస్ డ్రైవ్స్‌లో చివర దశ.. హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ. టెక్నికల్, సబ్జెక్ట్ నైపుణ్యాల ఆధారంగా తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ఈ రౌండ్ ఉంటుంది. ఇందులో వ్యక్తిగత లక్షణాలు, అప్టిట్యూడ్, అటిట్యూడ్‌లను పరిశీలిస్తారు. కాబట్టి అభ్యర్థులు తమ బాడీ లాంగ్వేజ్, వస్త్రధారణ, కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు హావభావాల వ్యక్తీకరణ హుందాగా ఉండేలా చూసుకోవాలి.

లక్ష్యంపై స్పష్టత

హెచ్‌ఆర్ రౌండ్‌లో విజయ సాధించాలంటే.. అభ్యర్థులకు తమ లక్ష్యంపై స్పష్టత అవసరం. 'మీ భవిష్యత్ లక్ష్యాలు చెప్పండి?'.. హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలో సంస్థ ప్రతినిధులు అడిగే ప్రశ్న ఇది. ఆ లక్ష్యాల సాధనకు సంస్థలో పని చేయడం ఎలా ఉపయోగపడుతుంది? అనేది మరో ప్రశ్న. ఈ రెండు ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలతో సంసిద్ధులై ఉండాలి. భవిష్యత్తు లక్ష్యాల విషయంలో సందిగ్ధత కనబరిస్తే.. అవకాశం చేజారే ఆస్కారముంది.

ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్

ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ సైతం ప్లేస్‌మెంట్ ప్రక్రియలో కీలకంగా నిలుస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు ఇన్‌స్టిట్యూట్‌ల పరిధిలో నిర్వహించే అకడమిక్ సంబంధిత సెమినార్లు, లెక్చర్స్‌తోపాటు ఆటపాటల్లో చురుగ్గా ఉండాలి. వీలైతే వాటిని లీడ్ చేసే విధంగా వ్యవహరించాలి. కారణం.. ఇటీవల కాలంలో కంపెనీలు అభ్యర్థుల ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌ని కూడా బేరీజు వేస్తున్నాయి.దీనిద్వారా లీడర్‌షిప్ స్కిల్స్,సాఫ్ట్ స్కిల్స్, పీపుల్ స్కిల్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను అంచనా వేస్తున్నారు.

వ్యక్తిగత లక్షణాలు

అద్భుతమైన జీపీఏలు, ప్రాజెక్ట్ వర్క్ రిపోర్ట్స్ ఆధారంగా ఆఫర్లు ఖరారు చేసే కాలం మారింది. ప్రస్తుత పోటీ పరిస్థితుల్లో కంపెనీలు అభ్యర్థుల నుంచి మరెన్నో లక్షణాలు కోరుకుంటున్నాయి. సబ్జెక్ట్‌కు సంబంధించి కోర్ నైపుణ్యాలతోపాటు కాంటెంపరరీ స్కిల్స్ ఉండాలని భావిస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్స్‌లో విజయం దిశగా తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సిన ఆవశ్యకత నెలకొంది.

రెజ్యూమే.. స్కిల్స్ తెలిపేలా

క్యాంపస్ డ్రైవ్స్‌లో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసేందుకు కంపెనీలు ఉపయోగించే మొదటి సాధనం.. రెజ్యూమే. దీన్ని ఒకట్రెండు పేజీలకు పరిమితం చేయాలి. ముఖ్యంగా అకడమిక్ రికార్డ్, దానికి అనుబంధ నైపుణ్యాలకు సంబంధించి సమాచారం ఇచ్చేందుకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్‌డేటెడ్ స్కిల్స్‌తో తమ వ్యక్తిగత సోషల్ నెట్‌వర్క్ లింక్స్‌ను పొందుపరిస్తే.. రిక్రూటర్స్ వాటి ఆధారంగా అభ్యర్థి గురించి పూర్తి స్థాయిలో తెలుసుకునేందుకు వీలవుతుంది. ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, సోషల్ నెట్‌వర్క్ ఫాలోయర్స్ ఆధారంగా అభ్యర్థి నిజమైన ఆసక్తిని తెలుసుకునే వీలుంది.

ఆఫర్స్ ఖరారు

క్యాంపస్ ఆఫర్స్ ఖరారు చేయడంలో సంస్థలు కొన్నిసార్లు వినూత్న మార్గాలను అనుసరిస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ హ్యాకథాన్‌లు నిర్వహించడం, అభ్యర్థులను బృందాలుగా ఏర్పాటు చేసి.. టాస్క్‌ను ఇచ్చి నిర్దిష్ట సమయంలో పూర్తి చేయమని పేర్కొంటున్నాయి. దీనికి అనుగుణంగా బృందంలోని అభ్యర్థులందరూ ఆన్‌లైన్‌లో అనుసంధానం అవుతూ సదరు టాస్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ హ్యాకథాన్‌ల ద్వారా టీమ్ వర్క్ కల్చర్‌ను అంచనా వేయడంతోపాటు ప్రాబ్లమ్ సాల్వింగ్‌లో ఏ విధంగా వ్యవహరించారో తెలుసుకుంటారు.

కోరుకుంటున్న క్వాలిటీస్

క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కంపెనీలు ఎక్కువగా అనలిటికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, బృంద నైపుణ్యాలు, సమయ స్ఫూర్తి తదితర అంశాలకు పెద్దపీట వేస్తున్నాయి. వీటికి అనుగుణంగా ప్రాథమిక దశలో నిర్వహించే రిటెన్ టెస్ట్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ వంటి అంశాల నుంచే ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌లో పాల్గొనే విద్యార్థులు సంబంధిత పరిజ్ఞానం పెంచుకోవడం తోపాటు ఆయా సంస్థల గత ప్లేస్‌మెంట్ పేపర్స్‌ను పరిశీలించడం ఉపయుక్తంగా ఉంటుంది.

ఆఫర్ పొందిన వారికి శిక్షణ

ఇటీవల కాలంలో అభ్యర్థుల కోర్ బ్రాంచ్‌లతో సంబంధం లేకుండా సంస్థలు జాబ్ ప్రొఫైల్స్ ఆఫర్ చేస్తున్నాయి. ఈ ట్రెండ్ ఐటీ, ఐటీఈఎస్ సంస్థల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ఐటీ కంపెనీలు కంప్యూటర్ సైన్స్, ఐటీ బ్రాంచ్‌లతోపాటు మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ బ్రాంచ్‌ల విద్యార్థులను కూడా నియమించుకుంటున్నాయి. చివరి సెమిస్టర్‌లో ఆఫర్స్ ఖరారు చేసి.. కోర్సు పూర్తయ్యేలోపు తమ అవసరాలకు అనుగుణంగా శిక్షణనందిస్తున్నాయి. టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్ వంటి సంస్థలు ఆఫర్ లెటర్స్ పొందిన విద్యార్థులకు శిక్షణనందించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ వెబ్ పోర్టల్స్‌ను రూపొందించి అందుబాటులో ఉంచుతున్నాయి. ఫలితంగా ఆఫర్ లెటర్ పొందిన రోజు నుంచి అపాయింట్‌మెంట్ తేదీ నాటికి సంస్థ కార్యకలాపాలపై పూర్తి అవగాహన పొందడంతో పాటు, విధుల్లో చేరిన తొలి రోజు నుంచే చక్కటి పని తీరు ప్రదర్శించేందుకు మార్గం వేస్తున్నాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
126	43
66,283	19,751

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)


నాస్‌డాక్	13,407	▽	167
డోజోన్స్	33,670	△	39
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,600	▽	45
డాక్స్	15,187	▽	238
షాంఘై	3,088	▽	20
నికాయ్	32,290	▽	199

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటం	82.49	84.16
£	బ్రిటన్ పౌండ్	ఎకటం	100.01	103.37
€	యూరో	ఎకటం	86.36	89.40
¥	జపాన్ ఎన్ (100)	ఎకటం	54.79	56.50
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటం	51.63	53.92
S$	సింగపూర్ డాలర్	ఎకటం	59.92	61.85
SAR	సౌదీ రియాల్	ఖామిషన్	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	ఖామిషన్	21.77	23.57
¥	చైనా యువాన్	ఖామిషన్	10.27	12.36

మీ ఫండ్‌కు మీరే మేనేజర్..?



మెరుగైన రాబడుల కోసం ఈక్విటీల వైపు అడుగులు వేసే రిటైల్ ఇన్వెస్టర్లు పెరుగుతున్నారు. అన్ని సాధనాల్లోకెల్లా ఈక్విటీలు దీర్ఘకాలంలో స్థిరమైన, మెరుగైన రాబడులు ఇవ్వడమే ఈ ఆకర్షణకు కారణం. ఈక్విటీల్లో పెట్టుబడులు ఎంత సులభమో, ఆచరణలో అంత కష్టం. నిపుణులైన ఫండ్ మేనేజర్లను కాదని, నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపించే వారు, ప్రాథమిక విషయాల గురించి, రిస్క్ గురించి తప్పకుండా తెలుసుకుని తీరాలి. లేదంటే అసలు ఉద్దేశమే నెరవేరకుండా పోతుంది. తమ పెట్టుబడులకు తామే ఫండ్ మేనేజర్ పాత్ర పోషిస్తామనుకునే వారు, ఈక్విటీలో తలపండిన వారెన్ బఫెట్, ఫిలిప్ ఫిషర్, చార్లీ ముంగర్ చెప్పిన సూత్రాలు పాటించడం అనుసరణీయం. కంపెనీ గురించి, చేస్తున్న వ్యాపారం గురించి, పని చేస్తున్న రంగం, యాజమాన్య దక్షత, పోటీ సామర్థ్యాలు, నిధుల బలాలు ఇలా ఎన్నో అంశాలను చూసి వడపోయాలి. ఆపై మిగిలిన కంపెనీలకే పెట్టుబడులను పరిమితం చేసుకోవడం వల్ల రక్షణ ఎక్కువగా ఉంటుంది. నేరుగా పెట్టుబడులు పెట్టే ప్రతి ఇన్వెస్టర్ తెలుసుకోవాల్సిన అంశాల సమాహారమే ఈ కథనం...

- వ్యాపారం తెలియని కంపెనీలకు దూరం
- యాజమాన్య నైపుణ్యాలు బలంగా ఉండాలి
- పోటీ తత్వం, పరిశోధన ఆవిష్కరణ సామర్థ్యాలు
- బలమైన బ్యాలన్స్ షీట్ కీలకం
- కార్పొరేట్ గవర్నెన్స్ ముఖ్యం

స్కటిల్‌బట్ మెథడ్ ప్రకారం.. ఓ కంపెనీలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉంటే, ముందు ఆయా కంపెనీల ఉత్పత్తులు, సేవలను వినియోగించుకునే వారిని కలసి మాట్లాడాలి. అలాగే, ఆ కంపెనీ పోటీదారులు, ఉద్యోగులతో మాట్లాడిన తర్వాత ఓ నిర్ణయానికి రావాలి.
– ఫిలిప్ ఎ. ఫిషర్

వ్యాపార నమూనా అర్థమైందా?

ఒక కంపెనీ షేర్లు కొంటున్నామంటే.. సదరు వ్యాపారంలో పెట్టుబడి పెడుతున్నట్టు. ఒక షేరును రూ.20లో కొని, అది రూ.100కు చేరితే నాలుగింతలు లాభం వస్తుందన్న అవాస్తవ అంచనాలు వేసుకుని ఓ కంపెనీలో పెట్టుబడులు పెడుతున్నారంటే? అనుసరించే బాట సరిగ్గా లేదని తెలుసుకోవాలి. ఎంపిక చేసుకునే కంపెనీకి ఆదాయం ఎలా వస్తోంది? కంపెనీ సేవలు లేదా ఉత్పత్తులు ఏంటన్నవి అర్థం చేసుకున్నారా? ఈ ప్రశ్నలకు మీ వద్ద సమాధానం ఉండాల్సిందే. కంపెనీ ఉత్పత్తులు లేదా సేవల గురించి తెలియనప్పుడు, భవిష్యత్తులో ఆ కంపెనీ వ్యాపారం ఎలా సాగుతుందో ఎలా తెలుస్తుంది? అటువంటప్పుడు పెట్టే పెట్టుబడి ఎలా వృద్ధి చెందుతుంది? ఒక కంపెనీ గురించి అర్థం కాకకపోయినా లేదా ఉత్పత్తులు, సేవలు ఆకర్షణీయంగా అనిపించకపోయినా, ఆ కంపెనీకి దూరంగా ఉండడమే మంచిది. వ్యాపారం అర్థం చేసుకునేందుకు ఎంత సులభంగా ఉంటే, అంత ఆకర్షణీయమైనదిగా భావించొచ్చు.

కంపెనీ నిలబడుతుందా?



కంపెనీ రిస్క్‌లను కూడా చూడాలి. కంపెనీకి బలాలు ఉన్నాయని ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. అవి అలాగే కొనసాగుతున్నాయా? అని కనిపెట్టుకుని ఉండాలి. టెలికం రంగంలో ఏం జరిగిందో చూశారు కదా..? జియో రావడంతో ఎయిర్‌టెల్, వొడాఐడియా మినహా అన్నీ మూట సర్దేసుకోవాల్సి వచ్చింది. వొడాఐడియా కూడా ఆర్థిక సంక్షోభంతో కొనసాగుతోంది. ఇలాంటి విపత్తు ఏ రంగంలో అయినా ఉండొచ్చు. ఇన్వెస్ట్ చేసే ముందే కంపెనీకి వచ్చే రిస్క్‌ల గురించి కూడా అవగాహన ఉండాలి. ఎయిర్‌టెల్ కంపెనీకి నెట్‌వర్క్ విస్తరణ పరంగా కాస్త మెరుగైన సామర్థ్యాలు ఉన్నాయి. దీనికితోడు మారుతున్న మార్కెట్ పరిణామాలకు తగ్గట్టు ఎయిర్‌టెల్ ప్రణాళికలు రచించి, అమలు చేసుకుంటూ వెళ్లింది. అందుకే జియోకు గట్టి పోటీదారుగా నిలిచింది. ముఖ్యంగా కంపెనీకి దీర్ఘకాలిక విజన్ (భవిష్యత్ ప్రణాళిక) ఉండాలి. అలాంటి కంపెనీలు దీర్ఘకాలంలో సవాళ్లను దీటుగా ఎదుర్కొని, వాటాదారులకు విలువను సమకూర్చగలవు.

భవిష్యత్ నాయకత్వం?

ఒక గొప్ప ప్రమోటర్‌ను చూసి కళ్లు మూసుకుని ఆ కంపెనీలో ఇన్వెస్ట్ చేయొచ్చని అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లు చెబుతుంటారు. నిజమే అలా ఇన్వెస్ట్ చేసిన తర్వాత, ఆ గొప్ప ప్రమోటర్ ఏదో ఒకరోజు వయసు మళ్లో లేకుంటే ఆకస్మికంగా కాలం చేస్తే పరిస్థితి ఏమిటి? కంపెనీ సంక్షోభంలో పడిపోకుండా, ఆ తర్వాత నుంచి సమర్థవంతంగా నడిపించే నాయకుడు ఉన్నారో లేదో చూడాలి. ప్రమోటర్ కాకపోయినా కంపెనీలను గొప్ప స్థాయికి తీసుకెళ్లిన ఎల్అండ్‌టీ ఏఎం నాయక్ వంటి నిపుణులు ఎందరో ఉంటారు. అలాంటి నిపుణుల చేతికి నాయకత్వం వెళితే నిశ్చింతగా ఉండొచ్చు.

పనిచేస్తున్న రంగం

కంపెనీ ఏ రంగంలో పనిచేస్తుందన్నది మరో ముఖ్యమైన అంశం. ఉదాహరణకు మెటల్స్ తీసుకుంటే వాటి ధరలు అంతర్జాతీయంగా వివిధ దేశాల వినియోగం, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తీవ్ర హెచ్చుతగ్గులను చూస్తుంటాయి. స్థిరమైన రాబడి కోరుకునే వారు మెటల్స్‌కు దూరంగా ఉండాల్సిందే. అదే ఐటీ రంగం తీసుకుంటే అస్థిరతలు తక్కువ. ఎక్కువ కాలాల్లో స్థిరమైన వృద్ధిని ఏటా నమోదు చేస్తుంటాయి. అలాగే బాగా వృద్ధికి అవకాశం ఉన్న రంగాలను ఎంపిక చేసుకుంటే, ఎక్కువ కాంపౌండింగ్‌కు అవకాశం ఉంటుంది.

బలమైన బ్యాలన్స్ షీట్

ఎంపిక చేసుకునే కంపెనీకి ఆర్థిక బలాలు తప్పకుండా ఉండాలి. కంపెనీకి దాదాపు రుణ భారం లేకుండా ఉంటే మంచిది. ఒకవేళ రుణాలు ఉన్నా కానీ, ఆ మొత్తం ఈక్విటీతో పోలిస్తే నూరు శాతం మించకుండా చూసుకోవాలి. రుణభారం ఎక్కువైతే కంపెనీ సంపాదించినదంతా వడ్డీ చెల్లింపులకే సరిపోతుంది. అప్పుడు కంపెనీ వృద్ధి ప్రణాళికల కోసం అప్పు మీద అప్పు చేసుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. ఇలాంటి బ్యాలన్స్ షీటు కంపెనీలకు దూరంగా ఉండాలి. రుణరహిత కంపెనీలు, ఆదాయం ఏటా కనీసం 10–15 శాతం, నికర లాభం ఏటా 15–20 శాతం వృద్ధి చెందే కంపెనీల్లో పెట్టుబడికి రక్షణ, వృద్ధికి అవకాశం ఉంటుంది. ఓ కంపెనీ షేరు ధర దీర్ఘకాలంలో లాభాలనే అనుసరిస్తుంటుంది. డివిడెండ్ చెల్లించేవి అయితే అదనపు ప్లస్‌గా చూడొచ్చు.

పరిశోధన, ఆవిష్కరణల సామర్థ్యం

మారుతున్న కస్టమర్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు, సేవల్లోనూ నవ్యత అవసరం. అందుకే కంపెనీలు పరిశోధనపై పెద్ద మొత్తంలో వెచ్చిస్తుంటాయి. ఓ కంపెనీ పరిశోధన, ఆవిష్కరణల సామర్థ్యాలకు నిదర్శనం, ఆ కంపెనీ ఉత్పత్తులకు పేటెంట్ హక్కులు ఉండడం. ఎప్పటికప్పుడు కొత్త ఉత్పత్తులు, సేవలను మార్కెట్ చేస్తుండడం. ఇలాంటి బలాలు ఉంటే, దీర్ఘకాలంలో ఆ కంపెనీ ఎంత పోటీ ఉన్నా నిలదొక్కుకుని, రాణిస్తుంది. ఇందుకు ఒక నిదర్శనం గూగుల్, యాపిల్. ఇవి పరిశోధనపై పెద్ద ఎత్తున ఖర్చు చేస్తుంటాయి. ఉత్పత్తులు, సేవలపై పేటెంట్ ఉంటే, వ్యాపారంలో అధిక లాభాల మార్జిన్లకూ అవకాశం ఉంటుంది. ఒకవేళ అప్పటికే ఉన్న పేటెంట్ల గడువు ముగుస్తుంటే, అది లాభాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

యాజమాన్య దక్షత

గుడ్ బిజినెస్ ఇన్ రాంగ్ హ్యాండ్స్.. రాంగ్ బిజినెస్ ఇన్ గుడ్ హ్యాండ్స్.. ఈ రెండింటిలో రెండోదే ఉత్తమం. సమర్థత లేని వ్యక్తుల చేతుల్లో మంచి వ్యాపారం ఉన్నా దాన్ని గొప్ప స్థాయికి తీసుకెళ్లలేరు. అదే మంచి వ్యాపార దక్షత కలిగిన వ్యక్తులు యాజమాన్య స్థానంలో ఉంటే, చెత్త వ్యాపారాన్ని సైతం మంచిగా వృద్ధి చేయగలరు. పెట్టుబడులు పెట్టే కంపెనీకి సమర్థులైన, ప్రతిభావంతులైన, భవిష్యత్తు ప్రణాళికలు, పోటీతత్వంపై స్పష్టమైన అవగాహన, టెక్నాలజీ పట్ల ఆసక్తి కలిగిన ప్రమోటర్లు ఉండాలి. ఆ కంపెనీ యాజమాన్యం పనితీరు గురించి సాధ్యమైనంత లోతుగా తెలుసుకోవాలి. వ్యవస్థాపకుల ఆధ్వర్యంలో నడిచేవి, కుటుంబ కంపెనీలు సగటున ఏటా 3 శాతం అధిక పనితీరు చూపిస్తున్నట్టు పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అదే సమయంలో ప్రమోటర్లతో సంబంధం లేకుండా నిపుణుల ఆధ్వర్యంలో గొప్పగా పనిచేసే హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్, ఎల్అండ్‌టీ గ్రూప్, ఐటీసీ గ్రూప్ కూడా ఉన్నాయి.

మరొక ముఖ్యమైన అంశం.. ప్రతి కంపెనీ కూడా ఒక్కో రంగంలో విశేషమైన అనుభవం కలిగి ఉంటుంది. ఆయా రంగంలో వచ్చే మార్పులు, సవాళ్లకు అనుగుణంగా తన వ్యూహాలు మార్చుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అలా ఓ రంగానికే కట్టుబడి గొప్పగా రాణిస్తున్న కంపెనీలను పెట్టుబడులకు పరిశీలించొచ్చు. కంపెనీల మేనేజ్‌మెంట్ వ్యాపారంపైనే దృష్టి పెట్టాలి కానీ, వాటాదారుల విలువపై కాదు. కంపెనీ వ్యాపారంలో మెరుగ్గా రాణిస్తుంటే సహజంగానే వాటాల విలువ ఇతోధికం అవుతుంది. వ్యాపారం కాకుండా వాటాల విలువను పెంచడంపై దృష్టి సారించే యాజమాన్యాల వైఖరి, దీర్ఘకాలంలో వాటాదారులకు మేలు చేయకపోవచ్చు. కొన్ని కంపెనీలు చేస్తున్న వ్యాపారంపై దృష్టి తగ్గించి, మార్కెట్లో వచ్చే కొత్త వ్యాపార అవకాశాల్లోకి ప్రవేశిస్తుంటాయి. వాటాల విలువ పెరుగుతుందని అలా వ్యవహరిస్తుంటాయి. దీని వల్ల నిజానికి వ్యాపార విధానం గాడి తప్పుతుంది. కొత్త వ్యాపారాల కోసం పెద్ద ఎత్తున రుణాలు సమీకరిస్తుంటాయి. ఇది కూడా వాటాదారుల విలువకు ప్రతికూలం అవుతుంది.

పోటీతత్వం

ఎంపిక చేసుకునే కంపెనీకి గట్టి పోటీనిచ్చే సామర్థ్యాలున్నాయా? సదరు కంపెనీకి వ్యాపార పరంగా బలాలు ఉండే పెట్టుబడులకు రక్షణ ఉన్నట్టుగా భావించొచ్చు. దీన్నే మోట్ అని పిలుస్తారు. దీన్ని ఎలా తెలుసుకోవచ్చు? అంటే.. కంపెనీకి వ్యాపారంలో స్థూల మార్జిన్లు గరిష్ట స్థాయిలోనే దీర్ఘ కాలం పాటు కొనసాగుతుంటే, ఆ కంపెనీ ఉత్పత్తులు లేదా సేవలకు మంచి డిమాండ్ ఉన్నట్టుగా భావించొచ్చు. ఉదాహరణకు యాపిల్ స్థూల మార్జిన్లు 44 శాతానికి పైనే. ఆయా వ్యాపారంలో కొన్ని కంపెనీలే పనిచేస్తుండడం, కొత్త కంపెనీల ప్రవేశం అంత సులభం కాకపోవడం వంటివి అనుకూలతలు. దీనివల్ల ఉన్న కంపెనీలకు ప్రైసింగ్ పవర్ (ధరలను నిర్ణయించే శక్తి) ఉంటుంది. కనీసం లాభాల మార్జిన్ 10 శాతానికి పైన ఉండేలా చూసుకోవాలి. స్వల్ప మార్జిన్‌తో నడిచే కంపెనీలు ఎప్పుడైనా నష్టాల్లోకి జారిపోవచ్చు. పోటీ సంస్థల కంటే మీరు పెట్టుబడి పెట్టే కంపెనీ లాభాల మార్జిన్ ఎక్కువగా ఉండాలి. ఈ మార్జిన్‌ను ఏటేటా పెంచుకోవడం లేదంటే అదే స్థాయిలో కొనసాగించడం అవసరం. ఏటేటా క్షీణిస్తూ ఉంటే, బలం క్షీణిస్తున్నట్టుగా చూడొచ్చు.

ఉద్యోగులతో సంబంధాలు

కంపెనీలో పని విలువలు కూడా వాటాదారులకు విలువను తెచ్చి పెట్టే అంశాల్లో ఒకటి. మెరుగైన పని విధానం ఉన్న కంపెనీలు దీర్ఘకాలంలో వాటాదారులకు మంచి విలువను సమకూరుస్తాయని ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. కంపెనీ ఉద్యోగుల విషయంలో సముచితంగా వ్యవహరిస్తుంటే, మెరుగైన పని వాతావరణం ఉన్నప్పుడు వారు మరింత ఉత్పాదకత దిశగా పనిచేయగలరు.

వాటాల విలువ పలుచన అవుతోందా?

కంపెనీల మూలధనం పెరుగుతూ వెళుతోందా? ఏ రూపంలో అయినా కానీయండి, దీనివల్ల అప్పటికే కంపెనీలో ఉన్న వాటాల విలువ పలుచన వుతుంది. పెట్టుబడులకు ఎంపిక చేసుకునే కంపెనీల మూలధనం స్థిరంగా ఉండాలి. షేర్ల బైబ్యాక్ రూపంలో ఈక్విటీ తగ్గుతుంటే ఇంకా మంచిది. దీనివల్ల వాటాదారుల విలువ ఎప్పటికప్పుడు వృద్ధి చెందుతుంది. బ్యాంక్ స్టాక్స్‌కు ఈ విషయంలో మినహాయింపు ఇవ్వొచ్చు. ఎందుకంటే బ్యాంకులకు నిధులే వ్యాపార వస్తువు. కనుక అవి తాజా ఈక్విటీ జారీ ద్వారా ఎప్పటికప్పుడు నిధులు సమీకరిస్తూ, వ్యాపార విస్తరణపై వెచ్చిస్తుంటాయి.

ఇవి కూడా గమనించాలి..

- టెక్నాలజీ పరంగా కంపెనీ ముందుండాలి. కాలంతో పాటు వచ్చే మార్పులను ఆహ్వానించాలి. లేదంటే అస్తిత్వ ముప్పు ఏర్పడొచ్చు.
- కొన్ని రంగాల్లో చిన్న కంపెనీల కంటే పెద్ద కంపెనీలకు ప్రాధాన్యం ఇవ్వడమే మంచిది. ఉదాహరణకు టైర్ల రంగంలో చిన్న కంపెనీని ఎంపిక చేసుకోవడం కంటే ఎంఆర్ఎఫ్ వంటి పెద్ద కంపెనీలే దీర్ఘకాలంలో రాణించేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.
- ఓ కంపెనీ షేరు గణనీయంగా పడిపోయిందని ఇన్వెస్ట్ చేయడం సరికాదు. ఆ షేరు ఏ కారణాల వల్ల పడిపోయిందన్నది ముందుగా తెలుసుకోవాలి. జెట్ ఎయిర్‌వేస్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, యస్ బ్యాంక్ ఇలాంటి కేసులను అధ్యయనం చేయాలి. పడిపోతున్న షేరును కొనుగోలు చేయడం, పడిపోతున్న కత్తిని పట్టుకోవడంగా నిపుణులు చెబుతుంటారు.
- కంపెనీ రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్‌వోఈ) దీర్ఘకాలంలో పెద్దగా వృద్ధి లేకుండా అక్కడక్కడే చలిస్తుంటే.. దీనికి బదులు ఏటేటా ఆర్‌వోఈ వృద్ధి చెందే కంపెనీలే మెరుగైన రాబడులను ఇవ్వగలవు.
- సిమెంట్, మెటల్స్, షుగర్, ఆటోమొబైల్ ఇవన్నీ సైక్లికల్ కంపెనీలు. కొన్నేళ్ల కాలంలోనే ఎన్నో రెట్ల రాబడులు ఇచ్చిన తర్వాత, మళ్లీ ర్యాలీ చేయడానికి కొన్నేళ్ల సమయం తీసుకుంటాయి. ఇలాంటి కంపెనీల్లో అధిక వేల్యుయేషన్ల వద్ద ఇన్వెస్ట్ చేసే ముందు ఈ అంశాలను గమనించాలి.
- వాటాల పరంగా లిక్విడిటీ మెరుగ్గా ఉండాలి. అంటే ఫ్రీఫ్లోట్ మార్కెట్ క్యాప్ చెప్పుకోదగినంతగా ఉండాలి. లిక్విడిటీ తక్కువగా ఉంటే, మార్కెట్ కరెక్షన్లలో అమ్ముకోవడానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. కొద్దిపాటి అమ్మకాల ఒత్తిడికే షేరు ధర భారీగా పతనం చెందుతుంది. దీంతో భారీ నష్టాలు ఎదురవుతాయి. కంపెనీ షేరు ధరను కాకుండా, అంతర్గత విలువను (ఇంట్రిన్సిక్ వ్యాల్యూ) చూసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.
- కార్పొరేట్ గవర్నెన్స్ మెరుగ్గా ఉండాలి. కంపెనీ వ్యవహారాలు పారదర్శకంగా ఉన్నప్పుడే, మార్కెట్ ఆ కంపెనీకి మెరుగైన విలువను కడుతుంది. ఇనిస్టిట్యూషన్స్ పెట్టుబడులతో ముందుకు వస్తాయి. కార్పొరేట్ గవర్నెన్స్ మెరుగ్గా లేని కంపెనీలకు దూరంగా ఉంటాయి. సత్యం కంప్యూటర్స్, బ్రైట్‌కామ్ గ్రూప్, ఈకేఐ ఎనర్జీ వంటి కంపెనీల కేసులను ఇందుకు అధ్యయనం చేయొచ్చు.
- ప్రమోటర్ల వాటా కంపెనీలో ఎంత ఉందన్నది కూడా చూడాలి. కనీసం 20 శాతంపైన ఉంటే మంచిది. పైగా ప్రమోటర్లు తమకున్న వాటాలను తనఖా పెట్టారా? తనఖా పెట్టిన మొత్తం వారి వాటాల్లో 50 శాతం మించితే అటువంటి వాటికి దూరంగా ఉండాలి.



కారు రుణం ముందుగా చెల్లించడం ఎలా?





Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఒకేసారి ఫ్లెక్సీక్యాప్, లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?
– వెంకట్రామన్ శ్రీనివాసన్

మీకు ఈక్విటీల గురించి మెరుగైన అవగాహన ఉంటే అప్పుడు లార్జ్‌క్యాప్, మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు పెట్టుబడులను కేటాయించుకోవచ్చు. తద్వారా పోర్ట్‌ఫోలియోని ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి బదులు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం మరింత మెరుగైన ప్రత్యామ్నాయం అవుతుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు అన్ని రకాల మార్కెట్ విలువ కలిగి కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కాకపోతే ఆయా మార్కెట్ విభాగాలకు ఫ్లెక్సీక్యాప్‌లో కేటాయింపులు వేర్వేరుగా ఉండొచ్చు. ఉదాహరణకు ఫ్లెక్సీక్యాప్ పథకాలు లార్జ్‌క్యాప్ కంపెనీలకు ఎక్కువ కేటాయిపులు చేస్తుంటాయి. మిడ్, స్మాల్‌క్యాప్ కంపెనీలకు తక్కువ కేటాయింపులు చేస్తుంటాయి. అందుకని పెట్టుబడి మొత్తాన్ని ఒకే ఫ్లెక్సీక్యాప్ పథకంలో కాకుండా, కనీసం మూడు ఫ్లెక్సీక్యాప్ పథకాలకు కేటాయించుకోవాల్సి ఉంటుంది. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఎక్కువ ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కనుక విడిగా లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం సరైన నిర్ణయం కాబోదు. ఎక్కువ రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్లు అయితే ఒకవైపు ఫ్లెక్సీక్యాప్‌లో ఇన్వెస్ట్ చేస్తూనే, మరోవైపు 15 శాతం వరకు పెట్టుబడులను మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవడం ద్వారా మెరుగైన రాబడులు సమకూర్చుకోవచ్చు.

నేను రూ.7 లక్షలు రుణంపై కారు కొనుగోలు చేశాను. దీన్ని ముందుగా తీర్చివేయాలన్నది నా ప్రణాళిక. ఇందుకోసం ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుకూలమైన పథకాలు ఏవి? పీజీఐఎం ఇండియా మిడ్‌క్యాప్ అపార్చునిటీస్ ఫండ్‌లో రాబడులను ప్రతి మూడేళ్లకోసారి వెనక్కి తీసుకోవడం సరైన నిర్ణయమేనా?
– ఆదిత్య బి

కారు రుణాన్ని ముందుగా తీర్చివేయాలనుకోవడం మంచి నిర్ణయం. విలువ తరిగిపోయే కారు వంటి ఆస్తి కోసం రుణం తీసుకోవడం సూచనీయం కాదు. మీరు మీ కారు రుణాన్ని ఏడేళ్లలోపు తీర్చివేయాలని అనుకుంటున్నారు. కనుక స్వల్పం నుంచి మధ్యస్థ కాలానికి వీలుగా మ్యూచువల్ ఫండ్స్ పథకాలను ఎంపిక చేసుకోవాలి. పెట్టుబడులను కాపాడుకోవడంతోపాటు, రాబడులు కూడా ఇక్కడ కీలకం అవుతాయి. మీ కారు రుణాన్ని ముందుగా చెల్లించి వేయడం కోసం మీరు హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి ఇవి అనుకూలంగా ఉంటాయి. ఈక్విటీతోపాటు డెట్‌లోనూ ఈ పథకాలు పెట్టుబడులు పెడతాయి. దీంతో మీ పెట్టుబడి వృద్ధి చెందుతుంది. మార్కెట్ల పతనం, అస్థిరతలను ఎదుర్కొనే రక్షణ ఉంటుంది. మూడేళ్ల తర్వాత మీ కారు రుణాన్ని ముందుగా చెల్లించి వేయడం కోసం ప్రతి నెలా ఆదాయంలో మిగులును అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఒకవేళ మూడు నుంచి నాలుగేళ్లలోపే కారు రుణం తీర్చివేయాలని అనుకుంటే అందుకోసం ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కారు రుణాన్ని ముందుగా వదిలించుకునేందుకు మీవద్ద నెలవారీ మిగిలే మొత్తం కీలక పాత్ర పోషిస్తుంది. ఇక పీజీఐఎం ఇండియా మిడ్‌క్యాప్ అపార్చునిటీస్ అనేది మిడ్‌క్యాప్ పథకం. మిడ్‌క్యాప్ ఫండ్స్ సహజంగా స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి అస్థిరతలతో ఉంటాయి. దీర్ఘ కాలంలో ఇవి మెరుగైన రాబడులు ఇవ్వగలవు. కనుక మూడేళ్లకోసారి లాభాలను వెనక్కి తీసుకోవడం సరైన నిర్ణయం అవ్వదు.



స్టాక్స్ వ్యూ

ఏపీఎల్ అపోలో ట్యూబ్స్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,707 టార్గెట్: రూ. 1,930



ఎందుకంటే: దేశీయంగా స్ట్రక్చరల్ స్టీల్ ట్యూబ్స్ తయారీకి ప్రసిద్ధి చెందిన ఏపీఎల్ అపోలో ట్యూబ్స్ రాయ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ప్లాంటును ఇటీవల సందర్శించాం. తద్వారా కంపెనీ తయారీ విధానాలపట్ల లోతైన అవగాహన కలిగించుకోవడంతోపాటు.. నిర్వహణాపరమైన సన్నద్ధతను అర్థం చేసుకోవడం, మార్కెట్లో ప్రత్యర్థి కంపెనీలతో తలెత్తే పోటీలో కంపెనీకున్న సానుకూల అంశాలను తెలుసుకోవడం తదితరాలకు ప్లాంటు సందర్శన దోహదపడింది. విలువ జత చేయగల ప్రొడక్టుల తయారీకి వార్షికంగా 1.2 ఎంటీతో ఏర్పాటైన రాయ్‌పూర్ ప్లాంటు సామర్థ్య వినియోగం క్రమంగా పుంజుకోనున్నట్లు అంచనా. నారో ఫ్లాట్ ప్రొడక్టుల లైన్ కోల్డ్ కమిషనంగ్(పరిశీలన) స్థాయిలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికాని(అక్టోబర్–డిసెంబర్)కల్లా నిలకడను సాధించనుంది. జనవరి– మార్చి(క్యూ4)లో నెలకు 60–70 కిలో టన్నుల రేటును అందుకోగలదని భావిస్తున్నారు. వివిధ పరిమాణాల, విభిన్న ప్రొడక్టుల తయారీలో ప్లాంటు సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఉదాహరణకు 1500 ఎంఎం రూఫింగ్ షీట్లు(ప్రత్యర్థి కంపెనీల నుంచి 1250 ఎంఎం మాత్రమే) రూపొందిస్తుంది. డిమాండుకు అనుగుణంగా సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుంది. వార్షికంగా 300 కిలో టన్నుల వరకూ యూనిట్ ఏర్పాటుకు అనువైన భూమిని కలిగి ఉంది. వెరసి రాయ్‌పూర్ ప్లాంటు సామర్థ్య వినియోగం పుంజుకుంటే నిర్వహణ లాభం(ఇబిటా) సైతం మెరుగుపడే వీలుంది.

టీవీఎస్ సప్లై చైన్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 227 టార్గెట్: రూ. 265



ఎందుకంటే: థర్డ్ పార్టీ లాజిస్టిక్స్‌కు 2000 ప్రాంతంలోనే పేరొందిన టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్(టీఎస్‌సీఎస్) ప్రస్తుతం దేశీయంగా అతిపెద్ద సమీకృత సప్లై చైన్ సొల్యూషన్స్ దిగ్గజంగా ఆవిర్భవించింది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న కంపెనీలలో ఒకటిగా నిలుస్తోంది. కెపాసిటీ(సామర్థ్యాలు), కస్టమర్, కంట్రీ(3సీ) వ్యూహాలతో గత 16 ఏళ్లకాలంలో ఏకంగా 20 కంపెనీలను కొనుగోలు చేసింది. ప్రపంచవ్యాప్తంగా కంపెనీ అత్యంత విస్తారిత రంగాలలో కార్యకలాపాలు కలిగి ఉంది. ఇండస్ట్రియల్, ఆటో, కన్జూమర్, హెల్త్‌కేర్, ఐటీ, టెక్ ఇన్‌ఫ్రా తదితర రంగాలలో సేవలు విస్తరించింది. మార్చితో ముగిసిన గతేడాది(2022–23) 8,700 మంది కస్టమర్లకు సర్వీసులు అందించింది. వీటిలో టాప్–5 నుంచి 18%, టాప్–10 నుంచి 28%, టాప్– 20 కస్టమర్ల నుంచి 39% చొప్పున ఆదాయం సాధించింది. వీటిలో 2022 జాబితా ఫార్చూన్ 500 కంపెనీలలో 72 సంస్థలున్నాయి. కస్టమర్ కార్యకలాపాలతో మమేకంకావడం ద్వారా సహజంగానే కస్టమర్ సంస్థలతో దీర్ఘకాలిక సంబంధాలు కొనసాగించేందుకు వీలు చిక్కుతోంది. సమీకృత సరఫరా చైన్ సొల్యూషన్స్, నెట్‌వర్క్ సొల్యూషన్స్‌లో టాప్–10 కస్టమర్లతో సగటున 10–12 ఏళ్లగా సంబంధాలు కొనసాగిస్తోంది. వెరసి భారీ టర్నోవర్‌తోపాటు.. పటిష్ట మార్జిన్లను అంచనా వేయగలుగుతోంది. కాగా.. 2018–19లో చేపట్టిన భారీ కొనుగోళ్లు.. యూఎస్– చైనా వివాదాలు, రష్యా– ఉక్రెయిన్ యుద్ధం, కోవిడ్–19 తదితర సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం జోరందుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. కస్టమర్ల ఔట్‌సోర్సింగ్ అవసరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో కంపెనీకున్న సామర్థ్యాలు, ప్రపంచవ్యాప్త కార్యకలాపాలు భారీ లబ్ధిని చేకూర్చవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే



రాజస్తాన్‌లో కాంగ్రెస్‌కు.. వ్యతిరేక పవనాలు

144 మందితో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ మొదటి జాబితా

- 69 మంది సిట్టింగ్‌లకు మళ్లీ అవకాశం
- సీఎం చౌహాన్‌పై విక్రమ్ మస్తల్ పోటీ



భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి వచ్చే నెల 17న జరగనున్న ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ 144 మందితో కూడిన మొదటి జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఇందులో రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్‌తోపాటు 69 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలున్నారు. టీవీ సీరియల్‌లో హనుమాన్ పాత్రధారిగా మంచి పేరు తెచ్చుకున్న నటుడు విక్రమ్ మస్తల్ బుధ్ని బీజేపీకి చెందిన సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌పై పోటీకి దిగనున్నారు. మాజీ సీఎం కమల్‌నాథ్ తన సొంత నియోజకవర్గం ఛింద్వారా నుంచి బరిలోకి దిగుతారు. రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ కుమారుడు జైవర్ధన్ సింగ్ రాఘవ్‌గఢ్ నుంచి, సోదరుడు లక్ష్మణ్ సింగ్ చచౌరా నుంచి పోటీ చేయనున్నారు. వీరిద్దరూ ఆయా స్థానాల్లో సిట్టింగ్‌లే. మొదటి జాబితాలో 39 మంది ఓబీసీలు, 22 మంది ఎస్సీలు, 30 మంది ఎస్టీలకు స్థానం కల్పించినట్లు కాంగ్రెస్ నేత చరణ్ సింగ్ సాప్రా చెప్పారు. ఇంకా జనరల్ కేటగిరీలో 47 మంది, మైనారిటీ వర్గం నుంచి ఆరుగురికి, మరో 19 మంది మహిళలకు కూడా అవకాశమిచ్చామన్నారు. అసెంబ్లీలోని 230 సీట్లకు గాను బీజేపీ ఇప్పటికే 136 మందితోకూడిన మొదటి జాబితా విడుదల చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో 30 మందితో మొదటి జాబితా

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి వచ్చే నెలలో రెండు విడతలుగా జరగనున్న ఎన్నికలకు గాను ఆదివారం కాంగ్రెస్ పార్టీ 30 మంది అభ్యర్థులతో మొదటి జాబితా విడుదల చేసింది. ముఖ్యమంత్రి భూపేష్ భగేల్, ఆయన మంత్రివర్గంలోని 12 మంది, అసెంబ్లీ స్పీకర్ మహంత్ సహా 22 మంది పాత వారు కాగా, కొత్తగా ఎనిమిది మందికి అవకాశం కల్పించింది. సిట్టింగ్‌లు 8 మందికి మొండిచేయి చూపింది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ దీపక్ బైజ్‌ను ఈసారి అసెంబ్లీ బరిలో దించుతోంది. 'మొదటి విడత పోలింగ్ జరిగే 20 స్థానాలకు గాను 19 చోట్ల అభ్యర్థులను ఇప్పటికే ఖరారు చేశాం. జగదల్‌పూర్ స్థానానికి కూడా సాయంత్రానికల్లా ప్రకటిస్తాం. 90 సీట్లున్న అసెంబ్లీలో 75 సీట్లలో మేమే విజయం సాధిస్తాం' అని బైజ్ చెప్పారు.

దానికి తోడైన ఇంటి పోరు

అవినీతిపై బీజేపీ ముమ్మర ప్రచారం

సమస్యలకు ఎదురీదుతున్న గహ్లోత్

'రాజస్తాన్‌లో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటాపోటీగా ఉండనుంది'

– ఈ మాటలన్నది ఏ ఎన్నికల విశ్లేషకుడో కాదు. స్వయానా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ! ఇది కేవలం నెల రోజుల క్రితం సంగతి!. తమ పాలనలోని ఈ రాష్ట్రంపై ఈసారి ఆ పార్టీ ఏ మేరకు ఆశలు పెట్టుకుందో చెప్పేందుకు ఈ వ్యాఖ్యలే నిదర్శనం. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఇతర రాష్ట్రాలతో, ముఖ్యంగా మధ్యప్రదేశ్‌తో పోలిస్తే రాజస్తాన్‌లో కాంగ్రెస్ పరిస్థితి అంత ఆశావహంగా ఏమీ లేదని ఆ పార్టీ స్థానిక నేతలే చెబుతున్నారు. ఇందుకు కారణాలూ అనేకం. రాజస్తాన్‌లో 1990లో బీజేపీ తొలిసారి అధికారంలోకి వచ్చింది. అప్పటినుంచీ అక్కడ దానికి, కాంగ్రెస్‌కు ద్విముఖ పోరే సాగుతూ వస్తోంది. ఇక ప్రభుత్వ వ్యతిరేకత ఇక్కడ ఎప్పుడూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానాంశంగానే ఉంటుంది. అలా చూసుకున్నా ఈసారి అధికారం తమదేనని బీజేపీ ధీమాగా ఉంది. గహ్లోత్ సర్కారు విచ్చలవిడి అవినీతికి పాల్పడుతోందని, అసమర్థ పాలన సాగుతోందని సర్వత్రా అభిప్రాయం నెలకొందని చెబుతోంది. దీనికి తోడు రాష్ట్ర కాంగ్రెస్ నేతల అంతర్గత పోరు తమ పనిని మరింత తేలిక చేస్తుందని భావిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉండటం, ప్రధాని మోదీ ఛరిష్మా వంటివి మరింతగా కలిసొస్తాయని కాషాయ నేతలంటున్నారు. తమ డబుల్ ఇంజన్ నినాదానికే ఈసారి రాజస్తానీలు ఓటేస్తారని బీజేపీ ఆశతో ఉంది. ఈ నేపథ్యంలో ఒకవైపు యువ నేత సచిన్ పైలట్ అసమ్మతి రాగాలను ఎదుర్కొంటూనే, మరోవైపు ప్రభుత్వ వ్యతిరేకతకూ అడ్డుకట్ట వేసేందుకు సీఎం అశోక్ గహ్లోత్ చెమటోడుస్తున్నారు.





పథకాలే పథకాలు...

ఎన్నికల వేళ ఓటర్లను ఆకట్టుకునేందుకు కొద్ది నెలల ముందునుంచే పలు ప్రజాకర్షక పథకాలకు గహ్లోత్ తెర తీశారు.

- ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ పథకం అమలు
- రాష్ట్రంలో కులాలవారీగా జన గణన
- రూ.25 లక్షల ఆరోగ్య బీమా కవరేజీ
- పట్టణ ఉపాధి హామీ పథకం
- సామాజిక భద్రత కింద ఒక్కొక్కరికి నెలకు రూ.1,000
- ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్
- కులగణన ప్రకటన ఓబీసీలు తదితర ప్రాబల్య వర్గాల్లో బాగా పని చేస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది.
- తూర్పు రాజస్తాన్ కెనాల్ ప్రాజెక్టుతో ఆ ప్రాంతమంతటికీ తాగు, సాగునీరు అందిస్తామని చెబుతోంది.
- పథకాల్లో లబ్ధిదారులుగా చేరేందుకు ఇన్‌ఫ్లేషన్ రిలీఫ్ క్యాంపుల్లో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా గహ్లోత్ స్వయంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు!



బీజేపీది అదే వ్యూహం...

రాష్ట్రంలో తమకనువైన పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ విశ్వసిస్తోంది. వాటినుంచి గరిష్టంగా ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తోంది.

- అయితే రాష్ట్ర బీజేపీలోనూ గ్రూపు తగాదాలకు కొదవ లేదు!
- మాజీ సీఎం వసుంధర రాజే వర్గం ఈసారి ఆమే ముఖ్యమంత్రి రేస్‌లో ముందున్నారని ఇప్పట్నుంచే ప్రచారం చేస్తున్నారు. ఇతర సీనియర్లకు ఇది నచ్చడం లేదు.
- దాంతో ఎందుకైనా మంచిదని మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో మాదిరిగా రాజస్తాన్‌లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీజేపీ ముందస్తుగా ఎవరినీ ప్రకటించలేదు. తద్వారా ఎన్నికల వేళ సీనియర్లలో అసంతృప్తులు చెలరేగి సహాయ నిరాకరణ తదితరాలకు దారి తీయకుండా జాగ్రత్త పడుతోంది.
- ఎప్పట్లాగే మోదీ మేనియానే తారకమంత్రంగా బీజేపీ రంగంలోకి దిగింది. ఆయన ఇప్పటికే రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలతో హోరెత్తిస్తున్నారు.
- హిందూత్వ కార్డును ప్రబలంగా బీజేపీ ప్రయోగిస్తోంది. గతేడాది రాష్ట్రంలో జరిగిన మత కల్లోలాలను మోదీ స్వయంగా గహ్లోత్ సొంత అసెంబ్లీ స్థానమైన సర్దార్‌పురా ఎన్నికల సభలో ప్రస్తావించారు!

2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

మొత్తం అసెంబ్లీ స్థానాలు	200
బీజేపీ	73
కాంగ్రెస్	100
స్వతంత్రులు	13
ఇతరులు	14

2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

మొత్తం స్థానాలు	25
బీజేపీ	24
కాంగ్రెస్	0
ఆర్‌ఎల్‌పీ	1

ఇంటిపోరు ఏం చేసేనో...!

పథకాలు, ప్రచారాల మాటెలా ఉన్నా, నానాటికీ తీవ్రమవుతున్న ఇంటి పోరుతో గహ్లోత్ సతమతమవుతున్నారు.

- అధికారంలోకి వచ్చిన నాటినుంచీ పార్టీ యువ నేత సచిన్ పైలట్ ఆయనకు కంట్లో నలుసుగా మారారు.
- 2020లో పైలట్ బహిరంగంగా గహ్లోత్‌పై తిరుగుబావుటా ఎగరేశారు.
- అధిష్టానం జోక్యంతో అప్పటికి తగ్గినా అడుగడుగునా గహ్లోత్‌ను ఆయన ముప్పుతిప్పలు పెడుతున్నారు.
- అంతటితో ఆగకుండా తీవ్రమైన అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు.
- అసమర్థ పాలన సాగుతోందంటూ విమర్శలు సంధిస్తూ బీజేపీ పని తేలిక చేస్తున్నారు.
- అటు బీజేపీని, ఇటు అమస్మతిని, తిరుగుబాటును ఎదుర్కోలేక గహ్లోత్ సతమతమవుతున్నారు!

– నేషనల్ డెస్క్, సాక్షి

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి 'ఎడ్యుకేషన్ జ్యూరీ' అవార్డు ప్రదానం

సాక్షి,అమరావతి: ప్రతిష్టాత్మక ఎడ్యుకేషన్ వరల్డ్ గ్రాండ్ జ్యూరీ అవార్డు–2023ను ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అందుకున్నారు. ఢిల్లీలో మారియట్ హోటల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ ఏలియన్స్ (నిసా)అధ్యక్షుడు కులభూషణ శర్మ, ఎడ్యుకేషన్ వరల్డ్ ప్రతినిధుల చేతుల మీదుగా ఎంవీ రామచంద్రారెడ్డి, వారి ప్రతినిధుల బృందం అందుకుంది. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ సంఘాన్ని ఎడ్యుకేషన్ పరంగానూ అలాగే సామాజిక బాధ్యతతో అనేక సేవా కార్యక్రమాల్లో ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి విష్ణు ప్రసాద్, అదనపు కార్యదర్శి ఎం.వి.ఎస్.శర్మ, కోశాధికారి ఎం.వి.రావు, రాష్ట్ర ఐటీ విభాగం చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఖాశీం తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ప్రతినిధుల బృందం

కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆంజనేయులు

బి.కొత్తకోట: కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా అనంతపురం జిల్లాకు చెందిన బి.ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌లో ఎన్నికల కమిటీ చైర్మన్ ఎన్.ఈశ్వరయ్య అధ్యక్షతన రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. 13 ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బల్లె రెడ్డిప్రసాద్ (మదనపల్లె), గౌరవ అధ్యక్షుడిగా నాగభూషణం (చిత్తూరు), ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు (కర్నూలు), ఉపాధ్యక్షులుగా ఆవులరెడ్డి శేఖర్ (అన్నమయ్య), కార్యవర్గ సభ్యులుగా జీవీ శివకుమార్ (మదనపల్లె), హేమంత్ (చిత్తూరు), కే శ్రీరాములు (మదనపల్లె), కే రాజేష్, కృష్ణమూర్తి (అనంతపురం)ను ఎన్నుకున్నారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బి.లింగప్రసాద్ (అనంతపురం), ఉపాధ్యక్షుడిగా శివ (రాయచోటి), మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా శివబాల (అనంతపురం) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వెల్లడించింది.



ఆంజనేయులు



రెడ్డి ప్రసాద్

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా కలాం జయంతి వేడుకలు

సాక్షి,అమరావతి: భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ.. భారతజాతి గర్వించదగిన విలక్షణ వ్యక్తిత్వం, నిరాడంబరమైన జీవనం కలిగిన మరువురాని మహా మనిషి కలాం అని, ఆయన ఆదర్శనీయుడని అన్నారు. కలాం జన్మదినమైన అక్టోబర్ 15న ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. సంక్షేమాభివృద్ధిలో ఏపీ దూసుకుపోతున్నదని, అందుకు సాక్ష్యం తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా సీఎం జగన్ తీసుకొచ్చిన పెన్షన్ పథకాన్ని తాము కూడా తెలంగాణలో అమలు చేస్తామని చెప్పటమేనని అన్నారు. దేశంలోని ఎందరో ముఖ్యమంత్రులు సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగులు) నలమారు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..శ్రమతత్వం, అంకిత భావంతో, చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ అత్యున్నత శిఖరానికి ఎదిగిన అరుదైన వ్యక్తి కలాం అని అన్నారు. నవరత్నాల ఎగ్జిక్యూటివ్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, లిడ్ క్యాప్ డైరెక్టర్ సత్యప్రియ, వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం అధ్యక్షులు కిరణ్ రాజ్, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.